సోమవారం
04-8-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 314
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad,Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

గడ్కరి నివాసానికి బాంబు బెదిరింపు

నాగపూర్: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి నాగపూర్ నివాసాన్ని పేల్చేస్తామంటూ అజ్ఞాత వ్యక్తి నుంచి ఆదివారం ఉదయం 8.46 గంటలకు ఫోన్ కాల్ వచ్చింది. వార్ధా రోడ్డులోని గడ్కరి ఇల్లు పేల్చేస్తామని సమాచారం రావడంతో పోలీసులు స్థానిక ప్రతాప్ నగర్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. ఆ తర్వాత కొద్దిసేపటికే బెదిరింపు కాల్ చేసిన అనుమానితుడిని అరెస్టు చేశారు. అతనిని ఉమేష్ విష్ణు రౌత్‌గా గుర్తించారు. తుల్సి బాగ్ రోడ్డులో ఉంటున్న రౌత్... మెడికల్ చౌక్ సమీపంలోని స్థానిక సారా

- మిగతా 2 లో

ఏపీలో మూడు రోజులు వర్షాలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఏపీలో మూడు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఉత్తర తమిళనాడుకు నైరుతి దిశగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. దీని ప్రభావంతో రాబోయే మూడు రోజులు పల్నాడుతో పాటు రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వర్షాలతో పాటు పిడుగులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని

- మిగతా 2 లో

రేపు ఈసీ మోసాలు బయటపెడతాం

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘంపై విమర్శనాస్త్రాలకు కాంగ్రెస్ మరింత పదును పెంచింది. ప్రజాస్వామిక విలువలతో రాజీ పడుతున్నట్లు విమర్శించింది. ఎన్నికల సంఘం మోసాలన్నీ బహిర్గతం చేస్తామంటూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదివారం వెల్లడించారు. ఈనెల 5వ తేదీన బెంగళూరులో జరగబోయే నిరసన ఇందుకు వేదిక కానున్నట్లు ప్రకటించారు. ఈసీ వివక్షపూరిత వైఖరిని ఎండగట్టారు. ఈసీ తాజా 'ఎస్ఐఆర్' జాబితాలో అనేక మంది ఓటర్ల పేర్లు తొలగించినట్లు వేణుగోపాల్ ఆరోపించారు.

చుక్క నీరు వదులుకోం

▸ రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం ▸ బనకచర్ల పాపం బీఆర్ఎస్‌దే

▸ ఏపీ కుట్రలు అడ్డుకుంటాం: భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్: తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన సాగునీటి వాటాలో ఒక్క చుక్క నీటిని కూడా వదులుకోబోమని, తమకు రాజకీయాల కంటే రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బనకచర్ల పాపం బీఆర్ఎస్ దేనని, ఏపీ ప్రభుత్వం పన్నుతున్న కుట్రలు, కుతంత్రాలను అడ్డుకుని తీరుతామన్నారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం కమలాపురంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ రూ.10 కోట్లతో నిర్మించతలపెట్టిన 10వేల మెట్రిక్ టన్నుల గోదాముల నిర్మాణ పనులకు ఆదివారం ఆయన భూమి పూజ చేశారు. అనంతరం భట్టి మాట్లాడుతూ... గతంలో 5.91 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న గోదాంలు రైతులకు అందుబాటులో ఉండేవని, మేం అధికారంలోకొచ్చిన ఏడాదిన్నర కాలంలోనే కొత్తగా 10.75 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న గోదాంలను నిర్మించామన్నారు. అన్నదాతల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. ఉమ్మడి ఏపీలో సాగునీటి రంగంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఇప్పుడు కూడా అవే కుట్రలు జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ వాటిని సమర్థవంతంగా తిప్పి కొట్టాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఢిల్లీవెళ్లి వాదనలు వినిపించడం వల్లే బనకచర్ల ప్రాజెక్టుకు బ్రేక్ పడిందని చెప్పారు. రూ.లక్ష కోట్లు వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం వల్ల ఒక్క ఎకరాకు కూడా నీళ్లందడం లేదు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు విమర్శలు మాని, అసలు విషయాలను తెలుసుకోవాలి అని సూచించారు. 'అప్పుడు పోలవరం కడుతుంటే చోద్యం చూశారు. బనకచర్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతుంటే పట్టించుకోలేదు. పైగా... అప్పటి ఏపీ పాలకులకు రెడ్ కార్పెట్ తో స్వాగతం పలికి రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టారని బీఆర్ఎస్‌పై ధ్వజమెత్తారు. విభజన చట్టంలో లేకపోయినా ఆర్డినెన్స్ ద్వారా 7 మండలాలను ఏపీలో కలుపుతుంటే స్పందించలేదని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్క

- మిగతా 2 లో

కదం తొక్కిన మానవత్వం

గాజాకు రక్షణ, సాయం కోసం భారీ మార్చ్

▸ వేలాది మందితో కిక్కిరిసిన సిడ్నీ హార్బర్ బ్రిడ్జి ▸ పాల్గొన్న అసాంజె సహా ఆస్ట్రేలియా ప్రముఖులు

▸ సిగ్గు... సిగ్గు ఇజ్రాయిల్ నినాదాలు ▸ తక్షణమే యుద్ధం ఆపాలని డిమాండ్

సిడ్నీ: మానవత్వం కోసం ఆస్ట్రేలియన్లు కదం తొక్కారు. గాజా, పలస్తీనియన్ల రక్షణ ఉద్దేశంతో సిడ్నీ హార్బర్ బ్రిడ్జిపై ఆదివారం భారీ ప్రదర్శన నిర్వహించారు. 'మానవత్వం కోసం మార్చ్... గాజాకు రక్షణ' అనే పెద్ద బ్యానర్‌ను ప్రదర్శించారు. వేలాది మంది పాల్గొనడంతో బ్రిడ్జి కిక్కిరిసింది. ఇసుక వేస్తే రాలని చందంగా మారింది. ప్రపంచానికి మరో పక్క జరుగుతున్నది చూస్తూ ఊరుకోలేమని, వారికి మద్దతుగా గళం వినిపిస్తున్నామని నిర్వాహక సంస్థ 'పలస్తీనా యాక్షన్ ప్లాన్' పేర్కొంది. తమ మార్చ్‌కు నిర్దేశించిన తేదీకి ఒక్క రోజు ముందే సుప్రీం కోర్టు అనుమతి లభించిందని, ఈ నిర్ణయం చారిత్రకమని నిర్వాహకులు పేర్కొన్నారు. మార్చ్ అగ్రభాగాన

- మిగతా 2 లో

కాంగ్రెస్ అవినీతి పాలన: కేటీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన 20 నెలల అసమర్థ, అరాచక, అవినీతి పాలనకు ప్రజలు గట్టి బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ... రానున్న ఉపఎన్నికల్లో అన్ని వర్గాలను మోసం చేసిన కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టాలని అన్నారు. ఎన్నికల ముందు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే ... తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలను డిక్లరేషన్లపేరుతో మోసం చేశారని కేటీఆర్ ఆరోపించారు. హామీలను నెరవేర్చకుండా రేవంత్ రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో జరుగుతున్న మోసాలు, కుంభకోణాలను ప్రజలు అంగీకరిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ భావించి, అభివృద్ధి కార్యక్రమాలను కూడా నిలిపివేస్తుంది అని హెచ్చరించారు. రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి చేస్తున్న అవినీతి, కుంభకోణాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాపాడుతోందని, అందుకే మోదీ ఇప్పటివరకు ఒక్క కేసు కూడా పెట్టలేదని విమర్శించారు. ఈ రెండు పార్టీల ఏకైక అజెండా తెలంగాణ పార్టీని ఓడించడమేనని అన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్‌ను ఒక అగ్రగామి నగరంగా తీర్చిదిద్దిందని కేటీఆర్ గుర్తు చేశారు.

కేసీఆర్ ఎప్పుడూ మతం పేరుతో రాజకీయాలు చేయలేదని, అందుకే పదేళ్లలో హిందూ-ముస్లిం, ఆంధ్రా- తెలంగాణ గొడవలు జరగలేదని అన్నారు. దివంగత మాగంటి గోపీనాథ్ సేవలను కొనియాడారు. ఉపఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని గెలుపు కోసం కష్టపడాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త ... కేసీఆర్-కాంగ్రెస్ పాలన మధ్య తేడాను ప్రజలకు వివరించాలని సూచించారు.

బెట్టింగ్ ముఠా అరెస్టు

హైదరాబాద్: ఆన్‌లైన్‌లో గుర్రపు పందేల బెట్టింగ్ నిర్వహిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. దమ్మాయిగూడలో సోదాలు నిర్వహించిన జవహర్‌నగర్ పోలీసులు ఈ ముఠాను అదుపులోకి తీసుకున్నారు. నిందితులను తోకల నగేశ్, వెంకయ్య చౌదరి, చల్లా రమేశ్‌బాబు, సునీల్‌గా గుర్తించారు. ఫైన్‌వెల్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో 105 మందితో వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసిన నిందితులు, ఇప్పటి వరకు రూ.8.34 కోట్లు కాజేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి రూ.2 లక్షల నగదు, సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఎస్ఐఆర్‌పై చర్చకు కేంద్రం విముఖత

న్యూఢిల్లీ: ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై చర్చకు మోదీ సర్కారు భయపడుతోంది. అందుకే చర్చకు అంగీకరించడానికి ముందుకు రావడం లేదు. దీని నుంచి పక్కకు తప్పుకోవడానికి తంటాలు పడుతోంది. అందుకనుగుణంగా అధికార ఎన్డీఏ వ్యూహం పన్నుతోంది. ఎస్ఐఆర్‌పై చర్చ కోసం ప్రతిపక్షాలు ఐక్యంగా డిమాండ్ చేసినప్పటికీ కేంద్రం నుంచి సానుకూల స్పందన రావడం లేదు. పార్లమెంటులో కొనసాగుతున్న ప్రతిష్టంభన నడుమ ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో కీలకమైన క్రీడా బిల్లును ఆమోదించాలని ఒత్తిడి చేసే అవకాశం ఉంది. క్రీడా సంస్థల పనితీరులో ఎక్కువ పారదర్శకత కల్పించే జాతీయ క్రీడా పాలన బిల్లును దిగువ సభ పరిశీలన, ఆమోదం కోసం జాబితా చేసింది. ఆగస్టు 13 నుంచి అమలులోకి వచ్చేలా మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను మరో ఆరు నెలలు పొడిగించడంపై హోం మంత్రి అమిత్ షా చేసిన తీర్మానాన్ని రాజ్యసభ ఆమోదానికి జాబితా చేసింది. పహల్గాం ఉగ్ర దాడి, ఆపరేషన్ సిందూర్‌పై ఉభయ సభలలో రెండు రోజుల చర్చ తప్ప జులై 21న వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి పార్లమెంటు కార్యకలాపాలు దాదాపుగా స్తంభించాయి. బీహార్‌లో ఓటర్ల

- మిగతా 2 లో

బనకచర్లను అడ్డుకుంటాం

▸ 968 టీఎంసీల వినియోగానికి గోదావరి నదిపై ప్రాజెక్టు

▸ తుమ్మిడిహెట్టి, ఇచ్చంపల్లి వద్ద బ్యారేజీ నిర్మాణం

▸ మంథని, పెద్దపల్లికి సాగునీటికి చర్యలు

▸ రాష్ట్ర వ్యాప్తంగా 8.60 లక్షల నూతన రేషన్ కార్డులు: మంత్రి ఉత్తమ్

విశాలాంధ్ర - హైదరాబాద్ / పెద్దపల్లి/ సింగరేణి: గోదావరి నదిపై తెలంగాణకు కేటాయించిన 968 టీఎంసీల నీరు పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా ప్రాజెక్టులు నిర్మిస్తామని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. అంతర్గాం మండలం గోలివాడ వద్ద రామగుండం ఎత్తిపోతల పథకాన్ని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, ఐటీ శాఖ మంత్రి దుదిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారు హరకర వేణుగోపాల్, కలెక్టర్ కోయ శ్రీహర్ష , రామగుండం ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, మేడిపల్లి సత్యం, చింతకుంట విజయ రమణారావులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఉత్తమ్ మాట్లాడుతూ పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణానికి పూర్తి వివరాలతో కూడిన ప్రాజెక్ట్ నివేదిక తయారు చేసేందుకు రూ.1.10 కోట్లు మంజూరు చేశామని అన్నారు. రామగుండం ఎత్తిపోతల ద్వారా రూ. 75 కోట్లు ఖర్చు చేసి అంతర్గాం, ముర్మూరు, బ్రాహ్మణ పల్లి ,ఎల్లంపల్లి, సోమనపల్లి, మద్దిరాల, తొట్యాలపురం గ్రామాలకు, 17 ఎల్ ద్వారా కుక్కల గూడూరు, నిట్టూరు గ్రామాలకు 13 వేల ఎకరాలకు పైగా సాగు నీరు చేరుతుందని వివరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ చట్టబద్ధత సాధించడంలో మంత్రి పూర్ణం ప్రభాకర్ కృషి చేశారని అన్నారు. తెలంగాణ నీటి హక్కులను హరిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బనకచర్ల ప్రాజెక్టు నిర్మించాలని చూస్తుందని, గోదావరి పేపర్ మేనేజ్మెంట్ బోర్డు నుంచి సీడబ్ల్యూసీ వరకు ఫిర్యాదు చేసి ఆ ప్రాజెక్టును అడ్డుకున్నామని చెప్పారు. ఏపీ పునర్విభజన చట్టం, నీటి హక్కులకు వ్యతిరేకంగా బనకచర్ల ప్రాజెక్టు నిర్మించాలని ఏపీ చూస్తుందని, దీనిని అన్ని వేదికలలో, న్యాయ పరంగా తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకిస్తుందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో గత ప్రభుత్వం రూ.లక్ష కోట్లు వృథా చేసిందని అన్నారు. దోపిడి చేయడానికి కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిందని విమర్శించారు. అయినా... మంథని నియోజకవర్గం, పెద్దపల్లి జిల్లాకు ఒక ఎకరాకు నీరు అందించలేదని తెలిపారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఘోష్ అందించిన నివేదికను క్యాబినెట్ ముందు పెడ్తామని పేర్కొన్నారు. తుమ్మడిహట్టి ప్రాజెక్టు రూ.38 వేల కోట్లతో నిర్మించి ఉంటే నేడు గోదావరి పరివాహక ప్రాంతంలో కరువు ఉండేది కాదన్నారు. గత సంవత్సరం రికార్డు స్థాయిలో 2.81 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి జరిగిందని అన్నారు. మంథని రామగుండం, పెద్దపల్లికి సాగు నీరు అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. తుమ్మిడిహెట్టి దగ్గర బ్యారేజి నిర్మాణం

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఎక్కడో ఎంపీగారికి శిక్ష పడిందా? ఓకే! కానీ మన ఎంపీగారి పాపం ఇంకా పండలేదుగా,అందుకే ఆయన బయటున్నాడు!

మాటల యుద్ధం

నాపై ఓ పెద్ద నాయకుడు కుట్ర: కవిత

కేసీఆర్ శత్రువుల వ్యాఖ్యలే: జగదీశ్‌రెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్: ఇంటి ఆడబిడ్డపై వ్యాఖ్యలు చేస్తే బీఆర్ఎస్ సోదరులు ఒక్క మాట కూడా మాట్లాడలేదని ఎమ్మెల్సీ కవిత అన్నారు. మీడియాతో ఆదివారం ఆమె మాట్లాడుతూ... తనపై కుట్ర చేస్తోంది పెద్ద నాయకుడు అని ఆరోపించారు. 'నల్లగొండ జిల్లాలో పార్టీ ఓటమికి కారణమైన లిల్లీపుట్ నాయకుడు తన గురించి మాట్లాడతాడా... కేసీఆర్ లేకుంటే ఆ లిల్లీపుట్ ఎవరు... మా నాన్న కేసీఆర్‌కు రాసిన లేఖ బయటకు లీక్ చేసింది ఎవరు... బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ ఎందుకు మాట్లాడారో నాకు తెలియదు. ఆయన నాకు తెలుసు కానీ, గత ఆరు నెలల్లో ఎప్పుడూ మాట్లాడలేదు. ప్రభుత్వం, కోర్టు అనుమతి లేకుంటే ఇంటి నుంచే బీసీ రిజర్వేషన్ల కోసం దీక్ష చేస్తా. మ్యాచ్ ఫిక్సింగ్ చేసే వారే... తన వెనుక ప్రభుత్వం ఉందంటే ఎలా' అని కవిత అన్నారు.

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ శత్రువులు చేసే వ్యాఖ్యలను ఎమ్మెల్సీ కవిత మరోసారి వల్లెవేశారని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. కవిత వ్యాఖ్యలపై ఆదివారం ఉదయం ఆయన స్పందిస్తూ... 'నా ఉద్యమ ప్రస్థానంపై కవితమ్మకు ఉన్న జ్ఞానానికి నా జోహార్లు. ఆమె చేసిన ప్రయత్నానికి నా సానుభూతి తెలియజేస్తున్నా. కేసీఆర్‌తో మాట్లాడిన విషయాలే మీడియాతో చెప్పాను. ఆయనతో భేటీలో కవిత అంశం ప్రస్తావించలేదు. బనకచర్ల, కాళేశ్వరం, ఎరువుల అంశాలపై మాత్రమే మాట్లాడాను. నల్లగొండలో పార్టీ గత విజయాలకు తానే కారణమైతే... ఇప్పుడు ఓటమికీ తానే కారణం. బీఆర్ఎస్‌కు క్రమశిక్షణ కలిగిన సైనికుడిని' అని జగదీశ్‌రెడ్డి అన్నారు.

తల్లీ... ఇద్దరు కుమార్తెల దారుణ హత్య

విశాలాంధ్ర - సామర్లకోట: కాకినాడ జిల్లా సామర్లకోట సీతారామకాలనీలో దారుణం జరిగింది. తల్లీ, ఇద్దరు కుమార్తెలు హత్యకు గురయ్యారు. గుర్తు తెలియని వ్యక్తులు తలలు పగులగొట్టి ముగ్గుర్నీ

- మిగతా 2 లో

తేజస్వి ఓటరు ఐడీపై వివాదం

కార్డు అప్పగించాలని ఈసీ ఆదేశం

పట్నా: ఆర్జేడీ నాయకుడు తేజస్వీ యాదవ్ ఓటరు ఐడీపై వివాదం నెలకొంది. అధికారికంగా జారీ కాని పరిస్థితుల్లో తన కార్డును విచారణ కోసం అప్పగించాలని ఎన్నికల సంఘం ఆదివారం తేజస్విని ఆదేశించింది. ఎస్ఐఆర్‌లో భాగంగా ప్రచురించిన ముసాయిదా జాబితాలో తన పేరు లేదని బీహార్ ప్రతిపక్ష నాయకుడు ఆరోపించారు. ఆన్‌లైన్‌లో ఈపీఐసీ నంబరు శోధన ద్వారా తన వాదనకు బలం చేకూర్చే ప్రయత్నం చేశారు. దీనిపై సంబంధిత అధికారులు తీవ్రంగా స్పందించారు. ఈ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. 'మా ప్రాథమిక దర్యాప్తు ప్రకారం శనివారం విలేకరుల సమావేశంలో మీరు (తేజస్వి) పేర్కొన్న

- మిగతా 2 లో

సొరంగంలో జీవచ్ఛవంలా...

ఇజ్రాయిల్ బందీ దీనస్థితి

హమాస్ వీడియో విడుదల

జెరుసలేం: ఇజ్రాయిల్-హమాస్ మధ్య కాల్పుల విరమణ వ్యవహారం కొలిక్కి రాకపోవడంతో గాజాలో పరిస్థితులు దారుణంగా మారిపోతున్నాయి. ఈ ఒప్పందం అమల్లోకి వస్తేనే బందీలను విడుదల చేస్తామని హమాస్ చెబుతుండగా... తమవారిని విడుదల చేసే వరకు దాడులు చేస్తామని ఐడీఎఫ్ హెచ్చరిస్తోంది. ఈ నేపథ్యంలో నిర్బంధంలో ఉన్న బందీల పరిస్థితిని వివరిస్తూ హమాస్ ఇటీవల కొన్ని వీడియోలు విడుదల చేసింది. పరిమిత ఆహారంతోనే వారు కాలం వెల్లదీస్తున్నట్లు వాటిని చూస్తే అర్థమవుతోంది. బక్కచిక్కిన శరీరంతో ఉన్న ఇజ్రాయిల్ యువకుడు... తన సమాధిని తానే తవ్వుకుంటున్నానని అందులో పేర్కొన్నాడు. ఓ భూగర్భ సొరంగంలో బందీగా ఉన్న యువకుడు ఎవ్యతార్ డేవిడ్ (24) బక్కచిక్కిన శరీరం, మాట్లాడేందుకు ఇబ్బంది పడుతున్నట్లు వీడియోలో కనిపించింది. తాను ఎదుర్కొంటున్న దీన స్థితిని వివరిస్తూ 'రోజు రోజుకు నా శరీరం క్షీణిస్తోంది. కుటుంబంతో గడిపే పరిస్థితి కనిపించడం లేదు. విడుదలకు సమయం మించిపోతోంది. నా సమాధిని నేనే తవ్వుకుంటున్నా' అని పేర్కొన్నాడు. రెండు రోజుల వ్యవధిలో ఇలాంటి రెండు వీడియోలను హమాస్ విడుదల చేయగా... కేవలం కాల్పుల విరమణ మాత్రమే వీరిని సజీవంగా ఉంచుతుందనే వ్యాఖ్యలు జోడించింది.కాగా, 2023 అక్టోబర్ 7న ఇజ్రాయిల్‌పై హమాస్ మెరుపుదాడి అనంతరం కిడ్నాప్‌నకు గురైన వారిలో ఎవ్యతార్ డేవిడ్ ఒకరు. దక్షిణ ఇజ్రాయిల్‌లోని నోవా మ్యూజిక్ ఫెస్టివల్‌లో పాల్గొన్న అతడు అపహరణకు గురయ్యాడు. దాదాపు రెండేళ్లుగా బందీగా కొనసాగుతున్నాడు. కొంతమందిని విడుదల చేసినప్పటికీ మరో 49 మంది ఇంకా హమాస్ చెరలోనే ఉన్నట్లు ఇజ్రాయిల్ అధికారులు చెబుతున్నారు. తాజా వీడియోను చూసిన డేవిడ్ కుటుంబం... సొరంగంలో ఎముకల గూడుగా మారాడని, బతికుండగానే సమాధి చేస్తున్నారంటూ వాపోయింది. గాజాలో అన్నార్తుల మీద దాడులు చేస్తున్న ఇజ్రాయిల్ సైన్యం... తమ బందీలను విడిచిపెట్టేంత వరకు దాడులు కొనసాగుతాయని హెచ్చరిస్తోంది. మానవతాసాయ కేంద్రాలపైనా దాడులు కొనసాగిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. గత రెండు నెలల వ్యవధిలో మానవతాసాయ కేంద్రాల వద్ద జరిగిన దాడుల్లో 859 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఐరాస నివేదిక వెల్లడించింది.

పరిమిత స్థాయిలో ఆహార పదార్థాలు అందుతుండటంతో పంపిణీ కేంద్రాల వద్ద భీతావహ వాతావరణం ఏర్పడుతోంది. ఆహారం కోసం అసంఖ్యాకులు గుమిగూడటం, ఇదే సమయంలో ఇజ్రాయిల్ సేనలు కాల్పులు జరుపుతుండటంతో అమాయక ప్రజలు చనిపోతున్నారు. పౌష్టికాహార లోపం కారణంగా చిన్నారులు సహా పదుల సంఖ్యలో పలస్తీనీయులు ప్రాణాలు కోల్పోతున్నారు.

రష్యా కురిల్ దీవుల్లో భారీ భూకంపం

600 ఏళ్ల తర్వాత కమ్చట్కా దీవుల్లో బద్దలైన అగ్నిపర్వతం

మాస్కో: రష్యాలోని కురిల్ దీవులలో ఆదివారం 7.0 తీవ్రతతో భూకంపం సంభవించింది. జపాన్ వాతావరణ శాఖ, యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ ఈ విషయాన్ని వెల్లడించాయి. రష్యా అత్యవసర సేవల శాఖ సునామీ హెచ్చరికలు జారీ చేసింది.అనంతరం వాటిని ఉపసంహరించుకుంది. భూకంపం ధాటికి చాలా చోట్ల భవనాలు ఊగిపోయాయి.ఇటీవల 8.8 తీవ్రతతో భూకంపం వచ్చిన విషయం తెలిసిందే. భూప్రకంపనల ధాటికి రష్యా, జపాన్‌తో పాటు ఉత్తర పసిఫిక్‌లోని తీర ప్రాంతాలను సునామీ తాకింది. పసిఫిక్ ప్రాంతంలో 2011 తర్వాత ఇదే అత్యంత భారీ భూకంపమని, దాని ప్రభావంతోనే మళ్లీ భూకంపం వచ్చిందని అధికారులు వెల్లడించారు. మరోమారు భ ప్రకంపనలు రావచ్చని, అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు చేశారు. ఈ పరిస్థితుల్లో కమ్చట్కా ద్వీపకల్పంలోని క్రాషెన్నినికోవ్ అగ్నిపర్వతం బద్దలైంది. దాదాపు 600 ఏళ్ల తర్వాత ఈ అగ్నిపర్వతం బద్దలైనట్లు రష్యా అత్యవసర సేవల శాఖ తెలిపింది. ఆరు వేల మీటర్ల ఎత్తుకు బూడిద ఎగసిపడినట్లు వెల్లడించింది.

షేక్ హసీనాపై ఐసీటీ విచారణ షురూ

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై కేసుల్లో అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ (ఐసీటీ) విచారణ ప్రారంభమైంది. ఆపద్ధర్మ ప్రభుత్వం నియమించిన చీఫ్ ప్రాసిక్యూటర్ తాజుల్ ఇస్లాం ఆమెకు గరిష్ఠ శిక్ష విధించాలంటూ వాదించారు. అన్ని నేరాలకు హసీనానే మూలమని అన్నారు. ఈ కేసుల్లో హోంశాఖ మాజీ మంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమల్, మాజీ ఐజీపీ చౌదురీ అబ్దుల్లా అల్ మామున్ సహ-నిందితులుగా ఉన్నారు. మానవాళిపై నేరాలకు పాల్పడినట్లు షేక్ హసీనాపై అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ అభియోగాలు మోపిన క్రమంలోనే ఆయా కేసుల్లో విచారణను చేపట్టారు. గత ఏడాది జులై-ఆగస్టులో జరిగిన ఉద్యమాన్ని అణచివేతకుగాను ఉద్యమకారులను చంపించడం, హింసించడం వంటి నేరాభియోగాలను హసీనా ఎదుర్కొంటున్నారు. హసీనా, అసదుజ్జమాన్ ఇప్పటికే దేశాన్ని వీడారు. కస్టడీలో ఉన్న మామున్ ఈ కేసులో సాక్షిగా మారేందుకు అంగీకరించినట్లు తెలుస్తోంది. నిరసనల సమయంలో గాయపడిన వ్యక్తులు, ప్రత్యక్ష సాక్షుల నుంచి ఆధారాలు సమర్పిస్తామని ప్రాసిక్యూషన్ తెలిపింది.

కదం తొక్కిన మానవత్వం

(మొదటిపేజీ తరువాయి)

ఆస్ట్రేలియా మంత్రి బాబ్ కార్, ఎంపీ ఎడ్ హసిక్, వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజే, సిడ్నీ లార్డ్ మేయర్ క్లోవర్ మూరే, మాజీ ఫుట్‌బాల్ ఆటగాడు క్రెయిగ్ ఫోస్టర్ తదితర ప్రముఖులు ఉన్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయలేదు. గాజాకు, పలస్తీనియన్లకు మద్దతుగా కదం తొక్కారు. గాజాలో యుద్ధం ఆపాలంటూ నినాదా లిచ్చారు. ఇజ్రాయిల్ మారణహోమాన్ని తీవ్రస్థాయిలో ఆక్షేపించారు. 'సిగ్గు సిగ్గు ఇజ్రాయిల్', 'సిగ్గు సిగ్గు అమెరికా', 'మాకు కావల్సినది ఏమిటి? కాల్పుల విరమణ... అది కావల్సినది ఎప్పుడు? ఇప్పుడు' అంటూ ప్రదర్శనకారులు పెద్దపెట్టున నినాదాలిచ్చారు. గాజాకు మానవతా సాయం అందించాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా సాగిన ప్రదర్శనలో పిన్నలు, పెద్దలు వేలాది మంది పాల్గొన్నారు. సిడ్నీ హార్బర్ బ్రిడ్జి రెండు వైపుల రాయట్ స్క్వాడ్ పోలీసు అధికారులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. గాజా పరిస్థితి గుండెల్ని పిండేస్తున్నట్లు తన మూడేళ్ల కుమారుడితో ప్రదర్శనలో పాల్గొన్న అలెక్ బెవిల్లే అన్నారు. సాయం అంచగలిగితే వారికి ఎంతగానో తోడ్పాటు ఇచ్చిన వాళ్లమవుతామన్నారు. కర్కశం ఇజ్రాయిల్‌పై తగిన విధంగా ఆంక్షలను ఆస్ట్రేలియా విధించలేదని తన పసిబిడ్డతో ప్రదర్శనలో పాల్గొన్న జారా విలియమ్స్ అన్నారు. గాజా ప్రజలందరినీ పస్తులు ఉంచి చంపుతుంటే ఆస్ట్రేలియా చోద్యం చూస్తున్నదా అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. చాలా మంది ప్రదర్శనకారులు కుటుంబ సమేతంగా సిడ్నీ మార్చ్‌లో పాల్గొన్నారు. మెల్‌బోర్న్‌లోనూ 25వేల మంది పలస్తీనాకు మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. పలస్తీనాను స్వతంత్ర దేశంగా 147 దేశాలు గుర్తించాయి. 2024 నుంచి ఇప్పటివరకు ఐర్లాండ్, నార్వే, స్పెయిన్, అర్మేనియా వంటి 10 దేశాలు గుర్తించాయి. ఫ్రాన్స్‌కు పలస్తీనాను గుర్తిస్తామని ఇటీవల ప్రకటించింది. ఆస్ట్రేలియా సహా 15 దేశాలు జులైలో పలస్తీనాకు స్వతంత్ర దేశ గుర్తింపు ఇవ్వాలని పిలుపునిచ్చాయి. ఇజ్రాయిల్‌పై వ్యతిరేకత పలస్తీనాకు మద్దతు పెరుగుతోంది. ఈ క్రమంలోనే సిడ్నీలో తాజాగా భారీ ప్రదర్శన జరిగింది. ఇజ్రాయిల్ దాడుల్లో నిత్యం పలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోతున్నారు. దురాక్రమణ మొదలైనప్పటి నుంచి 60,400 మంది చనిపోయారు. వీరిలో పిల్లలు ఎక్కువగా ఉండటం, ప్రస్తుతం ఆకలి చావులు సంభవిస్తుండటంపై ప్రపంచవ్యాప్తంగా తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తమవుతోంది. అమెరికాను, ఇజ్రాయిల్‌ను అంతర్జాతీయ సమాజం ఆక్షేపిస్తోంది. ఇజ్రాయిల్ తక్షణమే దాడులు ఆపాలని పిలుపునిస్తున్నది.

ఆరుగురిని మింగిన క్వారీ

బాపట్ల జిల్లాలో ఘోర ప్రమాదం

మృతులంతా ఒడిశా కార్మికులు

8 మందికి తీవ్రగాయాలు

విశాలాంధ్ర బ్యూరో-బాపట్ల : బాపట్ల జిల్లాలో ఘోర ప్రమాదం సంభవించింది. బల్లికురవ మండలం చెన్నుపల్లి సమీపంలో కొండాయిపాలెం వద్ద ఉన్న సత్య కృష్ణ గ్రానైట్ క్వారీలో ఆదివారం ఉదయం బండరాళ్లు పడి ఒడిశాకు చెందిన ఆరుగురు వలస కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో 8 మంది తీవ్ర గాయాలు పాలు కాగా వారిలో నలుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు. వివరాల్లోకి వెళితే... సత్యకృష్ణ గ్రానైట్ క్వారీలో ఒడిశా రాష్ట్రానికి చెందిన 20 మందికి పైగా వలస కార్మికులు క్వారీలో ఉదయం బండరాళ్లను పగుల గొట్టే పనిలో ఉన్నారు. అకస్మాత్తుగా ఒక పెద్ద రాయి మీద పడటంతో ఆరుగురు కార్మికులు దండ బదత్య (48), టకున దలాయ్ (37), బనమల చెహ్రా (30), భాస్కర్ భిషోయ్ (40), సంతోష్ గౌడ్ (36), ముస్సాజన (43) అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో గాయపడిన వారిని చికిత్స కోసం ఒంగోలు, అద్దంకికి తరలించారు. ప్రమాదం విషయం తెలుసుకున్న పోలీసులు సిబ్బంది, సహాయక బృందం ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. సంఘటనపై రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షిస్తున్నారు. క్వారీ యాజమాన్యం భద్రతా చర్యలు చేపట్టలేదని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. క్వారీ ప్రమాద ఘటనలో తీవ్రగాయాలై నరసరావుపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి పరామర్శించారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో క్వారీ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేసి ఘటనపై సమగ్ర విచారణ చేస్తామని తెలిపారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.14 లక్షల చొప్పున పరిహారం అందిస్తామన్నారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరికి రూ.10 లక్షలు, స్వల్ప గాయాలైన ఒక్కొక్కరికి రూ.1 లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. గాయపడిన వారందరికీ పూర్తిగా కోలుకునే వరకు వైద్య ఖర్చులన్నింటినీ ప్రభుత్వమే భరిస్తుందన్నారు. మైనింగ్ శాఖ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. మృతదేహాలను సొంత ప్రదేశాలకు తరలించే విధంగా వేగంగా చర్యలు చేపట్టామని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని క్వారీల్లో భద్రతా చర్యలు బలోపేతం చేస్తామని కలెక్టర్ తెలిపారు.

విచారం వ్యక్తం చేసిన సీఎం

క్వారీ ప్రమాదంలో వలస కార్మికుల మృతి చెందిన ఘటనపై సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, ఘటనపై సమగ్రంగా విచారణ జరపాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. గ్రానైట్ క్వారీ ప్రమాదంపై జిల్లా ఇంఛార్జ్ మంత్రి కొలుసు పార్థసారథి, మంత్రులు లోకేశ్, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అలాగే గ్రానైట్ క్వారీ ప్రమాదంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించి మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఉద్యానం ఊపిరిలూదేనా?

- ఐదేళ్లలో సాగు రెట్టింపయ్యేలా ప్రణాళికలు అమలు
- 11 ప్రాధాన్య పంటలు... 24 క్లస్టర్లుగా అభివృద్ధి
- త్వరలో డ్రిప్ ఇరిగేషన్‌కు ఆటోమెషిన్ పరికరాలు

విశాలాంధ్ర-సచివాలయం : వ్యవసాయానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానించాలని ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది. ఇటు రైతులు, రైతు సంఘాలు, వివిధ పార్టీల నేతలు ఎంతో కాలంగా డిమాండ్ చేస్తూ వస్తున్నారు. గోదావరి, కృష్ణా డెల్టా మినహా రాష్ట్రంలో మిగిలిన అన్ని ప్రాంతాల్లోనూ ఉద్యాన సాగును విస్తృతంగా ప్రోత్సహించాలని రైతుకు ఎకరాకు ఏడాదికి కనీసం లక్ష రూపాయలు ఆదాయం ఆర్జించడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వంద శాతం రాయితీతో పండ్ల తోటల సాగు చేపట్టేందుకు చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయించింది. ఇది చిన్న, సన్నకారు రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారనుంది. మొక్కలు ఇవ్వడం... నాటడమే కాదు మూడేళ్ల పాటు వీటి నిర్వహణకు ప్రభుత్వమే డబ్బు చెల్లిస్తుంది. ఇది రైతులకు సువర్ణ అవకాశం. ప్రభుత్వ నిర్ణయం వల్ల ఉద్యాన పంటల సాగు గణనీయంగా పెరగనుంది. అరటి, మామిడి, సపోట, డ్రాగన్ ఫ్రూట్‌తో పాటు పూల జాతులు సాగులో ఉన్నాయి. ఉద్యాన పంటలకు మార్కెట్‌లో డిమాండ్ ఉంది. ఇవి సాగు చేసుకోవాలంటే రైతుకు ఆర్థికంగా భారం. ఇప్పుడు చిన్న, సన్నకారు రైతులు పైసా భారం లేకుండానే ఉద్యాన పంటలు సాగు చేసుకోవచ్చు. ఈ ఆర్థిక సంవత్సరంలో వేల ఎకరాల్లో ఉపాధి హామీ పథకంలో భాగంగా ఉద్యాన పంటలు సాగు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం కోట్ల రూపాయిలు ఖర్చు చేయనున్నారు. ఈ మేరకు డ్వామా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. మిరప, అరటి, మామిడి, ఆయిల్ పామ్, కోకో, డ్రాగన్ ఫ్రూట్, జీడి మామిడి, కాఫీ, కొబ్బరి, టమాటా, ఉల్లి ఈ 11 ప్రాధాన్య పంటలతో రాష్ట్రంలో 24 క్లస్టర్లు ఏర్పాటు చేసి రైతులకు తోడ్పాటు అందించాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 18.23 లక్షల హెక్టార్లలో ఉన్న ఉద్యాన సాగును వచ్చే ఐదేళ్లలో రెట్టింపుతో పాటు ఆయిల్ పామ్, కోకో, కొబ్బరి పంటల డిమాండ్ దృష్ట్యా రైతులకు ఈ పంటల సాగు విషయంలో అవగాహన కల్పించనున్నారు. ప్రపంచంలో కోకో సాగులో 1 శాతం కన్నా తక్కువగా మన దేశంలో సాగు అవుతోంది. ప్రపంచ మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను అందిపుచ్చుకునేలా లక్ష ఎకరాల్లో కోకో సాగు చేపట్టనున్నారు. అలాగే వీటికి అనుబంధంగా చిన్న తరహాలో ప్రాసెసింగ్ యూనిట్లు రైతులే నెలకొల్పేలా చేస్తే మరింత ఆదాయానికి అవకాశం ఉంటుంది. రైతులు పండించే పంటలకు అధిక విలువ తీసుకురావడంపై దృష్టి పెట్టనున్నారు. రాష్ట్రంలో రైతులు మైక్రో ఇరిగేషన్‌కు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న సబ్సిడీని వినియోగించుకునేలా అవగాహన కల్పించనున్నారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న రైతులకు డ్రిప్ ఇరిగేషన్‌లో ప్రాధాన్యత ఇస్తారు. అలాగే ఇప్పటికే రైతులు ఏర్పాటు చేసుకున్న డ్రిప్ ఇరిగేషన్‌కు ఆటోమెషిన్ పరికరాలు అమర్చాలని, దీని ద్వారా నీరు, ఎరువులు ఆదా అవుతాయనే విషయం రైతులకు అధికారులు సూచిస్తున్నారు.

అరటి, బత్తాయి, మిరప ద్వారా అత్యధిక జీవీఏ

కరవు ప్రాంతాల్లో ఉద్యాన పంట సిరులు పండుతున్నాయి. అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్ కడప, కర్నూలు, అన్నమయ్య జిల్లాలు ఉద్యాన పంటల స్థూల విలువ జోడింపు (జీవీఏ) లో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచాయి. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఉద్యాన పంటల ద్వారా అత్యధిక జీవీఏ సాధించిన తొలి అయిదు జిల్లాలు రాయలసీమలోని పాక్షిక, పూర్తిస్థాయి కరవు ప్రాంతాలు కావటం విశేషం. అనంతపురం జిల్లా రూ.17,880 కోట్లు, శ్రీ సత్యసాయి జిల్లా రూ.11,875 కోట్లు, వైఎస్సార్ కడప రూ.11,400 కోట్లు, కర్నూలు జిల్లా రూ.9,102 కోట్లు, అన్నమయ్య జిల్లా రూ.9,069 కోట్ల జీవీఏ సాధించాయి. కరవు తీవ్రత అత్యధికంగా ఉండే అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలు ఉద్యాన పంటల ద్వారా 2024-25 వార్షిక సంవత్సరంలో రూ.30 వేల కోట్ల స్థూల ఉత్పత్తి విలువ జోడింపు (జీవీఏ) ను సాధించి రికార్డు సృష్టించాయని అధికార వర్గాలు వెల్లడించాయి. అరటి, టమాటా, బత్తాయి, మిరప పంటల ద్వారా అత్యధిక జీవీఏ నమోదయింది. బత్తాయి, పుచ్చ, టమాటా పంటల సాగు ద్వారా జీవీఏ సాధించటంలో వైఎస్సార్ కడప జిల్లాలోని లింగాల మండలం అగ్ర స్థానంలో నిలిచింది. కేవలం లింగాల మండలంలో ఉద్యాన పంట ద్వారా రూ.2,130 కోట్ల జీవీఏ ఒనగూరటం విశేషం. బత్తాయి, అరటి పంటల సాగు ద్వారా అనంతపురం డివిజన్‌లో జీవీఏ రూ.9,876 కోట్లుగా నమోదయింది. టమాటా, బత్తాయి, అరటి పంటల ద్వారా వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల డివిజన్ రూ.6,177 కోట్ల జీవీఏ సాధించింది. ఈ రెండు డివిజన్లు జీవీఏలో మొదటి, రెండవ స్థానాలు సాధించగా అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు డివిజన్ మూడవ స్థానం దక్కించుకుంది. పసుపు, కాఫీ, మిరియాల పంటల సాగు ద్వారా పాడేరు డివిజన్ రూ.5,674 కోట్ల జీవీఏను సాధించింది. తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం అలంకరణ మొక్కలు, పండ్ల నర్సరీలు, ఇతర ఉద్యాన పంటల ద్వారా రూ.1,758 కోట్ల జీవీఏ దక్కించుకుంది.

ఎస్ఐఆర్‌పై చర్చకు కేంద్రం విముఖత

(మొదటిపేజీ తరువాయి)

జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై ప్రతిపక్ష పార్టీల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తం కావడమే ఇందుకు కారణం. ఇండియా ఐక్య సంఘటన ఈ అంశంపై ఏకాభిప్రాయంతో ముందుకు సాగుతోంది. ఎన్నికల కమిషన్ తన అజెండా పట్ల సానుభూతి ఉన్న ఓటర్లను తొలగించడం, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ అవకాశాలను పెంచడం లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపించింది. అర్హులయిన ఓటర్లు మాత్రమే ఓటు వేయడానికి అనుమతించబడతారని నిర్ధారించుకోవడానికి ఓటర్ల జాబితాల సమగ్రతను 'రక్షించడానికి' జాతీయ స్థాయిలో ఈ కసరత్తును ప్రారంభిస్తామని ఈసీ తెలిపింది. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఈసీ 'ఓట్ చోరీ' (ఓట్లను దొంగిలించడం) అని ఆరోపించారు. ఎన్నికల సంఘాన్ని తీవ్రంగా విమర్శించారు. అయితే ఈసీ ఈ ఆరోపణలను తోసిపుచ్చింది. ఎస్ఐఆర్‌పై పార్లమెంటులో చర్చకు ప్రభుత్వం పెద్దగా శ్రద్ధ చూపకపోవడంతో ప్రతిపక్షం పార్లమెంటులో నిరసనలకు దిగింది. దీంతో ఉభయ సభలూ అనేక సార్లు వాయిదా పడ్డాయి. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు నిబంధనల ప్రకారం ప్రతిపక్ష డిమాండ్‌పై నిర్ణయం తీసుకోవలసిన బాధ్యత ఉభయ సభల అధ్యక్షుడిదేనని వాదించారు. 1980-1989 మధ్య లోక్‌సభ స్పీకర్‌గా పని చేసిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బలరామ్ జాఖర్ ఇచ్చిన తీర్పును కూడా ఆయన ఇటీవల ఉదహరించారు.

పార్లమెంటులో దాని అజెండాకు అంతరాయం కలిగిస్తూనే ఉంటే, గందరగోళం ఉన్నప్పటికీ దాని కీలక బిల్లుల ఆమోదానికి ఒత్తిడి తెస్తామని ప్రభుత్వ కీలక అధికారి ఒకరు అన్నారు. ఎస్ఐఆర్ ఎన్నికల కమిషన్ ఆదేశంలో భాగమని రిజిజు శుక్రవారం అన్నారు. నియమాలు, సమావేశం ద్వారా అనుకూలంగా లేని దాని గురించి చర్చించలేమని తెలిపారు. లోక్‌సభలో పరిశీలన, ఆమోదం కోసం జాబితా చేయబడిన మరో బిల్లు జాతీయ డోపింగ్ నిరోధక (సవరణ) బిల్లు.

'బనకచర్ల'ను అడ్డుకుంటాం

(మొదటిపేజీ తరువాయి)

పునః ప్రారంభం చేసి పూర్తి చేస్తామని అన్నారు. ఇచ్చంపల్లి వద్ద మరో ప్రాజెక్టు నిర్మిస్తామని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 3.17 కోట్ల మంది నిరుపేదలకు రూ.13 వేల కోట్ల ఖర్చు చేసి ప్రతి కుటుంబానికి నెలకు ఆరు కిలోల సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని అన్నారు. అర్హులకు రేషన్ కార్డుల పంపిణీ చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 8.60 లక్షల నూతన రేషన్ కార్డులు, రామగుండంలో అదనంగా 6,500 మంజూరు చేశామని వివరించారు.

మంత్రి తుమ్మల మాట్లాడుతూ మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు , అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. మంత్రి దుద్దిళ్ల మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని అన్నారు. శివారు ప్రాంతాలకు సాగు నీరు స్థిరీకరణ కోసం పత్తిపాక రిజర్వాయర్ నిర్మిస్తామన్నారు. లారీ యాజమాన్యుల సమస్యలపై నివేదిక అందించాలని కలెక్టరుకు సూచించారు. రామగుండం ప్రాంతంలో 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి కృషి చేస్తామని అన్నారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ గోదావరి జలాలు సముద్రంలో కలుస్తున్నాయని, ప్రతి నీటి చుక్కను ఉత్తర తెలంగాణ ప్రాంతాలు వాడుకునేలా ప్రణాళికలు చేయాలని అన్నారు. స్థానిక బస్ స్టాండ్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని అన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ నన్నయ్య గౌడ్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చుక్క నీరు వదులుకోం

(మొదటిపేజీ తరువాయి)

దిద్దుతూనే... సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రాజెక్టులను సమర్థవంతంగా అమలు చేస్తున్నాం అని పేర్కొన్నారు.

పంప్డ్ స్టోరేజ్ వినియోగంలోకి తేవాలి

హైడల్ పవర్ తోబాటు పంప్డ్ స్టోరేజ్ తో పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి చేసి వినియోగం లోకి తీసుకుని రావాలి.. అందుకోసం రాష్ట్రంలో ఇరవై మూడు పాయింట్స్ ను గుర్తించి వాటిపై సమగ్రమైన నివేదిక ఇవ్వాలని భట్టి అధికారులను ఆదేశించారు. కొల్లాపూర్ నియోజకవర్గం సోమశిల వద్ద జెన్ కో, ట్రాన్స్ కో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జూరాల నుంచి పులిచింతల వరకు కృష్ణాపై ఉన్న హైడల్ పవర్ ప్రాజెక్ట్ లను సమీక్షించి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రాబోయే తరాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పర్యావరణ హితమైన పవర్ ను ఉత్పత్తి చేసి అందించాలని సూచించారు. ఏటేటా పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్ ను దృష్టిలో పెట్టుకుని రాబోయే ఇరవై ఏళ్లకు సరిపడా విద్యుత్తుఉత్పత్తికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలన్నారు. గ్రీన్ హైడ్రోజన్ , ఫ్లోటింగ్ సోలార్, రూఫ్ సోలార్ థర్మల్ పవర్ , పవన విద్యుత్తు, అణువిద్యుత్తు బ్యాటరీ స్టోరేజ్ వంటి ప్రత్యామ్నాయ విద్యుత్తు వినియోగాన్ని ఎక్కువ మొత్తంలో అభివృద్ధి చేసుకోవాలన్నారు. రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యానారాయణ, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు.

గడ్కరి నివాసానికి బాంబు బెదిరింపు

(మొదటిపేజీ తరువాయి)

దుకాణంలో పనిచేస్తున్నట్టు గుర్తించారు. తన మొబైల్ నెంబర్ నుంచి అతను ఫోన్ చేశాడు. పది నిమిషాల్లో గడ్కరి నివాసం పేల్చేస్తామని బెదిరించాడు. నాగపూర్‌లోని బీమా దవాఖానా సమీపంలో అతన్ని పోలీసులు అరెస్టు చేశారు. తదుపరి విచారణ కొనసాగుతోంది. అజ్ఞాత వ్యక్తి నుంచి బెదిరింపు కాల్ వచ్చినప్పుడు గడ్కరి నాగపూర్‌లోనే ఉన్నారు. ఆయన క్షేమంగానే ఉన్నారని, అన్ని ముందస్తు చర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారు. మంత్రి నివాసం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటలకు 112 ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్‌కు గడ్కరీ ఇంటివద్ద బాంబు పెట్టామని, అది పేలడానికి సిద్ధంగా ఉందని ఒక ఫోన్ వచ్చిందని, వెంటనే బాంబు స్క్వాడ్‌ను అక్కడికి పంపడంతో పాటు మంత్రి వ్యక్తిగత భద్రతా సిబ్బందిని అప్రమత్తం చేశామని జోన్-1 డీసీపీ రిషీకేష్ రెడ్డి తెలిపారు. గడ్కరి నివాసంలో ఎలాంటి బాంబు కనిపించకపోవడంతో అది ఉత్తుత్తి బెదిరింపేనని తేలినట్టు చెప్పారు.

తల్లీ... ఇద్దరు కుమార్తెల దారుణ హత్య

(మొదటిపేజీ తరువాయి)

హతమార్చారు. మృతులను ములపత్తి మాధురి (26), నిస్సీ (8), ప్రైజీ (6)గా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే... ప్రసాద్-మాధురి దంపతులు తమ ఇద్దరు కుమార్తెలతో కలిసి పట్టణ శివారులోని సీతారామకాలనీలో నివాసముంటున్నారు. స్థానికంగా ఉన్న ఓ పరిశ్రమలో బొలెరో వాహనం డ్రైవర్‌గా పనిచేస్తున్న ప్రసాద్... ఆరోజు రాత్రి విధులకు వెళ్లాడు.

ఉదయం ఇంటికి వచ్చి చూసే సరికి భార్య, ఇద్దరు కుమార్తెలు రక్తపు మడుగులో పడి ఉన్నారు. భయకంపితుడైన ప్రసాద్... పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ప్రశాంతంగా ఉండే సీతారామ కాలనీలో ఒకేసారి ముగ్గురు హత్యకు గురికావడం స్థానికంగా సంచలనం సృష్టించింది. ఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ బిందు మాధవ్, పెద్దాపురం డీఎస్పీ శ్రీహరి రాజు, జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాసరావు పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ క్లూస్ టీం, డాగ్స్ స్క్వాడ్ వచ్చాయని ఆధారాలు సేకరిస్తున్నామని తెలిపారు. మూడు హత్య కేసులు వెనక ఎవరున్నారనేది దర్యాప్తులో తేలుస్తామని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త ములపర్తి ప్రసాద్‌ను స్టేషన్‌కు తీసుకెళ్లి విచారిస్తున్నారు.

ఏపీలో మూడు రోజులు వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)

సూచించారు. సోమవారం (4వ తేదీ) అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, గుంటూరు, బాపట్ల, కర్నూలు, నంద్యాల, కడప, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. మంగళవారం (5వ తేదీ) పల్నాడు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. బుధవారం (6వ తేదీ) పల్నాడు,అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆయన వివరించారు.

తేజస్వి ఓటరు ఐడీపై వివాదం

(మొదటిపేజీ తరువాయి)

ఈపీఐసీ నంబరు అధికారికంగా జారీ అయినది కాదని తెలిసింది. కాబట్టి, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలి. అందుకుగాను మీ ఒరిజినల్ ఈపీఐసీ కార్డును అప్పగించండి' అంటూ దీఘా అసెంబ్లీ నియోజకవర్గం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, పట్నా సదర్ సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ ఒక లేఖను తేజస్వీ యాదవ్‌కు పంపారు. అయితే తన ఓటరు కార్డు నంబరు మారిందని తేజస్వి ఆరోపించారు. దీనిని జిల్లా మెజిస్ట్రేట్ థియాగరాజ్ ఎస్ఎం తిరస్కరించారు. '2020 అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఇచ్చిన అఫిడవిట్‌లో ప్రతిపక్ష నాయకుడు సమర్పించిన నంబరే ఎన్నికల జాబితాలో ఉన్న ఆయన ఈపీఐసీ నంబరు. మరొక నంబరు ఉన్న కార్డు ఆయన దగ్గర ఉన్నట్లయితే...ఇది విచారించాల్సిన అంశం' అని థియాగరాజ్ అన్నారు.

తేజస్వీపై కేసు పెట్టాలి: ఎన్డీయే

రెండు ఓటరు కార్డులు ఉన్నందుకు తేజస్వీ యాదవ్‌పై కేసు పెట్టాలని ఎన్డీయే ప్రతినిధులు అజయ్ ఆలోక్ (బీజేపీ), నీరజ్ కుమార్ (ఆర్జేడీ), రాజేశ్ భట్ (ఎల్‌జేపీ- రాంవిలాస్) తదితరులు విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. తమ మిత్రపక్షానికి చెందిన నాయకుడు చేసిన ఈ మోసమే రాహుల్ గాంధీ (లోక్‌సభ ప్రతిపక్ష నేత) ఎన్నికల సంఘాన్ని బెదిరించే అణు బాంబా అంటూ ఎద్దేవా చేశారు.

ఏ పార్టీ డిమాండ్ చేయలేదు: ఈసీ

జాబితాలో ఓటర్ల పేర్లు చేర్చాలనిగానీ తొలగించాలనిగానీ బీహార్‌లోని ఏ రాజకీయ పార్టీ నుంచి డిమాండ్ లేదని ఎన్నికల సంఘం వెల్లడించింది. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించింది. ఇదే విషయాన్ని ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఈసీ స్పష్టంచేసింది. శుక్రవారం కూడా దీనిపై వివరణ ఇచ్చింది. ఏ పార్టీ నుంచి ఎలాంటి డిమాండ్లు, అభ్యంతరాలు రాలేదని పేర్కొంది. అయితే పేర్ల చేర్చాలి లేదా అనర్హుల పేర్లు తొలగించాలంటూ వ్యక్తిగతంగా ఓటర్ల నుంచి 941 ప్రతిపాదనలు, అభ్యంతరాలు వచ్చాయని తెలిపింది. పేర్ల తొలగింపు లేదా చేర్పింపునకు పార్టీలు, ఓటర్లు డిమాండ్ చేసేందుకు సెప్టెంబరు 1వ తేదీ వరకు గడువు ఉన్నది. కాగా, కోట్లాది మంది అర్హులైన ఓటర్ల పేర్లను జాబితాలో నుంచి తొలగించే ఉద్దేశంతోనే బీహార్‌లో ఎస్ఐఆర్‌ను ఎన్నికల సంఘం చేపట్టిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ ఆరోపణలను ఈసీ కొట్టిపారేస్తూ, అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించే ప్రసక్తే లేదన్నారు. సెప్టెంబరు 30న తుది జాబితా విడుదలవుతుందని వెల్లడించారు.

గ్రామాభివృద్ధికి ఎల్లప్పుడు కృషి చేస్తా : ఎమ్మెల్యే

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్/ తొర్రూర్: తొర్రూర్ మండలం చర్లపాలెం గ్రామాభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తామని పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డిలు అన్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చెర్లపాలెం గ్రామంలో ఆదివారం పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి, ఆమె భర్త రాజారాంమోహన్ రెడ్డి, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి, ఆమె భర్త డా.రాజేందర్ రెడ్డి లు కలిసి తమ సొంత గ్రామమైన చెర్లపాలెంలో నూతన గృహ నిర్మాణానికి వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య సంప్రదాయ పద్ధతిలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్థులు పెద్ద ఎత్తున హాజరై నేతల కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, మహిళా సంఘాల నాయకురాళ్లు, యువజన ప్రతినిధులు నేతలకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెర్లపాలెం మా కుటుంబానికి అత్యంత ఆత్మీయమైన గ్రామమని, ఇక్కడ ఇల్లు నిర్మించుకోవా లనే మా కల నేడు భూమి పూజతో నెరవేరుతోందని తెలిపారు. గ్రామ అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని అన్నారు. గ్రామ ప్రజలతో కలిసి మమేకమవుతూ, వారి సమస్యల పరిష్కారానికి ముందుండడమే మా బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమం లో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, బ్లాక్ అధ్యక్షులు, వివిధ మండలాల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, నియోజకవర్గ యువజన నాయకులు, మహిళ నాయకులు, పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, గ్రామస్తులు, కుటుంబ బంధువులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ తల్లి బోనాల వేడుక

విశాలాంధ్ర - కారేపల్లి : సింగరేణి మండల పరిధిలోని రామలింగాపురం (కారేపల్లి క్రాస్ రోడ్) లింగం బంజర గ్రామాల ప్రజలు, మహిళలు ఆదివారం ముత్యాలమ్మ తల్లికి అత్యంత భక్తిశ్రద్ధలతో బోనాలు వేడుకలను నిర్వహించారు. కారేపల్లి క్రాస్ రోడ్‌కు చెందిన మహిళలు బోనాలు తలపై ఎత్తుకొని ముందుగా గ్రామ దేవత అయిన ఎర్రమ్మ తల్లికి పూజలు చేసి డప్పువాయిద్యాలతో లింగం బంజరలో గల నాభిశిల వద్దకు చేరుకుని పసుపు కుంకుమ పూజలు చేసిన అనంతరం ముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి ప్రదర్శనగా వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రజలు అందరూ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని గ్రామ దేవతలకు నైవేద్యాన్ని సమర్పించి ముత్యాలమ్మ తల్లికి పసుపు, కుంకుమలతో చీరలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెండు గ్రామాల పెద్దలతో పాటు మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఆటో కార్మికుల జీవితాలను ఆగం చేసిన సీఎం

విశాలాంధ్ర - తొర్రూర్ : మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించి, సీఎం రేవంత్ రెడ్డి ఆటో కార్మికులు జీవితాన్ని బజారున పడేసాడని మాజీ జెడ్పి ఫ్లోర్ లీడర్ మంగళంపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం తెలంగాణ ఆటో డ్రైవర్ ఓనర్స్ యూనియన్ తొర్రూర్ టు మరిపెడ రూట్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా బిఆర్ఎస్ జిల్లా నాయకుడు మాజీ జెడ్పిటిసి మంగళపల్లి శ్రీనివాస్, యూనియన్ నూతన కమిటీ అధ్యక్షులుగా సయ్యద్ మంజూరు, ఉపాధ్యక్షులు గండి లింగయ్య, ప్రధాన కార్యదర్శి. కంచన పెల్లి మల్లేష్, కోశాధికారి కోళ్ల కృష్ణ, కమిటీ సలహాదారులు, మంగళ పెల్లి చిన్న యాకయ్య, ధర్మారపు ముత్తయ్య, సంపెట శీను, భూక్యా లక్పతి, ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మంగళపల్లి శ్రీనివాస్ మాట్లాడతూ ఆటో కార్మికులకు ప్రధానమైన ఉపాధి పేరు మీద సంవత్సరానికి 12000 ఇస్తానని చెప్పి ఇప్పటివరకు రెండు సంవత్సరాలు కావస్తున్న ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆయన దుయ్యబట్టారు. భార్య పిల్లలకు సరైన తిండి పెట్టలేక చదివించుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. తల్లిదండ్రులకు తిండి పెట్టలేక, ఆటో ఫైనాన్స్ కట్టుకోలేక ఇన్సూరెన్స్ చెల్లించలేక బండి ఫిట్నెస్‌లు, రిపేర్లు చేయించుకోలేక కన్నీళ్లతో కాలం వెళ్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్ రవి, వెంకన్న, సాదిక్, వెంకన్న, నగేష్, బాలు, సత్యం, బాలకృష్ణ, శీను, వెంకన్న, మహమ్మద్, రమేష్, రమేష్, బద్రి, అలీ, సందీప్, నరేష్, సతీష్ పాల్గొన్నారు.

జర్నలిస్ట్ బుస్స రమేష్ కుమార్తె వివాహంలో మాజీ మంత్రి దంపతులు

విశాలాంధ్ర - వనపర్తి : బీచుపల్లిలోని చందూరు నాగప్ప నాయుడు మోరియల్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన బుస్స అనిత రమేష్‌ల ఆహ్వానం మేరకు వారి కుమార్తె శ్రావణి, ఈశ్వర్‌ల వివాహానికి హాజరైన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, వాసంతి నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ మంత్రి వెంట మండల పార్టీ అధ్యక్షులు వనం రాములు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రేసామి, మాజీ కౌన్సిలర్ ఎల్లారెడ్డి, విశ్వరూపం, నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుస్సాడీ నృత్యాలతో జనహిత పాదయాత్ర

పాదయాత్రలో పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యే

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ఖానాపూర్‌లో ఆదివాసీలు సాంప్రదాయబద్ధంగా నిర్వహించే గుస్సాడీ నృత్యాలతో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కొనసాగింపుగా నియోజకవర్గంలో ఏఐసీసీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ మంత్రి సీతక్క, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క ఖానాపూర్ ఎమ్మెల్యే వెడుమా బొజ్జు పటేల్, కూచాడి హరీశ్ రావు మాజీ ఎమ్మెల్యే రేఖ శ్యాం నాయక్ పాల్గొన్నారు. జనహిత పాదయాత్రను ఆదివాసీల సాంప్రదాయ బద్ధమైన గుస్సాడీ నృత్యాలతో ఖానాపూర్ బస్టాండ్ వినాయక చౌక్ ఎన్టీఆర్ చౌక్ శాంతినగర్ శివాజీ నగర్‌ల మీదుగా మార్కెట్ యార్డ్ సమీపన ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహం వద్దకు చేరుకొని పూలమాలలు వేసి నివాళులు అర్పించి కొనసాగించారు. ఈ యాత్ర కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. గంటల పాటు 11కిలో మీటర్లు పాదయాత్ర సాగింది. పాదయాత్రకు ముందు ఏఐసీసీ ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ... తెలంగాణను దేశానికి రోల్ మోడల్‌గా నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అణగారిన వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటానికి ప్రజలు మద్దతు ఇవ్వాలని అన్నారు ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు బాణావత్ గోవింద నాయక్ మాజీ మున్సిపల్ చైర్మన్ రాజురాసత్యం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దయానంద్ మాజీ మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాల్లో పేదలకు నిత్యావసరాలు పంపిణీ

విశాలాంధ్ర - ఇల్లందు : జిల్లా ఎస్పీ రోహిత్ రాజు కృషి, ఆదేశాల మేరకు శంబునిగూడెం, శెట్టిపల్లి గ్రామాలలోని 100 మంది పేద ప్రజలకు రాబిన్ హుడ్ స్వచ్ఛంద సంస్థ సహాయంతో నిత్యావసర సరుకులు అందించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఇల్లందు డి యస్పి చంద్రభాను మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాలను సందర్శినప్పుడు కొంతమంది పేదవాళ్ళు కనీస కుటుంబ అవసరాలకు ఇబ్బంది పడుతున్నట్లు గమనించినట్టు చెప్పారు.

పేదల వివరాలు సేకరించి స్వచ్ఛంద సంస్థల సహాయంతో బియ్యం, కందిపప్పు, గోధుమ పిండి వారికి అందజేయడం జరిగిందన్నారు. డబ్బున్న వారు ఇలాంటి సేవా కార్యక్రమాలు తరచూ చేస్తూ ఉండాలని కోరారు. అదేవిధంగా ఆదివాసి ప్రజలు తమ పిల్లలను బాగా చదివించి ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని ఆయా కుటుంబాలను కోరారు. ముఖ్యంగా యువత గంజాయి, మద్యపానం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డిఎస్పీ సూచించారు. కొంతమంది వాహనాల డ్రైవింగ్ పై అవగాహన లేకుండా అతివేగంగా, నిర్లక్ష్యంగా నడపడమే కాకుండా మద్యం తాగి డ్రైవింగ్ చేస్తున్నారని ఈ పరిణామం వారికే కాకుండా ఇతరులకు కూడా ప్రమాదకరమన్నారు. దింతో ఈ మధ్య కాలంలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని డీఎస్పీ కోరారు. ఆదివాసి ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మరోసారి స్పష్టం చేశారు. ఆదివాసీల కోసం గతంలో కూడా మెడికల్ క్యాంపులు, దోమతెరలు పంపిణీ, దుప్పట్లు, సోలార్ లైట్లు, నిత్యవసర సరుకులు, యువతకు వాలీబాల్ కిట్లు, పంపిణీ చేయడం జరిగిందని గుర్తు చేసారు. ఈ సందర్భంగా శంభుని గూడెం,శెట్టిపల్లి గ్రామ ప్రజలు పోలీస్ శాఖకు, రాబిన్ హుడ్ స్వచ్ఛంద సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండాల సీఐ ఎల్ రవీందర్,కొమరారం ఎస్సై నాగుల్ మీరా, గుండాల ఎస్సై సైదా రవూఫ్, పోలీస్ సిబ్బంది, రాబిన్ హుడ్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు, జరిమాన తప్పదు : ఎస్పీ

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు, జరిమానా తప్పదని, ప్రమాదాల నివారణే లక్ష్యంగా ప్రతి రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ పి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తరచుగా డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ పట్టుబడిన వ్యక్తుల డ్రైవింగ్ లైసెన్స్ రద్దుకు సిపార్సు చేస్తామని, జులై మాసంలో 456 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు అయినట్లు, నిందితులకు శిక్ష విధించడంపై స్పెషల్ ఫోకస్ మరింత వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. గడిచిన వారంలో (27 జూలై నుండి ఆగస్టు 2 వరకు) మద్యం సేవించి పట్టుబడిన వారిలో 17 మందికి 2 రోజుల శిక్షతో పాటు 2 వేల రూపాయల జరిమానా విధించడం జరిగిందని, మద్యం సేవించి వాహనాలు నడిపి, ఎవరు కూడా ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని, అంతే కాకుండా మీ కుటుంబాలకు దూరం కావద్దని పలు అంశాలపై జిల్లా ఎస్పీ మాట్లాడారు.

అక్రమ ఇసుక రవాణాను పట్టుకున్న పోలీసులు

విశాలాంధ్ర- ములుగు జిల్లా బ్యూరో : అక్రమ ఇసుక రవాణా గురించి నమ్మదగిన సమాచారం మేరకు ఫారెస్ట్ చెక్ పోస్ట్ నందు ఏటూరునాగారం పోలీసులు ఉండగా, ఆదివారం జంపన్న వాగు నుంచి ఇసుక అక్రమంగా రాత్రివేళల కూలీల ద్వారా డీసీఎంలోకి ఎక్కించి తరలిస్తున్న డీసీఎం టిజి 12 ఆర్ 4838 గల వాహనాన్ని పట్టుకోవడం జరిగిందని ఏటూరునాగారం ఎస్ఐ ఎస్.రాజకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహన డ్రైవర్ ఎండీ జహీర్ ఏటూరు నాగారం, అతని బంధువు అయిన సద్దాం హుస్సేన్‌తో కలిసి హనుమకొండకు తరలించి, గత కొంతకాలంగా లాభాలు గడుస్తున్నారని, వే బ్రిడ్జి ద్వారా తూకం వేసి డీసీఎంలో 14 టన్నులు ఇసుక దాని విలువ సుమారు 6000 రూపాయలు ఉంటుందని, కేసు నమోదు చేశామని ఎటునారం ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. ఇంకా ఎవరు అయినా ఉంటే అక్రమార్కుల గురించి సమాచారం ఇవ్వాల్సిందిగా ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పి ఎస్ఐ నరేష్ ఆర్ఎస్ఐ అన్వేష్, కార్తీక్ కానిస్టేబుల్ అజయ్, విక్రమ్, హరీష్, ధ్రువ గోపి పాల్గొన్నారు.

గుడుంబా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్...

విశాలాంధ్ర - కొమరం భీం : దహెగాం మండలం బిబ్రా గ్రామ శివారులో టాస్క్ ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ ఆధ్వర్యంలో తనిఖీలో నిషిద్ధమైన గుడుంబా విక్రయిస్తున్న దారవత్ తారచంద్ “50” టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. గుడుంబా 8 లీటర్లు దాదాపు రూ.3,500 విలువ చేసే 380 పాకెట్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్టు నిందితుడిని దహెగాం పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు నిషేధిత పదార్థాల తయారీ, రవాణా విక్రయంపై పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో టాస్క్ ఫోర్ సిబ్బంది వి.మధు, విజయ్, మహమ్మద్, రమేష్ పాల్గొన్నారు.

మహిళా శక్తిని చాటిచెప్పేవే బోనాల పండుగలు : సాబీర్‌పాషా

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : మహిళా శక్తిని చాటి చెప్పేవే బోనాల జాతరలని అనాదిగా తెలంగాణ సంస్కృతిలో స్త్రీలను గౌరవించడం సాంప్రదాయంగా వస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబిర్ పాషా అన్నారు. ఆ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున బోనాల పండుగలు జరుపుకొని మహిళలకు ఉన్నత స్థానంలో నిలుపుతున్నట్లు చెప్పారు. పట్టణంలోని రైతుబజారులో వ్యాపారుల కుటుంబాలు ఆదివారం నిర్వహించిన శ్రావణ మాస బోనాల ఉతత్సావాల్లో అయన పాల్గొని మహిళలకు శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ స్త్రీలను పూజించడం తెలంగాణ సంస్కృతిలో మహొన్నతమైన సంప్రదాయమన్నారు. పండగలప్పుడు కాకుండా ప్రతిదినం మహిళలను కుటుంబాల్లోని పురుషులు గౌరవించాలని కోరారు. శతబ్దాలుగా వస్తున్న పండగల సంప్రదాయాన్ని నేటితరం కొనసాగించడం అభినందనీయమన్నారు. అనాదిగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను ఆచరిస్తూ వాటిని భావితరాలు అందించడం ప్రతిఒక్కరి బాధ్యతని చెప్పారు. ఇలాంటి ఉత్సవాలు ప్రజల మధ్య ఐక్యతను పెంచి రాగద్వేషాలను, అంతరాలను దూరం చేస్తాయన్నారు. తద్వారానే సమాజంలో శాంతి నెలకొంటుందని సాబీర్ పాషా స్పష్టం చేసారు. కార్యక్రమంలో కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, రాము, మదన్ లాల్, వేణు, పద్మ, కుమారి, తులసి తదితరులు పాల్గొన్నారు.

జిగ్లీ ‘అంతర్జాతీయ హ్యాపీ పెట్స్ డే’

న్యూఢిల్లీ: భారతదేశంలోని మొట్టమొదటి సాంకేతిక ఆధారిత ఓమ్ని-ఛానల్ పెట్ కేర్ బ్రాండ్ జిగ్లీ (కాస్మో ఫస్ట్ లిమిటెడ్), విజయవంతంగా తమ ‘ఇంటర్నేషనల్ హ్యాపీ పెట్స్ డే’ (ఐహెచ్‌పీడీ 2025) రెండవ ఎడిషన్‌ను వైభవంగా జరుపుకుంది. రోజంతా జరిగిన ఈ కార్యక్రమంలో 2200 కి పైగా పెంపుడు జంతువులు, పెట్ పేరెంట్స్ పాల్గొన్నారు. గత సంవత్సరం ప్రారంభోత్సవ కార్యక్రమం సాధించిన అద్భుతమైన విజయం ఇచ్చిన స్ఫూర్తితో, ఫ్రెండ్‌షిప్ డే నాడు నిర్వహించిన ఈ ఉత్సవం, పెంపుడు జంతువుల తల్లిదండ్రులు, వారి స్నేహితుల మధ్య ప్రత్యేక బంధాన్ని వేడుక జరుపుకుంది. అదే సమయంలో బాధ్యతాయుతమైన పెంపుడు జంతువుల పెంపకాన్ని ప్రోత్సహించింది. జిగ్లీ ‘ఇంటర్నేషనల్ హ్యాపీ పెట్స్ డే’ (ఐహెచ్‌పీడీ) వేడుకలో పెంపుడు జంతువులు, పెంపుడు జంతువుల తల్లిదండ్రులను ఆనందపరిచేందుకు అనేక కార్యకలాపాలు నిర్వహించారు. ఈ వేడుకలు చిరస్మరణీయమైన క్షణాలను సృష్టించాయి. ఈ వేడుకలలో భాగంగా ‘జిగ్లీ కాయిన్స్’ను జిగ్లీ ప్రారంభించింది. వినియోగదారులు జిగ్లీ వద్ద చేసే రూ.100 ఖర్చుపై ఒక నాణెం సంపాదించవచ్చు, ప్రతి నాణెం రూ. 1 విలువ కలిగి ఉంటుంది. ఇది తమ ఫర్ స్నేహితుల కోసం వినియోగదారుల చేసే కొనుగోలుకు విలువను జోడిస్తుంది.

ప్రభుత్వాసుపత్రి కలెక్టర్ ఆకస్మిక సందర్శన

విశాలాంధ్ర బ్యూరో - మెదక్: మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్, శ్రీజ దంపతులు ఆదివారం సైకిల్ పై 20 కిలోమీటర్లు ప్రయాణం చేశారు. రామాయణపేట ప్రభుత్వ ఆసుపత్రిని అకస్మికంగా సందర్శించారు. రోగులకు అందిస్తున్న సేవలు, సిబ్బంది హాజరు పట్టిక, ఓపి రిజిస్టర్, డెలివరీ రిజిస్టర్, పరిశీలించి వైద్య సిబ్బందికి తగు సూచనలు చేశారు. పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం వైద్య శాఖను బలోపేతం చేస్తూ పటిష్ట కార్యచరణ ద్వారా ముందుకు పోతుందన్నారు. వైద్యులు, సిబ్బంది అందరూ కూడా సెలవు రోజుల్లో కూడా సేవలు అందించాలన్నారు. హవేలీ ఘనపూర్ మండల కేంద్రంలో గల మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల బాలుర సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. మెనూ బోర్డ్ ను పరిశీలిస్తూ భోజనం ఎలా వుంది? మెనూ ప్రకారంగా పెడుతున్నారా? అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు.

ధర్మస్థల అమానవీయ ఘటనలపై దోషులను శిక్షించాలి

బలమైన ఉద్యమ నిర్మాణంతోనే మహిళలకు రక్షణ

మహిళా చట్టాలను నీరుగారుస్తున్న పాలకులపై తిరగబడాల్సిందే : మున్నా లక్ష్మి కుమారి

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : మూడు దశాబ్దాలుగా కర్ణాటక రాష్ట్రంలోని పవిత్ర పుణ్యక్షేత్ర మైన ధర్మస్థల ప్రాంతంలో మహిళలు, యువతుల పై జగిగిన, జరుగుతున్న దారుణ హత్యాచారాలను నిగ్గు తేల్చాలని మహిళ సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి డిమాండ్ చేశారు. వందల మంది స్త్రీలను హత్యలు చేసి పూడ్చి పెట్టినప్పటికీ అక్కడి ప్రభుత్వం వేగవంతమైన విచారణ చేయకుండా దోషులను కాపాడేలా చూస్తున్నట్టు అనుమానాలు వస్తున్నాయన్నారు. పూడ్చిపెట్టిన మృతదేహాలను వెలికి తీస్తూ విచారణ చేపడుతున్న సిట్, పోలిసు యంత్రంగానికి పూర్తి స్వేచ్ఛ కల్పించాలని ఆమె కోరారు. మహిళా సమాఖ్య కొత్తగూడెం పట్టణ శాఖ 3వ మహాసభ ఆదివారం ‘శేషగిరిభవన్’లో మునిగడప పద్మ, మేదిని లక్ష్మి, పైడిపల్లి లక్ష్మి, దారా లక్ష్మి, పుట్టి భాగ్యలక్ష్మి అధ్యక్షతన చాలా ఉత్సాహంగా జరిగింది. సమాఖ్య జెండాను ఎగురవేసిన అనంతరం జరిగిని ప్రతినిధుల మహాసభలో లక్ష్మి కుమారి మాట్లాడారు. భక్తి ముసుగులో దశబ్దాలుగా ధర్మస్థల లో వందలాది మంది స్త్రీలను అత్యాచారం జరిగిపి హత్యచేసి పుడేస్తున్న అక్కడి ప్రభుత్వాలు, ఇంటిలిజెన్స్, పోలీస్ వ్యవస్థ తెలుసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. పురుష ఆధిపత్య సమాజంలో స్త్రీలు ఎప్పుడు బానిసలు ఆటోబొమ్మలుగానే ఉన్నారని ఈ ఘటనల్లో ఎంతటివారున్నా వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బలమైన ఉద్యమాలు నిర్మించడం ద్వారానే మహిళలకు, మహిళా చట్టాలకు, హక్కులకు రక్షణ ఉంటుందన్నారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడుల అరికట్టడంలో పురుషాధిపత్య పాలకులు విఫలం చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ భృణ హత్యలు, ఆడపిల్లల అమ్మకాలు, హింస, వివక్ష వంటి దుశ్చర్యలను అరికట్టేందుకు పాలకులు పటిష్టమైన చర్యలు తీసుకోలేక పోతున్నారని విమర్శించారు. మహిళా సాధికారత సాధన, సమాన హక్కులు, 33 శాతం రిజర్వేషన్ అమలుకోసం మహిళాలోకం ఉద్యమబాట పట్టాలని ఆమె పిలుపునిచ్చారు. తమ హక్కుల సాధనకు మహిళలు ప్రభుత్వాలపై తిరగబడాలని కోరారు. ఈ మహాసభలో జిల్లా సహాయ కార్యదర్శి మామిడాల ధనలక్ష్మి, ప్రచార కార్యదర్శి కరీషే రత్నకుమారి, నాయకులు భరిగెల సంపూర్ణ, గోనె మని, సత్తెనపల్లి విజయలక్ష్మి, పాలమూరి ధనలక్ష్మి, పైడిపల్లిపల్లి లక్ష్మి, షాహీన్, కౌసర్, షమీమ్ తదితరులు పాల్గొన్నారు.

5న సీపీఐ జిల్లా మహసభను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ఈ నెల 5న ములుగు డిఎల్ఆర్ పంక్షన్ హాల్లో జరిగే సిపిఐ జిల్లా మహాసభను విజయవంతం చేయాలనీ, జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు తెలిపారు. ఆదివారం ములుగుజిల్లా కేంద్రంలో సిపిఐ కార్యవర్గ సమావేశంలో మల్లిఖార్జునరావు పాల్గొని మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఎర్రజెండా ఉంటుందన్నారు. కేంద్రంలో ఉన్న ప్రభుత్వం, కులాల పేరుతో, మతాల పేరుతో, కుతంత్రాలు చేస్తున్నందున, మతవాదులను ఎదుర్కోవడానికి ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా 5వ తేదీన ములుగు జరిగే మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహయ కార్యదర్శి జంపాల రవీందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు యుండి అంజద్ పాష, ఆచంట ప్రసాద్, ముత్యాల రాజు, ఇంజం కొమురయ్య,నెల్లబోయిన రవి, దర్ర గోపి పాల్గొన్నారు.

కోల్‌కతాలో మైనింగ్, మెటల్ అనుబంధ పరిశ్రమల నాలుగు రోజుల అంతర్జాతీయ ప్రదర్శన

విశాలాంధ్ర -హైదరాబాద్: కోల్‌కతాలో నిర్వహించబడుతున్న మైనింగ్, మెటల్ అనుబంధ పరిశ్రమల నాలుగు రోజుల అంతర్జాతీయ ప్రదర్శన- యొక్క బిడ్‌ను వివరంగా చర్చించే అవకాశం ఉందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు.ముఖ్యంగా కీలకమైన ఖనిజాలు ఎలక్ట్రానిక్స్ రంగాలలో, మైనింగ్ మ తయారీకి భారతదేశాన్ని ప్రపంచ కేంద్రంగా స్థాపించడంపై ఎక్కువ దృష్టి పెట్టడం దీని లక్ష్యమన్నారు. దేశీయ తయారీ సామర్థ్యాలతో పాటు మైనింగ్ మెటల్ పరిశ్రమ వృద్ధిని పెంచడానికి పెట్టుబడులను ఆకర్షించడం లక్ష్యంగా పెట్టుకున్న ఈ ప్రదర్శన, కోల్ ఇండియా చైర్మన్-కమ్-మేనేజింగ్ డైరెక్టర్ పి ఎం ప్రసాద్ ఈ విషయంలో గతంలో చేసిన వాదనను దృష్టిలో ఉంచుకుని ప్రాముఖ్యతను సంతరించుకుందన్నారు. దేశీయ బొగ్గు ఉత్పత్తి ప్రస్తుతం 875 మిలియన్ టన్నులుగా ఉండగా, 2026 లో 900 మిలియన్ టన్నులకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నందున విద్యుత్ ఉత్పత్తికి బొగ్గు కొరత ఉండదని ఆయన అన్నారు. అందువల్ల, IME & ISME 2025 మైనింగ్, పరికరాలు, ఖనిజాలు, లోహాలు, తాజా సాంకేతికతలు మరియు వాటి వినూత్న అనువర్తనాల ఆర్ అండ్ డి మరియు ఉత్తమ పద్ధతులను అంచనా వేయడానికి అనువైన వేదికలు. ఈ కాంగ్రెస్ మరియు ఎగ్జిబిషన్‌లో 600 మందికి పైగా ఎగ్జిబిటర్లు, 100 మంది స్పీకర్లు, 25 దేశాలు పాల్గొంటాయని భావిస్తున్నారు. ఆస్ట్రేలియా, రష్యా ఫెడరేషన్, జర్మనీ, చెక్ రిపబ్లిక్, పోలాండ్, చైనా మరియు మరికొన్ని దేశాలకు చెందిన కంట్రీ పెవిలియన్లు ఏర్పాటు చేయబడతాయని ఈవెంట్ నిర్వాహకులు MGMI, TAFCON తరపున ప్రతినిధి ఈరోజు ఇక్కడ తెలిపారు.

అనువాద కవిత

ప్రమాదవశాత్తు కాదమ్మా నీవు చనిపోయింది, అది ఓ కుట్ర

హిందీ మూలం: పూజా యాదవ్
తెలుగు అనువాదం: డా॥తక్కోలు మాచిరెడ్డి

క్రూరాతి క్రూరమైన సభ్యతా ఊబిలోకి
ఈడ్చబడినావు
లెక్క చెల్లించాల్సి వచ్చింది,
చైతన్యంతో ఎదుర్కొన్నందుకు
నీ జిహ్వ నీ చైతన్యాన్ని వ్యక్తం చేసే మాధ్యమం
కోసేశారు దాన్ని
కానీ గార్గిలాగా మౌనంగా ఉండటం
నీవు కోరుకోలేదు
చైతన్యపు కలంతో యుద్ధమే చేశావమ్మా
విప్లవ గేయాలు రాస్తుండినావు
ఒక్కొక్కటిగా సభ్యతల కట్టుబాట్లను
తుత్తునియలు చేసి పారేశావు
సరికొత్త లేఖన శైలిని అలవర్చుకున్నావు
నీవు స్వతంత్ర ఆలోచనలతో
నీ నిర్భయ దృక్కులు
సభ్యతను శాసించే క్రూరమైన
పాలకులను గట్టిగా గుచ్చుకుంటుండినాయి
నిన్ను వారు కుట్రల గుంటలోకి తోశారు
నీ మరణాన్ని ప్రమాదవశాత్తు
జరిగిందని తృప్తిగా అంటుండేవారు వారు
ఆ క్రూరులు

సాహితి

శతాబ్ది మానవ పతన శకానికి 'నిరసన' జ్వాల రగిల్చిన నగ్నముని

ఆచార్య కొప్పరపు నారాయణమూర్తి
7671909759

ఇరవై శతాబ్దాలు/దిక్కులేని దిక్కులు
ఊహల బండరాళ్లు ముక్కలైనయ్
కాలమృగం ఢీకొన్నది/రక్తమాంసాల నదిలో
కోరికలాంటి శిశుగర్భంలో/అణుకోర దిగింది
చర్చి గంటలు/మసీదులో మంటలు/గర్భగుడిలో చెరచబడ్డ విగ్రహాలు/గ్రామఫోను రికార్డులో తన్నుకుంటున్న గాయకుడు/వాల్ పోస్టర్లో మానాన్ని దాచుకొంటున్నది అభినేత్రి/గళ్ళలుంగీ రోడ్డుమీద రాజకీయాల కారాకిల్లీ ఉమ్ములు /సెకండ్ షో వదిలారు (దిగంబరకవులు – 1965: మొదటి సంపుటి). -ఇది గడచిన శతాబ్దిలో మానవుడు సాధించిన 'ప్రగతి ఔన్నత్యం' అంటారు నగ్నముని దిగాలుగా. ఎంతటి నిర్వేదం, నిస్తేజం కవిని ఆవహించాయోకదా!

నిజమే, కవి ఒక మనిషేగదా! కవికి కూడ కొన్ని ఆశలు, ఊహలు, ఊసులు ఉంటాయి కదా! అవి కవి కళ్ల ముందే పటాపంచలై పోతున్నప్పుడు, కవి కన్నకలలు కన్న పిల్లల్లా ఉప్పెనలాంటి సమాజదోపిడీ, దౌర్జన్యఅలల్లోకి జారి పోతున్నప్పుడు, అతని అంతరంగం ఎంత భగభగ మంటుందో, ఎంతటి నిరాశా మబ్బులు కవి జీవితాన్ని కమ్మేస్తాయో చెప్పకనే చెబుతున్నాయి పై పలుకులు ఇనుప ములుకుల్లా.

ఒక తరానికి ముందు (అంటే ముప్ఫయి ఏళ్ల క్రితం) 'నగ్నముని' ఎవరో పరిచయం చేయవలసిన పనిలేదు. ఇవ్వాళ యంత్రాలొచ్చి, చేతిలో యంత్రం, గది గదికి యంత్రం, మనుషుల జీవితాలను యంత్రాలే అధిరోహించి నడుపుతూ, మనిషినే యంత్రంగా మార్చేసిన వేళ బహుశ 'నగ్నముని' గురించి మరొకసారి వివరం ఇచ్చుకోవలసి ఉందేమోననిపిస్తుంది.

'నగ్నముని 'రచనలు కళ్ల ముందు జరుగుతున్న వాస్తవాలను 'నగ్నంగా' ఎండ కడుతున్ననాడు, మనిషిలో 'మనిషి' ఇంకా బతికే ఉన్నాడు. ఆ మనిషి తన జీవితానికి దారి, తెన్నూ చూపేవాళ్ల కోసం వెతుకుతున్న రోజులవి. తమజీవితాల్లోకి ఏవి వెలుగులు తెస్తాయోనన్న అన్వేషణలో ఉన్న రోజులవి. అప్పుడు 'నగ్నముని'లాంటి కొందరు కవులు 'జరుగుతున్న వాస్తవాలను' 'నగ్నంగా', 'కర్కశంగా' ఎండకట్టి మనుషులను చైతన్య పరిచేందుకు కదం తొక్కారు. వారినే 'దిగంబరకవులు' అన్నారు.

వారిలోఆద్యుడు 'నగ్నముని'. అసలు పేరు మానేపల్లి హృషికేశ్వరరావు. జన్మించింది తెనాలిలో. కొంత విద్యాభ్యాసం బందర్లో చేసి ఆ తరువాత హైదరాబాదు చేరారు. అక్కడే డిగ్రీ పూర్తిచేసి, రాష్ట్రపబ్లిక్ సర్వీసు కమిషన్ పరీక్షలో పాసయ్యి, రాష్ట్ర ఉభయ శాసనసభలకు ప్రధాన పత్రికా సంపాదకుడిగా వ్యవహరించారు.

1965-70 మధ్య ఈయన, మరో అయిదుగురు కవులతో 'దిగంబరోద్యమం' ప్రారంభించారు. మిగిలిన అయిదుగురు నిఖిలేశ్వర్, జ్వాలాముఖి, చెరబండరాజు, భైరవయ్య, మహాస్వప్న. దుర్మార్గ వ్యవస్థలపై, రాజ్యం (స్టేట్)పై, సమాజంలోని అసమానతలపై తిరుగుబాటు బావుటా ఎగరేసిన మహాకవుల్లో అగ్రభాగాన నిలిచిన వారు నగ్నముని. ఈ కాలంలో మూడు సంపుటాల్లో తమ నిరసనాగ్నిని ఆవిష్కరించారు నగ్నముని. 'నేను సాహిత్యంలో రాజకీయరంగానికి చెందిన ఉద్యమ కవిని, రచయితని' అని ధైర్యంగా చాటుకొన్న మొదటి దిగంబరకవి 'నగ్నముని'. 'నా రచనల్లో రాజకీయాంశం నేపథ్యంగా నిలిచి ఉంటుంది. ప్రకటించకపోయినా, నేను సారథ్యం వహించిన దిగంబర కవితోద్యమం రాజకీయ అంశానికి చెందినది' అని తన ముందుమాటలో ఖరాఖండిగా నిష్కర్షగా చెప్పారు నగ్నముని.

'ఎవరెన్ని కబుర్లుచెప్పినా, తెలుగుకవి నేడు మరోసారి చౌరస్తాలో నుంచున్నాడనేదివాస్తవం. మూడు దశాబ్దాలుగా కలం దించకుండా పోరు సాగిస్తున్న యోధుడు నగ్నముని గురించి మాట్లాడుకోవటం నేడు ఎంతైనా ఉపయోగకరం' అంటారు వెనుక మాట రాసిన హెచ్చార్కె.

కవి గతానికి, వర్తమానానికి అనుసంధానమైతే, భవిష్యత్తుకు చుక్కానీ లాంటి వాడవుతారు. కవి ఆత్మ వర్తమానానికి ప్రతిబింబం, భవిష్యత్తుకు దర్పణం కూడా. ఈ రెండు లక్షణాలు కూడ కలగాపులగంగా నగ్నముని నూతన కవితాసంపుటి' నిరసనశకం'లో కనిపిస్తాయి. 'నిరసనశకం' 2025 లో తొలిముద్రణ పొందింది. ఇందులో దిగంబరోద్యమం నాటి తొలి కవితలు కొన్ని, ప్రతి ఏటా తను రాసిన కవితల్లో నుంచి ఎంపిక చేసినవి కొన్ని మొత్తం 82 కావ్యాలు, కవితలున్నాయి. 1987లో రాసిన 'అద్వైతరాజ్యం'తో ఆరంభమయ్యే ఈ సంకలనం 'నేలా నింగి శ్రీశ్రీ' (2014) తో ముగుస్తుంది.

'ఈ సమాజం/ ఆర్థిక నేరస్తుల మానస సరోవరం/ హంస మాంసం రుచి మరిగిన /అక్రమార్జనపరుల రక్షిత ప్రదేశం /ఇది కలియుగం కాదు/ మానవ కల్పిత ఆకలి యుగం/'-అంటూ ఆక్రోశించే నగ్నముని దీనిని 'అద్వైత రాజ్యం' అని ఎందుకన్నాడబ్బా అని ఎవరికైనా సందేహం రావచ్చు. 'అద్వైత'-అంటే రెండవది లేనిది. 'రాజ్యం' (స్టేట్) అంటే పాలనాయంత్రాంగం'. అంటే 'దోపిడి' ఒక్కటే ఉన్నదీ రాజ్యంలో' అని అర్థం చెప్పుకోవచ్చు.

'1962 నాటికే స్వాతంత్ర్య ఫలాలు చేదుగా మారాయని గ్రహించిన 'నగ్నముని' ఎవరో పిలిచేదాకా ఆగలేదు' అంటారు హెచ్చార్కె. 'ఉదయించని ఉదయాలు'గా గొంతుక సవరించుకొని ఉద్యమించిన నగ్నముని 'అద్వైత రాజ్యం' (1987) నాటికి కవితోద్యమాలకు ఒకరూపు, ఊపు రగిలించారు. 'మనం మోసపోయాం/మనం కపటంతో కాటువేయబడ్డాం/తీతువులా సెక్యులర్ నినాదాలు కూసే /సోషలిస్ట్ తరహా రాజ్యంలో /మనం బందీలం/జీవితంతరహా జీవితంలో/ సజీవశవాలం' అంటూ ఏకంగా నిజాలను నిట్టనిలువుగా, నిక్కచ్చిగా, నగ్నంగా ఎండకట్టారు.

'అద్వైత రాజ్యంలో /మహామహా మేధావులు/ప్రపంచ రాజ్యాలఅంగాలన్నీ /శోధించి మధించి రచించిన రాజ్యాంగం/ మనోహర మంత్రపుష్పం/ పౌరుడికి పని హక్కులేని ప్రజాస్వామ్యం/ఎగర లేనిరెక్కల/ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల విహంగం/ చివరికి మార్జాలం చేతికి చిక్కినట్లు... మనం మోసపోయాం/మనం మొదట్లోనే తప్పిపోయిన బాటలేని బాటసారులం' అంటూ మన ప్రజాస్వామ్యం, రాజ్యాంగంలోని మౌలిక స్వరూపంలోనే ఏ లోపాలు ఈ దేశ జడత్వానికి హేతువైనాయో ఎండకట్టే ప్రయత్నం చేశారు నగ్నముని. 'అద్వైత రాజ్యం' ఒక 'సుదీర్ఘ కవిత' లేదా 'చిరుకావ్యం' అనవచ్చు. ఇందులో 'మనం మోసపోయాం, మనం కొల్లగొట్టబడ్డాం, మనం వంచింపబడ్డాం, మనం విసిగిపోయాం' అనే వాక్యాలు చర్విత చరణంగా కావ్యంలో అడుగడుగునా వస్తుంటాయి.



నగ్నమునిది ఒక విశిష్టమైన శైలి. ఆ శైలి ఆయన కవితా యుగం ఆసాంతం ఆవిష్కారం అవుతూనే ఉంది. 'ఎవరో ఆకలిని ఆరవేశారు/ ఆకాశం రక్తం కక్కుతోంది /రెపరెపలాడే జీవితాల మీద/ దీపాల్లేని బజార్లో పాపాల మీద/ దిక్కులేక రోదించే నా గీతాల మీద...ఎవరో మరణ శాసనం లిఖిస్తున్నారు...ఎవరో ఆకలిని ఆరవేశారు/ వంటి కవితా నిర్మాణం నగ్నమునికే చెల్లింది. ఇందులో 'ఎవరో ఆకలిని ఆరవేశారు' అన్న పంక్తి రెండుసార్లు పునరావృతం అయితే, 'ఓయ్ఓయ్ టాక్సీ, హోయ్ హోయ్టాక్సీ' వంటి పంక్తులు చాలాసార్లు పునరావృతం అవుతాయి. అలానే 'ఏయ్వెయిటర్/అమ్మాయీవెయిటర్' కూడా పునరావృతం అవుతుంది. ఇలాంటి పునరావృతాలతో కవితా విషయం/ వస్తువు ముందుకు సాగుతూ పోవటం బహుశ ఉద్యమ కవితా లక్షణంఅయి ఉండాలి.

'నేనెక్కిన టాక్సీనెంబర్' కూడా ఒక చిరు కావ్యమే. 1964 లోఉద్యమం అప్పుడప్పుడే ప్రేరేపితమవుతున్న రోజుల్లో రాసినది. ఆ తొలి నాటి కవితా లక్షణాలు లక్షణంగా కనిపిస్తున్నాయి. నైరాశ్యం నిండిన భావ శకలాలు ఒక గొట్టంతో వెదజల్లినట్టు పుష్కలంగా కనిపిస్తాయి కవిత నిండా. 'జీవితం తన వెంట నడిచే స్వప్నంగా/నగరం నిసర్గ స్వర్గంగా నమ్మి వచ్చిన చిరునవ్వుని/సరిగ్గా ఆ వేళలో అక్కడే చూశానయ్యా/ ప్రమాదాలు పసిగట్టలేక పోయానయ్యా'/ అన్నది ఈ కావ్యంలో పతాకశీర్షిక అంచున మెరిసిన మెరుపు.

'జైల్లో సముద్రం' కవితలో కూడ 'సూర్యునికి అడ్డంగా నుంచున్న ఆ మబ్బు తునక పేరేమిటి' అనే పంక్తి రెండుసార్లు పునరావృతం అవుతుంది. కవిత చివరలో 'సత్యానికి సత్యానికి నడుమ నిలుచున్న ఆ మబ్బు తునక పేరేమిటి' అని ముక్తాయిస్తారు నగ్నముని. భరతజాతి స్వాతంత్ర్యానంతరం పొందిన నైరాశ్యం కవి ఇలా వర్ణిస్తాడు. 'ఇరవై శతాబ్దాలు/దిక్కులేని దిక్కులు/ ఊహల బండరాళ్లుముక్కలైనయ్/ కాలమృగం ఢీకొన్నది ఆకొన్నది/ రక్తమాంసాల నదిలో కోరికలాంటి శిశు గర్భంలో/అణుకోర దిగింది/చర్చి గంటలు/మసీదులో మంటలు/ గర్భగుడిలో చెరచబడ్డ విగ్రహాలు/ గ్రామఫోన్ రికార్డులో తన్నుకొంటున్న గాయకుడు/వాల్పోస్టర్లో మానాన్ని దాచుకొంటున్నది అభినేత్రి/ గళ్ళలుంగీ రోడ్డుమీద రాజకీయాల కారాకిల్లీ ఉమ్ములు/సెకండ్షో వదిలారు'. ఇది ఆనాటి మనదేశ సగటు పౌరుల అంతరంగంలో నెలకొని ఉన్న నిస్పృహలకు అక్షర రూపం.

'భూగోళంపైన పంచభూతాలనే కవితల్ని రచించింది నేనే' (హృదిక్) అని ఢంకా బజాయించి మరీ చెప్పాడు నగ్నముని. తన దిగంబరకవులు రెండవసంపుటి (1966)లో. మొహమ్మీద చంద్రుడు, వద్దు వద్దు రావద్దు వంటి కవితలు ఈ కాలానికి చెందినవే. '20 శతాబ్దాల దారుణ మానభంగాల్ని/ భ్రూణహత్యల్ని అంతులేని అంధకారాన్ని/ఇక్కడ దాచాను పూడ్చాను/వద్దువద్దు/ ఇక్కడికెవ్వరూ రావద్దు/ ఈ తలుపుల్ని తెరవొద్దు- 'తూర్పుగాలి' సంపుటిలో కనిపించే నాటి దేశ పరిస్థితులు. 'గర్భలోకాల భవిష్యత్తును పాపల్లారా' వంటి ప్రయోగాలు పుట్టబోయేతరం పసికందుల నుద్దేశించి రాసినవి కూడ ఈ కవితలో కనిపిస్తాయి. కవి నిస్తేజం ఎంత దూరం విస్తరించిందో ఈ ప్రయోగం చెప్పకనే చెబుతుంది. అందువల్లేనేమో కవిని 'త్రికాలదర్శి' అని అంటారు.

'కనుదిక్' కవితలో చీకటిని సార్వత్రిక భూమికగా మార్చి ప్రతి పంక్తి చివర 'చీకటి' పదాన్ని చేర్చి దీర్ఘకవిత రాస్తారు నగ్నముని. 'దిగంబర కవులు'మూడవ సంపుటిలోని విశిష్టశైలి కలిగిన కవిత ఇది. స్కూళ్లలో చీకటి,గుళ్లలో చీకటి, మసీదుల్లో చీకటి, చర్చి ప్రార్థనల్లో చీకటి, బ్యాంకుల్లో చీకటి, బార్లలో చీకటి.... సభల్నిండా చీకటి......సిద్ధాంత రాద్ధాంతాల చిమ్మచీకటి...నీరెప్పల్ని కూడ నమ్మకు, చుట్టూ మిత్రద్రోహంలా చీకటి' అని చీకటిలో మనిషి ఎలా దుర్భర జీవితాన్నీడుస్తున్నాడో ఎండగడతాడు నగ్నముని. ఇవన్నీ పచ్చినిజాలే. దాదాపు ప్రతి సగటుమనిషి నోటి నుంచి రోజు మొత్తంమీద ఒక్కసారైనా ఈ నిజాలను ఎక్కడోచోట వింటూంటాం. పాపం! అంతకన్నా ఎవరు మాత్రం ఏమి చేయగలరు?

'అక్షరమే అస్త్రం'గా సమాజంపై ప్రయోగించమని పిలుపునిస్తాడు 'ఈ తరానికో మాట/కవిత్వం ఒక ఆయుధంగా/భావాలు బారీకేడ్లుగా/మాటలు మెషిన్గన్లుగా/ రాజ్యం మెదడులో విస్ఫోటనం జరగవలసి వుంది /ఇప్పటికైనా సన్నద్ధం కావలసి ఉంది. వాక్యం రసాత్మకం నాడు /వాక్యం సంఘర్షణాత్మకం నేడు'. ఇలా, ఇంత ప్రత్యక్షంగా జాతిని ఉత్తేజపరిచే ప్రయోగాత్మక కవితలు 1969 నాటికే ఈ తెలుగునాట రాయటమంటే సాహసమేనని చెప్పాలి. ఎందుకంటే 1967-70 మధ్య ఉత్తరాంధ్రాలో నక్సలైట్ల ఆయుధ పోరాటం జరుగుతున్న కాలం అది. పశ్చిమ బెంగాల్లోని చారుమజుందార్, కానుసన్యాల్ ప్రేరేపిత నక్సల్బరి ఉద్యమం ఆంధ్రాకు విస్తరించి, ప్రభుత్వం నుంచి తీవ్ర వ్యతిరేకత, నిర్బంధం ఎదుర్కొంటున్న సమయం అది.

నగ్నముని కావ్యాలు, కవితల్లో భావుకత, సంక్లిష్టత సహజం అయినా, కొన్ని కొన్ని కవితలు తాత్వికత, తార్కికత రెండూ కలబోసి సులభ గ్రాహ్యంగా ఉంటాయి. అందులో 1970లో రాసిన 'జననం' (తూర్పుగాలి) ఒకటి. 'నీరస జాతిని భోగించే నీరసజాతి నీరసజాతిగానే ఉంటుంది/ నీరసత్వ వారసత్వం సాంప్రదాయమై అన్ని రంగాలా/అధికారం చలాయిస్తుంది/ నపుంసకత్వం మన శత్రువు.'

అలాంటి కవితనే 'కవి'. గాలిని గురించీ రాయి/గాలిని మాత్రం నీ గీతాల్లో నింపకు/నీటిని గురించి రాయి/ రక్తంలో నీటిని మాత్రం కలపకు/ ఇలాంటి కవితలు నగ్నమునితరం కవులనే కాక నేటీతరం కవులకు కూడా ఊపిరి ఊదుతాయంటే సందేహం లేదు. ఆ అల్పాక్షరాలలో ఉన్న అనల్ప శక్తి అటువంటిది. నగ్నముని వ్యంగ్యోక్తులు కూడ చాలా పదునుగా పందెంకోడి కాళ్లకు కట్టిన 'కోడికత్తి'లా ఉంటాయి.

సమాధుల చుట్టూ పూలమొక్కలు / సమాధుల మీద పూలుదీపాలూ/ సమాధుల్లో దేశం కోసం చేసిన త్యాగాలు/ సమాధుల ముందు నక్కల రాబందుల వొంగివొంగి దన్నాలు ఆ కోవలోకి చెందినదే. కె.ఎల్. సైగల్ పాటలంటే నగ్నమునికి ఇష్టం కామోసు. 'ఒక పాట నన్ను పగబట్టింది' అని, అది ఎంతగా పగబట్టిందో రాసుకొచ్చారు. 'టెలిఫోన్ టాపింగ్' నేటి వేడివేడిచర్చ. కానీ, చాలాకాలం క్రితమే దీనిని చీల్చి చెండాడాడు నగ్నముని. 'మన ఉద్రేకాల వేడివాడి/ సరికొత్త పరికరాలతో నిత్యం కొలుస్తున్నారు / మన జీవితం కాపీలు తీస్తున్నారు/ పరిపరి విధాల పరిశోధనలు చేస్తున్నారు/అంటూనే మనకెవ్వరికీ సొంతంగా ఆలోచించే శక్తి లేకుండా చేయడానికని ఆ రహస్యం కూడ విప్పి మన ముందుపెట్టారు.

ఎన్ఆర్ఐ సంబంధాల కోసం తెలుగునాట వెంపర్లాట ఎక్కువైపోయిన నాడు దాని బారిన పడి ఆడ బతుకులు బుగ్గిపాలైన నాడు రాసిన కవిత 'ప్రవాసపులి'. 'తెగించు/విదేశీ వరకట్నం స్వదేశీ పసుపుతాడు/ప్రవాస పులికి/ ఉరితాడు చెయ్యి అంటూ చైతన్యాన్ని నూరిపోస్తారు నగ్నముని. కోతి నుంచి మనిషి వచ్చాడని డార్విన్ చెప్పాడు. కానీ, మనిషిలోంచి కోతి వస్తున్నాడంటాడు నగ్నముని 'డార్విన్కోతి' కవితలో. 1987 లో రాసిన 'జమ్మిచెట్టు' ఈ 'నిరసనశకం' పొత్తంలో పెద్దకావ్యం. 'జమ్మిచెట్టు ఆయుధాల చెట్టు/ప్రతి మనిషిలోనూ వున్నది జమ్మిచెట్టు /ఆలోచనలే ఆయుధాలు/ చేపట్టి సారిస్తే/మనిషిలోంచి/మనీషలోకం/నిర్మించవచ్చు అంటూ ముక్తాయిస్తాడు ఈ కావ్య ఖండికను.

శ్రీశ్రీ అభిమానించని విప్లవకవులు దాదాపులేరేమో. కవులు గానివారు కూడా శ్రీశ్రీ పేరు ఒకసారి ఉచ్చరించకపోతే వారికి సాహిత్యం తెలుసని చెప్పుకోవటానికి వేరే మార్గం లేదన్నంతగా శ్రీశ్రీని ఉటంకిస్తుంటారు. శ్రీశ్రీ యుగకర్తనే. కొన్ని తరాల తరువాత కూడా శ్రీశ్రీ ఇంకా మనుషుల నాలికల చివరనే జీవిస్తున్నాడంటే శ్రీశ్రీ ఒక మాయనే. సందేహంలేదు. ఆ మాయను నగ్నముని ఇలా బంధించాడు తన కవితా బాహువుల్లో: రెండు యుద్ధాల మధ్య శ్రీశ్రీ /రెండు వర్గాల మధ్య శ్రీశ్రీ /సామ్రాజ్యవాదానికి /స్వార్థ దాహానికి బలియై /మట్టిలో కూరుకుపోతున్న జీవచ్ఛవాల్ని /అక్కునచేర్చుకుని / ఖడ్గం దూసినా శ్రీశ్రీ/ ఇలా నేలానింగి అంతటా శ్రీశ్రీనే దర్శించారు నగ్నముని (నేలానింగి శ్రీశ్రీ, 2014) .

ఆధునిక మహా కావ్యంగా కీర్తిగణించిన 'కొయ్యగుర్రం', ఎమర్జెన్సీ రోజుల్లో రచించి ప్రకటించిన 'విలోమ కథలు', 'ఆకాశదేవర,', ఇప్పుడు 'నిరసనశకం' అన్నీఎల్లకాలాలకు నిలిచిపోయే ప్రేరణలు, ఊపిరులు.

విద్యార్థుల్లో భాషపై ఆసక్తి పెంచే తెలుగు ఒడి

డా. అమ్మిన శ్రీనివాసరాజు,
సెల్: 77298 83223

గ్రంథ సమీక్ష

తెలుగు సాహితీసీమలో విలక్షణ రచనా తిలకం రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి. తను ఏది రాసినా భావిసమాజాన్ని దృష్టిలోపెట్టుకొని బాధ్యతాయుతంగా రాస్తారు. సాహిత్యంలో ఏ ప్రక్రియ చేపట్టినా ఎంతటి విలక్షణరచన చేయాలన్నా ముందు భాషపై గట్టిపట్టు ఉండాలని నిండుగా నమ్మిన మల్లీశ్వరి, భావి రచయితలకు భాషా పుష్టి కలిగించడం కోసం చేయని ప్రయోగం లేదు. అంకితభావంతో ఆదర్శనీయంగా తెలుగు భాషా వికాసం కోసం కృషి చేస్తున్న వారిలో అగ్రగణ్యులు మన మల్లీశ్వరి. సుదీర్ఘకాలం బాలలతో అత్యంత చేరువగా నడ యాడినఈమె వారి మనసెరిగిన రచయిత్రిగా... ఉపయోగించే భాషలోనూ చెప్పే తీరులోనూ నేటితరం ఆధునిక బాల్యానికి అనుగుణంగా జాగ్రత్తలుపాటిస్తూ రచనలు చేస్తున్నారు. అందులో భాగంగానే వీరు రాసిన 'బాలలకోసం తెలుగుఒడిలో' పుస్తకం. సాధారణంగా 'పదనిధు'లైన శబ్దరత్నాకరాల గురించి అందరికీ తెలుసు. అవి వివిధరకాలుగా ఉండి పాఠకులకు పదాల అర్థాలు, నానార్థాలు, ఉత్పత్తి అర్థాలు తెలుపుతూ భాషా విజ్ఞానం పంచుతాయి. అదేకోవకు చెందినదిగా కనిపిస్తున్నా కాస్త వినూత్నంగా విద్యార్థులకు ఆసక్తిని ఆకర్షణను కలిగించే రీతిలో ఈ పుస్తకాన్ని తీర్చిదిద్దడంలో రచయిత్రి సఫలమయ్యారు.

చెట్లు, పుష్పాలు, జంతువులు, పక్షులు, రుచులు, తదితరఅంశాలను ఎంపికచేసి సంబంధిత అంశాల్లోని పదాలకు చెందిన అర్థాలు నానార్థాలు మాత్రమే చెప్పి ఊరుకోకుండా ఆయా పదాలకు సంబంధించిన పురాణ, సాహితీ, సంబంధ విశేషాలు, వాటితో గల సామెతలు నానుడులతో పాటు బాలసాహిత్యంలో వాటిపైగల గేయాలు, పాటలు, కూడా ఇందులో పొందు పరిచారు. దీనివల్ల విద్యార్థులకు పదాల అర్థాలు తెలుసుకోవడంతో పాటు వాటినేపథ్యాలు సహేతుకంగా అర్థంఅయి, కలకాలం గుర్తుండి పోతాయి, విలువైన భాషా చరిత్ర తెలుస్తుంది. జీవులకు ప్రాణాధారం అయిన నీరు గురించిన వివరణలో నీళ్లు అనే పదాన్ని ఎన్ని రకాలుగా రాయవచ్చునో వివరించి, దానికిగల అప్పు, అగ్నిజము, సత్యము, మొదలైన అర్థాలను కూడా చెప్పడం కొత్తగా ఆసక్తిదాయకంగా ఉంది, అలాగే నీటితో ముడిపడిన తెలుగు సామెతలు గురించి కూడా.

'నీటి పైన గుండు మునగక నిలుచునా?', 'నీరుముత్యమైనట్లు ముత్యము నీరుగామారునా?', వంటి కొత్తసామెతలు కూడా గుర్తు చేశారు, అదేవిధంగా నీటి యొక్క మరో పేరు జలము కనుక దానితో కలిసివచ్చే పదాలను ఇందులో పరిచయం చేస్తూ సముద్రంను, 'జలపతి' అంతర తామరను 'జలవల్లి' అని, జలఆధారంగా జీవించే మొసలిని 'జలసూచి' అంటారనే విషయాన్ని ఇందులో విపులీకరించారు. అలాగే 'అల'ను 'నీటికొండ'అని, నక్షత్రాలుగా చెప్పే పూర్వాషాడను 'నీటి రిక్క'అని శతభిషను 'నీటి రేనిరిక్కరి' అంటూ... మనం అతి సాధారణంగా పిలిచే నీటికి గల భాషావిషయాలు విశేషాలు గురించి అద్భుతంగా చెప్పారు, దీనివల్ల తెలుగు భాష వైభవం గురించి తెలియడమే గాక భాషపై అభిమానం ఆసక్తి పెరిగి తెలుగు నేర్చుకోవాలనే ఇష్టం పెరుగుతుంది అనడంలో ఎంత మాత్రం అతిశయం లేదు.

మన ప్రకృతికి సొగసులు అద్దె పూల గురించి మనకు బాగాతెలుసు అనుకుంటాం, కానీ ఆ పూలలోని రకాలు ముఖ్యంగా తీగపూల గురించి అంతగా అవగాహన ఉండదు, అయితే ఈ తీగ పూల గురించి కేవలం అర్థాలు పేర్లు మాత్రమే వల్లె వేయకుండా తీగజాతి పూలన్నీ సాయంత్రం మాత్రమే పూస్తాయి అనే వైజ్ఞానిక సత్యాన్ని కూడా విడవకుండా చెప్పడంలో రచయిత్రి బాధ్యత ఏమిటో అర్థంఅవుతుంది, అలాగే ఆబాలగోపాలం ఇష్టపడే ఆటల గురించి వివరిస్తూ అర్థాలు చెబుతూనే వివిధ రకాల క్రీడా విశేషాలు వివరిస్తూ పూర్వకాలపు మన గ్రామీణక్రీడల వివరాలు కూడా క్షుణ్ణంగా ఇందులో పొందు పరిచారు, అదే విధంగా ఆటలకు సంబంధించిన వివిధ గేయాలు సైతం అందించారు అదేరకంగా రుచులు విభాగంలో షడ్రుచులను గురించిన పరిచయాలు చేసి వదిలివేయకుండా ఆయారుచులు లభ్యమయ్యే కారకాలను ఉదాహరించడం రచయిత్రిలోని నైపుణ్యయుత రచన తీర్పు మచ్చుతునక. మానవ జాతిలో భాగమై జీవిస్తున్న జంతువుల ప్రస్తావన కూడా ఇందులో మనం చదవవచ్చు. కపటానికి మోసానికి చిరునామాగా చెప్పుకునే 'నక్క' గురించి చెబుతూ కిగి, జంబుకము, బుద్ధిమెకము, వంచకము, సగ్గారి, సృగాలము, శివ, మొదలైన అనేక అర్థాలను ఇందులో తెలియజేశారు, అదే విధంగా నక్క నేపథ్యంలో గల సామెతలు, జాతీయాలు తదితరాలు ఇందులో మనం తెలుసుకోవచ్చును.



చెట్లలో ప్రధానమైనది ఏది? అంటే ఇదే అని కచ్చితంగా చెప్పలేం, దేని ప్రత్యేకత దానిది దేని ఉపయోగం దానికి ఉంటుంది, అలాగే మనుషులు కూడా...అని అర్థంచేసుకోవాలి, అప్పుడే మనుషుల్లో వ్యత్యాసాలు భేదాభిప్రాయాలు తొలగి ఐక్యత భావం ఆవిష్కరించబడుతుంది అనే మంచి జాతీయ భావసందేశం అందిస్తూ అరటిచెట్టును సైతం చాలాచక్కగా ఆవిష్కరిస్తూ...కేవలం జాతీయాలు, సామెతలకే పరిమితం చేయకుండా మరింత ఆసక్తి కలిగిస్తూ అరటిచెట్టు గురించి గల పొడుపుకథలు సైతం ఇందులో పొందుపరిచి పుస్తకం విలువను మరింతగా పెంచగలిగారు, ఇలా ఆసాంతం అక్షర విన్యాసాల నడుమ భాషా సొగసులను, అటు పాటలను కలగలిపి ఆకర్షణీయమైన శైలిలో తెలుగుభాషసొగసులు అందరికీ చేరువచేయాలనే లక్ష్యంతో మల్లీశ్వరి రాసిన ఈ 'తెలుగు ఒడి' పుస్తకం నిజంగా భాషా ప్రేమికుల పాలిట అమ్మఒడి అనడంలో సందేహం లేదు.

తెలుగు ఒడిలో....(వ్యాసావళి)
రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి
పేజీలు: 136, ధర: 150 /-రూ,
ప్రతులకు: రాజా వాసిరెడ్డి ఫౌండేషన్ హైదరాబాద్,
సెల్ : 98665 83907

సమసమాజ స్థాపన

బైరాపట్నం రామకృష్ణ, సెల్: 94909 48834

పల్లవి: కమ్యూనిజం మార్క్సిజం సమసమాజ స్థాపనే మా లక్ష్యం

చరణం: విప్లవాల పురిటిగడ్డ ఒంగోలు నగరంలోన
భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర మహాసభలకు
మేము సైతం కదలండి విప్లవ జనవాహినిగా
హక్కులకై కదలండి. మైలురాయి నాటండి (కమ్యూనిజం)

చరణం: భూమికోసం భుక్తి కోసం పోరుబాటన నడిపినట్టి
భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర మహాసభలకు
వెనుకబడిన వర్గాలకు అండగా నిలిచిన జెండా
సీపీఐ అండ అన్న, ఎర్రజెండ మనదన్న (కమ్యూనిజం)

కాల్వనీరు రాకపోతే బోరుబావి తీసినావు
అప్పుమీద అప్పుచేసి వడ్డీలతో కుంగినావు
రైతాంగ హక్కులకై కలసి ఉద్యమించాలి
ఎండుతున్న రైతు గుండె వెన్నెలై పూయాలి (కమ్యూనిజం)

పేద ప్రజల హృదయాల్లో స్థిరంగా నిలిచినట్టి
శ్రమ జీవుల పోరులోన నిప్పులు కురిపించినావు
కార్పొరేట్ల దోపిడిపై ధ్వజమెత్తిన సీపీఐ
ఉప్పెనలా కదులుతుంది భారత కమ్యూనిస్టు పార్టీ (కమ్యూనిజం)

మహిళలకు పాలనలో భాగమివ్వమన్నది
విదేశీయ పెత్తనాన్ని తరిమికొట్టమన్నది
సాంప్రదాయ సాంస్కృతిని కాపాడాలన్నది
దేశ సమైక్యతను నేను సైతమన్నది (కమ్యూనిజం)

యువజన విద్యార్థుల హక్కులకై ఉద్యమించే
వ్యవసాయ కార్మికుల పోరువర్గ మార్గదర్శి
ఎర్రజెండా బిడ్డలై కలసిమెలిసి నడుద్దాం
భారత కమ్యూనిస్టు పార్టీకి జైజేలు పలుకుదాం

(ఒంగోలు నగరంలో సి.పి.ఐ. రాష్ట్ర 28వ మహాసభల సందర్భంగా...)

తొలి రోజు జైలులో ప్రజ్వల్ రేవణ్ణ

బెంగళూరు: మహిళలపై లైంగిక దాడి కేసులో మాజీ ప్రధాని దేవెగౌడ మనవడు, మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు ప్రజాప్రతినిధుల కోర్టు జీవితఖైదు విధించిన నేపథ్యంలో అతడిని బెంగళూరులోని పరప్పన్ అగ్రహార సెంట్రల్ జైలుకు శనివారం పోలీసులు తరలించారు. అనంతరం అతడికి ఖైదీ నెంబర్ 15528 కేటాయించారు. అయితే అతడు గత రాత్రి... అంటే శనివారం రాత్రి చాలా విచారంతోపాటు కొంత ఒత్తిడితో కనిపించారని జైలు అధికారులు ఆదివారం తెలిపారు. శనివారం రాత్రి బాగా పొద్దుపోయిన తర్వాత ప్రజ్వల్ ఆరోగ్యాన్ని వైద్యులు పరీక్షించారని చెప్పారు. అతడి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉన్నట్లు చెప్పారన్నారు. వైద్యులు పరీక్షిస్తున్న సమయంలో సైతం అతడు దీనంగా ఉన్నాడని, అలాగే తన బాధను వారికి వ్యక్తం చేశాడని చెప్పారు. మరోవైపు ప్రజా ప్రతినిధుల కోర్టు ఇచ్చిన తీర్పుపై తాను హైకోర్టుకు వెళతానని సిబ్బందికి తెలియజేసినట్లు తెలుస్తోంది. ఇంకోవైపు అతడిని భారీ భద్రత ఉన్న సెల్‌లో ఉంచామని, అతడిని ఉంచిన సెల్‌కు అసాధారణ భద్రత కల్పించామని అధికారులు చెప్పారు. సాధారణ ఖైదీలకు వలే డ్రస్ కోడ్ ఆయనకు ఉందని తెలిపారు. ఆ డ్రస్‌ను ప్రజ్వల్‌కు అందజేస్తామని స్పష్టం చేశారు. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికలకు కొద్ది రోజుల ముందు హాసన్ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు చెందిన కొన్ని అసభ్యకర వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అదే సమయంలో ప్రజ్వల్ రేవణ్ణ తమపై లైంగిక దాడి జరిపినట్లు కొంతమంది మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కర్నాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్)ను నియమించింది. దీనిపై సిట్ విచారణ జరిపి... ప్రజ్వల్‌పై వచ్చిన ఆరోపణలు వాస్తవమని తేల్చి చెప్పింది. దీంతో బెంగళూరులోని ప్రజా ప్రతినిధుల కోర్టు అతడికి జీవితఖైత విధించింది. రూ.11.50 లక్షల జరిమానా విధించింది.

మాలేగావ్ పేలుళ్లు కాంగ్రెస్ కుట్ర

ప్రజ్ఞా ఠాకూర్

భోపాల్: మాలేగావ్ పేలుడు కేసులో నిర్దోషిగా విడుదలైన బీజేపీ మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ ఆదివారం భోపాల్ చేరుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ 2008 మాలేగావ్ పేలుళ్ల అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కుట్రగా అభివర్ణించారు. పార్టీ ఓటు బ్యాంకును సంతృప్తి పరచడానికి, ఈ కేసులో బీజేపీని ఇరికించడానికి కాంగ్రెస్ పార్టీ తీవ్ర ప్రయత్నాలు చేసిందని ఆరోపించారు. ఈ కేసును దేశద్రోహం కింద విచారించాలని డిమాండ్ చేశారు. ఆనాటి పేలుళ్లకు బీజేపీని కారణంగా చూపాలని ప్రయత్నాలు చేసిన వారికి కోర్టు తీర్పు చెంపపెట్టు లాంటిదని అన్నారు. కాంగ్రెస్ మతతత్వ రాజకీయాలు చేస్తోందని, ఆ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఉద్దేశపూర్వకంగా తప్పుడు కేసుల్లో ఇరికించి... జైళ్లలో హింసించేవారని ఆరోపించారు.

అత్యాచార బాధితురాలిపై కాల్పులు

న్యూఢిల్లీ: అత్యాచారం కేసులో జైలుపాలైన ఓ యువకుడు బెయిల్‌పై బయటకు వచ్చి బాధితురాలిని చంపేందుకు ప్రయత్నించాడు. స్నేహితుడితో కలిసి పథకం వేసి... తుపాకీతో కాల్పులు జరిపాడు. బుల్లెట్ గాయాలతో బాధితురాలు ఆసుపత్రిలో చేరగా... నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఢిల్లీలో ఓ సెలూన్ హెడ్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఓ మహిళ తనపై అత్యాచారం చేశాడంటూ అబుజైర్ సఫీ అనే యువకుడిపై గతేడాది పోలీస్ కేసు పెట్టింది. దీంతో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. ఇటీవల కోర్టు బెయిల్ ఇవ్వడంతో సఫీ బయటకు వచ్చాడు. తనపై కేసు పెట్టిన మహిళను అంతమొందించేందుకు మరో స్నేహితుడు అమన్ శుక్లాతో కలిసి పథకం వేశాడు. రాత్రివేళ ఆటోలో వెళుతున్న మహిళను స్నేహితులిద్దరూ బైక్‌పై వెంబడించారు. వసంత్ విహార్ ఏరియాలో మహిళపై కాల్పులు జరిపి పారిపోయారు. మహిళ ఛాతీలోకి బుల్లెట్ దూసుకెళ్లడంతో... ఆటో డ్రైవర్ బాధితురాలిని ఆసుపత్రిలో చేర్పించాడు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదుతో అబుజైర్ సఫీ, అమన్ శుక్లాను పోలీసులు అరెస్టు చేసి హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

ఆపరేషన్ అఖల్... ఆరుగురు ఉగ్రవాదుల హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో ఉగ్రవాదులను అంతమొందించేందుకు భద్రతా దళాలు చేపట్టిన ఆపరేషన్ అఖల్ ఆదివారం మూడో రోజుకు చేరింది. ఈ ఆపరేషన్‌లో ఇప్పటివరకు ఆరుగురు ముష్కరులు హతమయ్యారు. ఓ జవాన్ గాయపడ్డారు. కుల్గాం జిల్లాలోని అఖల్ అటవీ ప్రాంతంలో టెర్రరిస్టులు ఉన్నారన్న సమాచారంతో భద్రతా బలగాలు, స్థానిక పోలీసులు శుక్రవారం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో ఉగ్రవాదులు, భద్రతా దళాలకు మధ్య శనివారం రోజంతా కాల్పులు కొనసాగాయి. ఈ సందర్భంగా ముగ్గురు ఉగ్రవాదులను భద్రతాదళాలు మట్టుబెట్టాయి. మరోవైపు ముష్కరుల కాల్పుల్లో సీఆర్‌పీఎఫ్ జవాన్ గాయపడ్డారు. మృతిచెందిన ఉగ్రవాదులు నిషేధిత లష్కరే తోయిబా అనుబంధ సంస్థ అయిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్‌కు చెందినవారని అధికారులు తెలిపారు.

అసహజ మరణాల రికార్డులు మాయం

- వెలుగులోకి ధర్మస్థల అకృత్యాలు
- ఆర్‌టీఐ ద్వారా కొత్త విషయాలు బహిర్గతం

బెంగళూరు: ధర్మస్థల అకృత్యాలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. తాజాగా మరో సంచలన ఘటన చోటుచేసుకుంది. ధర్మస్థలలో దాదాపు 15 ఏళ్లలో చోటు చేసుకున్న అసహజ మరణాలకు సంబంధించిన రికార్డులన్నీ మాయమయ్యాయి. ఈ విషయం ఆర్టీఐ చట్టం ద్వారా బహిర్గతమైంది. 2000 నుంచి 2015 మధ్య బెళ్తంగడి పోలీస్ స్టేషన్‌లో అదృశ్యమైన మహిళలు, యువతులు, బాలికలకు చెందిన రికార్డులన్నీ గల్లంతయ్యాయి. ఈ మేరకు ఆర్టీఐ కార్యకర్త జయంత్ ఆదివారం వెల్లడించారు. ఇదే సమయంలో అనుమానాస్పద మరణాలపై ఎన్నో ఆరోపణలు వెల్లువెత్తాయని ఆయన గుర్తు చేశారు. అయితే తాను వందకు పైగా మహిళలు, యువతుల మృతదేహాలను పూడ్చిపెట్టానంటూ ఒక పారిశుద్ధ్య కార్మికుడు ప్రకటించిన వేళ... పోలీస్ స్టేషన్‌లో రికార్డులు మాయం కావడం సంచలనం సృష్టిస్తోంది. అదీకాకుండా ఈ రికార్డులన్నీ క్రమ పద్ధతిలో మాయం చేసినట్లు ఆర్టీఐ దరఖాస్తు ద్వారా వెల్లడైందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై విచారణ జరుపుతున్న ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్)కు ఫిర్యాదు చేసినట్లు జయంత్ వివరించారు. ఒక యువతి మృతదేహాన్ని అక్రమంగా పాతపెట్టడం తాను చూశానని, అధికారులు సైతం అక్కడే ఉన్నారని పేర్కొన్నారు. ఈ మృతదేహాన్ని సిట్ అధికారులు వెలికి తీయాల్సి ఉంది. అయితే యువతుల గల్లంతుపై పోలీసుల పనితీరు తెలుసుకోవడానికి చాలాకాలంగా ఆర్టీఐని ఆశ్రయిస్తున్నారు. ఆచూకీ గల్లంతైన వ్యక్తులు, వారి ఫొటోలను తాను చాలాకాలం క్రితమే బెళ్తంగడి పోలీసులను అడిగినట్లు చెప్పారు. కానీ తమ వద్ద నుంచి ఫొటోలు, వాల్ పోస్టర్లు, పోస్టుమార్టం నివేదికలు అన్నింటినీ పోలీసులు పథకం ప్రకారం నాశనం చేశారని వివరించారు. దీనిపై శనివారం సిట్ అధికారులకు ఫిర్యాదు చేశానన్నారు. గతంలో యువతి మృతదేహం పోలీసులకు లభించిందని గుర్తు చేశారు. కానీ ఆ మృతదేహాన్ని అత్యంత దారుణంగా పాతిపెట్టారని చెప్పారు. ఇప్పుడు ఆ మృతదేహాలకు సంబంధించిన అవశేషాలు లభించినా... వాటిని వేటితో సరి పోల్చుతారని ఆర్టీఐ కార్యకర్త జయంత్ సందేహ వ్యక్తం చేశారు. ఈ వ్యవహారం వెనుక ఎవరు ఉన్నారంటూ సందేహం వెలిబుచ్చారు. దీనిపై ఇంతగా ఎవరు ప్రభావం చూపించారని ప్రశ్నించారు. ఈ రికార్డులను కంప్యూటర్ బ్యాక్ అప్ ద్వారా వెనక్కి తీయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. దేనికి ఆధారం లేకుండా నాశనం చేశామంటే... ఎలా నమ్మాలి. దీనిపై క్షుణ్ణంగా దర్యాపు జరపాలన్నారు. మరోవైపు తన వెనుక ఎవరూ లేరని ఆర్టీఐ కమిషనర్ కుండ బద్దలు కొట్టారు. ఈ అంశం తనపై తీవ్ర ప్రభావం చూపిందన్నారు. అందుకే వీటిని తేల్చాలని తాను నిర్ణయించుకున్నానని ఆయన స్పష్టం చేశారు.

ముంచెత్తిన వరదలు

పొంగిపొర్లుతున్న గంగా, యమున

వారణాసి-ప్రయాగ్‌రాజ్ అతలాకుతలం

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో కురిసిన భారీ వర్షాలు రాష్ట్రాన్ని అతలాకుతలం చేశాయి. ముఖ్యంగా వారణాసి, ప్రయాగ్‌రాజ్ వరదల తీవ్రతకు చిగురుటాకుల్లా వణుకుతున్నాయి. గంగా, యమునా నదులు ఉప్పొంగి పొర్లుతూ తీరప్రాంతాల్లోని జనజీవితాన్ని ముంచెత్తుతున్నాయి. రహదారులు జలమయమై, ఇళ్లలోకి నీరు ప్రవేశించి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. రక్షణ బృందాలు, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది పునరావాస పనుల్లో నిమగ్నమయ్యారు. నదుల ఉధృతి తగ్గకపోతే పరిస్థితి మరింత విషమించవచ్చని అధికారులు హెచ్చరించారు. వారణాసిలో గంగా నది ప్రమాద స్థాయిని దాటి అనేక ప్రాంతాల్లోకి నీరు చొచ్చుకొచ్చింది. ప్రయాగ్‌రాజ్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. నదీ జలాలు పెరిగి, నగరంలోని పలు ప్రాంతాలు నీటిలో మునిగాయి. రోడ్లన్నీ నీటితో నిండిపోవడంతో ప్రజలు పడవల్లో ప్రయాణిస్తూ ఇళ్లు, ఆఫీసులకు వెళుతున్నారు. రోడ్డు మీద కారు కాదు, పడవల్లో వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రయాగ్‌రాజ్‌లోని కరేలా బాగ్ ప్రాంతంలో ఉదయం 8 గంటల నుంచే నీరు నిలిచిపోయింది. ససూర్ ఖదేరీ నది ఉప్పొంగడంతో ఈ పరిస్థితి వచ్చిందని స్థానికులు తెలిపారు. వర్షం కూడా కురుస్తోందని, చాలా ఇబ్బందిగా ఉందన్నారు. ఉత్తరప్రదేశ్ మంత్రి స్వతంత్ర దేవ్ సింగ్ ఆదివారం హమీర్‌పూర్‌లో వరద ప్రభావిత ప్రాంతాలను హెలికాప్టర్ ద్వారా పరిశీలించారు. వరదల వల్ల ఇళ్లు కోల్పోయిన వారి కోసం చేసిన ఏర్పాట్లను సమీక్షించారు. పరిస్థితిని ప్రభుత్వం నిశితంగా గమనిస్తోందని తెలిపారు.

స్పైస్ జెట్ సిబ్బందిపై ఆర్మీ అధికారి దాడి

న్యూఢిల్లీ: పరిమితికి మించి లగేజీని విమానంలోకి తీసుకెళ్లేందుకు ఆర్మీ అధికారి ప్రయత్నించాడు. స్పైస్ జెట్ సిబ్బంది ఆయనను అడ్డుకున్నారు. దీంతో ఆ ఆర్మీ అధికారి కోపోద్రిక్తుడై నలుగురు స్పైస్ జెట్ సిబ్బందిని దారుణంగా కొట్టాడు. ఒక ఉద్యోగి నేలపై పడి స్పృహ కోల్పోయినప్పటికీ కొట్టడం ఆపలేదు. వివరాల్లోకి వెళితే... గత నెల 26న శ్రీనగర్ నుంచి ఢిల్లీకి వెళ్లే స్పైస్ జెట్ విమానంలోకి ఎక్కేందుకు ఆర్మీ అధికారి ప్రయత్నించాడు. ఆయన వద్ద 16 కిలోల బరువున్న రెండు క్యాబిన్ బ్యాగులున్నాయి. కాగా, ఏడు కిలోల పరిమితి కంటే రెట్టింపు లగేజీ ఉండటంతో అదనపు లగేజీకి చార్జ్ చెల్లించాలని స్పైస్ జెట్ సిబ్బంది కోరారు. ఆ ఆర్మీ అధికారి దీనికి నిరాకరించాడు. అలాగే భద్రతా ప్రోటోకాల్‌ను ఉల్లంఘించాడు. బోర్డింగ్ ప్రక్రియ పూర్తి చేయకుండా ఏరోబ్రిడ్జిలోకి ప్రవేశించడానికి ప్రయత్నించాడు. దీంతో సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది ఆ ఆర్మీ అధికారిని గేట్ వద్దకు పంపారు. మరోవైపు గేట్ వద్దకు చేరుకున్న ఆర్మీ అధికారి హింసాత్మకంగా ప్రవర్తించాడు. అక్కడున్న క్యూ స్టాండ్‌తో స్పైస్ జెట్ గ్రౌండ్ స్టాఫ్‌పై దాడి చేశాడు. ఒక ఉద్యోగి నేలపై పడి స్పృహ కోల్పోయినప్పటికీ కొట్టడం ఆపలేదు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో ముగ్గురు స్పైస్ జెట్ సిబ్బందిపైనా దాడి చేశాడు.

దాడిలో నలుగురు సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారని, ఒకరికి వెన్నెముక విరిగిందని స్పైస్ జెట్ తెలిపింది. చివరకు ఆ ఆర్మీ అధికారిని సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది నిలువరించారని పేర్కొంది. ఈ సంఘటనపై పోలీసులకు స్పైస్ జెట్ ఫిర్యాదు చేసింది.

దీంతో ఆ ఆర్మీ అధికారిపై హత్యాయత్నంతో సహ పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఇదిలా ఉండగా... ఆర్మీ కూడా ఈ సంఘటనపై స్పందించింది. దర్యాప్తులో పోలీసులకు సహకరిస్తామని వెల్లడించింది. మరోవైపు స్పైస్ జెట్ సిబ్బందిపై ఆర్మీ అధికారి హింసాత్మకంగా దాడి చేసిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది.

కాలువలోకి దూసుకెళ్లిన కారు

11 మంది దుర్మరణం



లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని గోండా జిల్లాలో జరిగిన హృదయవిదారక ప్రమాదం అందరినీ కలచివేసింది. పృథ్వీనాథ్ ఆలయాన్ని సందర్శించేందుకు బొలెరో కారులో బయలుదేరిన 15 మంది ప్రయాణికులు... ఊహించని విధంగా ఘోర దుర్ఘటనకు గురయ్యారు. భారీ వర్షాల మధ్య, ఇటియాథోక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బెల్వా బహుతా రెహ్రా మోడ్ సమీపంలో కారు అదుపు తప్పి సరయు కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘోర ప్రమాదంలో 11 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మృతులు మోతీగంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిహాగావ్ నివాసితులు. వీరిలో ఐదుగురు మహిళలు, ఆరుగురు పురుషులు ఉన్నారు. బీనా (35), కాజల్ (22), మహెక్ (12), దుర్గేష్, నందిని, అంకిత్, శుభ్, సంజు వర్మ, అంజు, సౌమ్య ప్రమాదంలో మరణించారు. ఎక్కువ మంది ఒకే కుటుంబానికి చెందినవారు కావడం ఈ దుర్ఘటనను మరింత విషాదకరంగా మార్చింది. డ్రైవర్ మాత్రం ప్రాణాలతో బయటపడ్డాడు. స్థానికులు చెప్పిన ప్రకారం... కారు డోరు తెరుచుకోక పోవడంతో ప్రయాణికులు బయటకు రాలేకపోయారు. లోపల ఉన్నవారు ప్రాణాల కోసం వేడుకున్నా... కారు అద్దాలు పగలగొట్టి కొందరిని రక్షించే ప్రయత్నం జరిగినప్పటికీ... చాలామందిని కాపాడలేకపోయారు. ఈ ఘటన స్థానికులను తీవ్ర ఆవేదనకు గురిచేసింది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ ఘటన గురించి తెలుసుకుని, మృతుల కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం ఇవ్వాలని ఆదేశించారు. గాయపడిన వారిని వెంటనే ఆసుపత్రికి తరలించి, సరైన వైద్య సహాయం అందించాలని జిల్లా అధికారులకు సూచించారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

బీజేపీ అవినీతి బహిర్గతం: అఖిలేశ్

లక్నో: బీజేపీ ప్రభుత్వ స్మార్ట్ సిటీ మిషన్ పూర్తిగా విఫలమైందని సమాజ్‌వాదీ పార్టీ అధినేత, యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ విమర్శించారు. భారీ వర్షాలతో వారణాసి, ప్రయాగ్‌రాజ్ జలమయం కావడంతో ఆయన ఆదివారం ఎక్స్ మాధ్యమంగా బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. పట్టణాభివృద్ధి నెపంతో స్మార్ట్ సిటీ మిషన్ చేపట్టారు కానీ తమ అవినీతితో దాని ఉద్దేశాన్ని నీరుగార్చారని దుయ్యబట్టారు. ప్రయాగ్‌రాజ్‌లో రూ.20 కోట్లు ఖర్చు చేశారు కానీ ఈ ప్రాంత వాసులు నీటమునిగారు తప్ప ఎలాంటి ప్రయోజనం పొందలేదన్నారు. వర్షపు నీటితో నిండిన 'అవినీతి' గుంతలతో బీజేపీ కుంభకోణాలు, మోసాలు, చీకటి ఒప్పందాలు బహిర్గతమయ్యాయని వ్యాఖ్యానించారు. స్మార్ట్ సిటీ ఉద్దేశాన్ని నీరుగార్చిన బీజేపీ వారు ఎక్కడ? ఎవరికి వారు తమ పడవుల్లో తప్పించుకున్నారా? అంటూ అఖిలేశ్ ప్రశ్నించారు.

ఉపరాష్ట్రపతి పదవి ఎన్డీయేకే: థరూర్

న్యూఢిల్లీ: జగదీప్ ధన్కర్ రాజీనామాతో ఉప రాష్ట్రపతి ఎన్నిక అనివార్యమైంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ విడుదలైంది. దీంతో తదుపరి ఉప రాష్ట్రపతి ఎవరనే అంశంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. కొంతమంది పేర్లు సైతం వినపడుతున్నాయి. సంఖ్యాపరంగా బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే నామినేటెడ్ అభ్యర్థికే విజయావకాశాలు బలంగా ఉన్నాయని, అయితే ఈ ప్రక్రియలో విపక్షాలను అధికార పార్టీ సంప్రదించే అవకాశాలు ఉండొచ్చని వినిపిస్తోంది. దీనిపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్‌ను మీడియా ఆదివారం ప్రశ్నించగా... ఫలితం అందరికీ తెలిసినదేనని, ఎన్డీయేకే అనుకూలంగా ఫలితం రావచ్చని సమాధానమిచ్చారు. 'అధికార పార్టీ నామినేట్ చేసిన వ్యక్తికే ఉప రాష్ట్రపతి పదవి దక్కుతుందని అందరికీ తెలిసిన విషయమే. సభ్యుల లెక్కలు మనకు తెలిసినవే' అని ఆయన అన్నారు. విపక్షాలను సంప్రదించే అవకాశాలపై అడిగినప్పుడు... అదెవరు చెప్పగలరు? సంప్రదిస్తారనే ఆశిస్తున్నామని చెప్పారు. శశథరూర్ కాంగ్రెస్ పార్టీకి దూరమవుతూ బీజేపీకి దగ్గరవుతున్నారనే ప్రచారం కొద్దికాలంగా జరుగుతోంది. అందుకు బలం చేకూర్చే ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. పహల్గాం ఉగ్రదాడిని ప్రపంచదేశాల్లో ఎండగట్టేందుకు అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని పంపాలని మోదీ ప్రభుత్వం అనుకున్నప్పుడు శశిథరూర్‌ను కేంద్రం ఎంపిక చేసింది. పార్టీని సంప్రదించకుండా శశిథరూర్‌ను ఎంపిక చేయడంపై కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. శశిథరూర్ సైతం అమెరికా పర్యటనలోనూ, ఇతర దేశాల్లో పర్యటన జరిపిన సమయాల్లోనూ మోదీ సమర్థతను ప్రశంసించారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు శశిథరూర్ అంతర్జాతీయ దౌత్యవేత్తగా, కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. అయితే, గత వారంలో ఆపరేషన్ సిందూర్‌పై పార్లమెంటులో చర్చ జరిగినప్పుడు కాంగ్రెస్ తరపు వక్తగా శశధరూర్‌ను పార్టీ దూరంగా ఉంచింది. కాగా, ఉపరాష్ట్రపతి ఎన్నిక రాష్ట్రపతి ఎన్నికలా ఉండదని, రాష్ట్రపతి ఎన్నిక ప్రక్రియలో రాష్ట్ర అసెంబ్లీలు కూడా పాల్గొంటాయని, ఉపరాష్ట్రపతిని మాత్రం కేవలం పార్లమెంటు సభ్యులే ఎన్నుకుంటారని శశిథరూర్ వివరించారు.

అర్బన్ నక్సల్స్‌లా వ్యవహరిస్తే అరెస్టే...

ప్రత్యేక ప్రజా భద్రతా బిల్లుపై ఫడ్నవీస్

నాగపూర్ : ప్రత్యేక ప్రజా భద్రతా బిల్లు... ప్రభుత్వాన్ని విమర్శించే వారిపై చర్యలు తీసుకోవడానికి కాదని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ స్పష్టం చేశారు. కానీ అర్బన్ నక్సల్స్ లాగా వ్యవహరించే వారిని దాని కింద అరెస్టు చేస్తామని హెచ్చరించారు. అర్బన్ నక్సలిజం, 'నిష్క్రియాత్మక తీవ్రవాదం' పై దృష్టి సారించి వామపక్ష తీవ్రవాద సంస్థల చట్టవిరుద్ధ కార్యకలాపాలను నిరోధించడానికి ప్రయత్నిస్తున్న మహారాష్ట్ర ప్రత్యేక ప్రజా భద్రతా బిల్లు-2024, రాష్ట్ర శాసనసభ ఇటీవలి వర్షాకాల సమావేశాల్లో ఆమోదం పొందింది. దోషులుగా తేలిన వారికి భారీ జరిమానాలు, ఏడు సంవత్సరాల వరకు జైలు శిక్షతో సహా కఠినమైన నిబంధనలతో కూడిన ఈ బిల్లు జాతీయ భద్రత సాకుతో అసమ్మతిని అణిచివేసే సాధనంగా భావించే పౌర సమాజ సంఘాలు, ప్రతిపక్ష పార్టీల నుంచి విమర్శలను రేకెత్తించింది. శనివారం ఇక్కడ విలేకరులతో ఫడ్నవీస్ మాట్లాడుతూ ఈ చట్టం ప్రదర్శనకారులకు లేదా ప్రభుత్వాన్ని విమర్శించే వారికి వ్యతిరేకం కాదని అన్నారు. 'మీరు అర్బన్ నక్సల్ లాగా ప్రవర్తిస్తే, మిమ్మల్ని అరెస్టు చేస్తారు' అని ఎంఎన్‌ఎస్ అధ్యక్షుడు రాజ్ థాకరే కొత్తగా ఆమోదించబడిన చట్టం ప్రకారం తన పార్టీ కార్యకర్తలను అరెస్టు చేయాలని ముఖ్యమంత్రికి సవాలు విసిరిన విషయం గురించి అడిగినప్పుడు అన్నారు. బయటి నుంచి వచ్చే వారికి మరాఠీ కాకుండా చిన్న పిల్లలకు బలవంతంగా హిందీ నేర్పించాలని ముఖ్యమంత్రి కోరుకుంటున్నారని రాజ్ థాకరే చేసిన ఆరోపణపై, ఫడ్నవీస్ మహారాష్ట్రలో మరాఠీ తప్పనిసరి అని, అయితే దానితో పాటు అదనంగా మరో భారతీయ భాషను నేర్చుకోవాలని తెలిపారు. 'భారతీయ భాషకు బదులుగా ఇంగ్లీషుకు రెడ్ కార్పెట్ పరచడాన్ని నేను వ్యతిరేకిస్తున్నాను' అని అన్నారు.

కాలిఫోర్నియా కూడా మునిగిపోతుంది

భారీ వర్షాలపై హర్యానా సీఎం సైనీ

చండీగఢ్: భారీ వర్షాల కారణంగా హర్యానాలోని 'మిలియన్ సిటీ' గురుగ్రామ్ జలమయమైంది. ఈ వరద దృశ్యాలకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ అయ్యాయి. దీనిపై తాజాగా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ కీలక వ్యాఖ్యలు చేశారు. వరదలు వస్తే ఏ నగరమైనా మునిగిపోతుందని, అమెరికాలోని కాలిఫోర్నియా నగరం మునిగిపోయినా ఆశ్చర్యం లేదన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. 'శక్తిమంతమైన దేశంగా చెప్పుకునే అమెరికాలోని కాలిఫోర్నియా నగరం కూడా భారీ వర్షాల కారణంగా మునిగిపోతుంది. ప్రకృతిని ఎదుర్కోవడం ఎవరికీ సాధ్యం కాదు. భారీ వర్షాలు నష్టాన్ని కలిగిస్తాయి' అని సీఎం పేర్కొన్నారు. వరదలను ఎదుర్కొనేందుకు రక్షణ వ్యవస్థను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని ఆయన అంగీకరించారు. గురుగ్రామ్ అభివృద్ధి చెందుతున్న నగరమని తెలిపారు. భారీ వర్షాలను ఎదుర్కొనేలా వ్యవస్థలను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. కుండపోత వర్షాల కారణంగా గురుగ్రామ్‌లోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. జలమయమైన రోడ్లపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మరికొన్ని ప్రాంతాల్లో వాహనాలు నీటిలో తేలియాడాయి. జలమయమైన ప్రాంతాలకు సంబంధించిన వీడియోలను పలువురు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసి... ప్రభుత్వంపై విమర్శలు చేశారు. వీటికి సంబంధించిన మీమ్స్ కూడా నెట్టింట వైరలయ్యాయి.

తమిళనాట పెరిగిన 6.5 లక్షల ఓట్లు

చిదంబరం

న్యూఢిల్లీ: రాజకీయంగా తీవ్ర దుమారం రేపిన బీహార్‌లో ఎన్నికల సంఘం నిర్వహించిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం కీలక వ్యాఖ్యలు చేశారు. తమిళనాడులో 6.5 లక్షల మంది ఓటర్లు పెరిగారని తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. 'ఎస్ఐఆర్ ప్రక్రియ మరింత ఆసక్తికరంగా మారుతోంది. బీహార్‌లో 65 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కు కోల్పోయే ప్రమాదంలో ఉండగా... తమిళనాడులో మాత్రం 6.5 లక్షల మంది ఓటర్లు పెరిగారు. ఇది ఆందోళనకరమైన చర్య. చట్టవిరుద్ధమైనది' అని చిదంబరం పేర్కొన్నారు. పెరిగిన ఓటర్లను శాశ్వత వలస కార్మికులు అని పిలిస్తే అసలైన వలస కార్మికులను అవమానించినట్లు అవుతుందన్నారు. తమిళనాడు ఓటర్లు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకునే అవకాశం లేకుండా చేసేందుకు ఓట్ల పెంపుదల జరిగిందని మండిపడ్డారు. ఎన్నికల సంఘం తన అధికారాలను దుర్వినియోగం చేస్తోందని చిదంబరం ఆరోపించారు.

రాష్ట్రాల ఎన్నికల విధానాలు మార్చేందుకు ఈసీ ప్రయత్నిస్తోందని విరుచుకుపడ్డారు. ఈ అధికార దుర్వినియోగాన్ని రాజకీయంగా, చట్టబద్ధంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. చిదంబరం తన పోస్టుకు తమిళనాడు ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ట్యాగ్ చేశారు. తమిళనాడు ఓటరు జాబితాలో వలస కార్మికులను చేర్చడంపై అధికార డీఎంకేతో పాటు ప్రాంతీయ పార్టీలు కూడా ఆందోళన వ్యక్తం చేశాయి.

78 మంది విద్యార్థులకు రేబిస్ టీకా

రాయ్‌పూర్: చత్తీస్‌గఢ్‌లోని బలోదబజార్ జిల్లాలో వీధి కుక్క కలుషితం చేసిన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు వడ్డించడంతో 78 మందికి రేబిస్ టీకా వేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే గత నెల 29న లాచాన్‌పూర్ గ్రామంలోని ప్రభుత్వ మిడిల్ స్కూల్‌లో విద్యార్థుల కోసం వండిన ఆహారాన్ని కుక్క ముట్టుకుంది. దీనిని గమనించిన విద్యార్థులు ఈ విషయాన్ని ఉపాధ్యాయులకు చెప్పినప్పటికీ, వారు పట్టించుకోలేదు. దీనికితోడు ఆహారాన్ని వండిన స్వయం సహాయక బృందం(ఎస్‌హెచ్‌జీ) ఈ ఆహారమేమీ కలుషితం కాలేదంటూ విద్యార్థులకు వడ్డించింది. అయితే ఈ ఘటన వెలుగులోకి రావడంతో అప్రమత్తమైన ఎస్‌హెచ్‌జీ ఆ రోజు మధ్యాహ్న భోజనం చేసిన 78 మంది విద్యార్థులకు యాంటీ రాబీస్ టీకాలు ఇప్పించింది. ఈ ఘటన తరువాత విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు పాఠశాల నిర్వహణ కమిటీని నిలదీశారు. ఎస్‌హెచ్‌జీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఆ కమిటీని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టేందుకు ఉప-డివిజనల్ మేజిస్ట్రేట్ దీపక్ నికుంజ్, బ్లాక్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ నరేష్ వర్మ, ఇతర అధికారులు ఘటన జరిగిన పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అయితే ఎస్‌హెచ్‌జీ సభ్యులు అధికారుల దర్యాప్తులో పాల్గొనలేదు. ఈ ఘటనపై స్థానిక ఎమ్మెల్యే సందీప్ సాహు ముఖ్యమంత్రి విష్ణు డియో సాయికి లేఖ రాశారు. ఈ ఉదంతంపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

లోయలో పడిన కారు... ఇద్దరి మృతి

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని కథువా జిల్లా లఖన్‌పూర్-బసంత్‌పూర్ మార్గంలో కారు అదుపుతప్పి లోయలో పడింది. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం కాగా... ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారని పోలీసులు తెలిపారు. ఐదుగురు ప్రయాణికులు పంజాబ్ నుంచి అమర్‌నాథ్‌యాత్ర కోసం పనిచేసే కమ్యూనిటీ కిచెన్ సభ్యులుగా పేర్కొన్నారు. జమ్మూ-శ్రీనగర్ జాతీయ రహదారి వెంబడి చందర్‌కోట్‌లోని క్యాంప్‌సైట్‌కు వెళుతుండగా కథువా సమీపంలో ఆదివారం తెల్లవారుజామున కారు లోయలోపడినట్లు అధికారులు తెలిపారు.

సహాయక చర్యలు చేపట్టి ఐదుగురిని ఆసుపత్రికి తరలించారని అన్నారు. మెహిందర్ పాల్ (60), పవన్ మధన్ (50) ఆసుపత్రికి చేరుకునే లోపే మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం పంపించారు.

విశాలాంధ్ర హైదరాబాద్

కాలుష్య నియంత్రణ మండలి పూర్తి కాలపు చైర్మన్‌ను నియమించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలికి పూర్తి కాలపు చైర్మన్ నియామకము కొరకు తగు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టిజిపిసిబి) సభ్యులు చింపుల సత్యనారాయణ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ప్రస్తుతం మండలి చైర్మన్‌గా రాష్ట్ర ముఖ్య కార్యదర్శి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ముఖ్య కార్యదర్శి రాష్ట్ర పరిపాలనలో అనేక శాఖలకు అధిపతిగా విస్తృతమైన బాధ్యతలను నిర్వర్తిస్తుండటంతో, కాలుష్య నియంత్రణ మండలి విషయాలపై సమగ్రమైన దృష్టి పెట్టుటకు సమయం లభించుటలేదని, అదే విధంగా, చట్ట ప్రకారం మూడు నెలలకు ఒకసారి జరగవలసిన మండలి సమావేశాలు, ఆరు నెలలకు ఒకసారైనా సక్రమంగా నిర్వహించబడటం లేదు. నిర్వహించిన సందర్భంలో కూడా ఫిర్యాదులు, అనుమతులు, సమస్యల పరిష్కారం వంటి ముఖ్య అంశాలపై సమగ్ర చర్చలు జరగకుండా, తూతూ మంత్రంగా కేవలం సమావేశం పూర్తయినట్లు చూపించడానికి మాత్రమే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరిస్థితుల వలన మండలి దినసరి పరిపాలనలో, కాలుష్య నివారణ చర్యలలో తగిన ఫలితాలు కనిపించడం లేదు. రాష్ట్ర ముఖ్య కార్యదర్శి రాష్ట్ర వ్యాప్తంగా పలు అత్యవసర కార్యక్రమాలతో బిజీగా ఉండటంతో మండలిలో ప్రత్యేక్షంగా పాల్గొని నిర్ణయాలు తీసుకోవడం తక్కువగానే ఉంటుంది. ఈ కారణంగా కాలుష్య నియంత్రణ మండలి ప్రభావవంతంగా పని చేయలేకపోతున్నట్లు అని అభిప్రాయం వ్యక్తం చేశారు. మండలిలో వెలువడుతున్న అనుమతులు, పిర్యాదులు, ఇతర అంశాలపై సభ్యులకూ కూడా సకాలంలో సమాచారం అందని పరిస్థితి నెలకొంటుందన్నారు. పై విషయాలలను దృష్టిలో ఉంచుకొని, రాష్ట్రంలో పెరుగుతున్న పారిశ్రామిక, నగర, పర్యావరణ కాలుష్య సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి, రోజువారి పని తీరును పర్యవేక్షించగల, సకాలంలో మండలి సమావేశాలను నిర్వహించగల, ఫిర్యాదులు, అనుమతులపై తక్షణ నిర్ణయాలు తీసుకోగల పూర్తి కాలపు చైర్మన్‌ను నియమించవలసిందిగా చింపుల సత్యనారాయణ రెడ్డి కోరారు.

వాకింగ్ ట్రాక్ వెంట లైటింగ్ సిస్టం ఏర్పాటు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని బండ చెరువు వాకింగ్ ట్రాక్ దగ్గర హార్టికల్చర్ విభాగం రూ.30 లక్షలతో ఏర్పాటు చేసిన లైటింగ్ సిస్టంను కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ కాలనీ వాసులతో కలిసి ఆదివారం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉమేష్ సింగ్, బి.కే శ్రీనివాస్, సత్యనారాయణ, సంపత్‌రావు, పెంటయ్య, ప్రభాకర్ గౌడ్, శివరాజ్, తల్వార్, రమేష్, బద్రి నారాయణ, కృష్ణ ప్రసాద్, గోపీనాథ్, హరీష్, సుబ్బారావు, మల్లేశం, బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాంక్వెట్ హాల్ ప్రారంభం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని లింగంపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన నీరుసా బాంక్వెట్ హాల్‌ను కార్పొరేటర్లు హమీద్ పటేల్, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డితో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ పారంభించారు.

విశ్వకర్మలు రాజకీయ చైతన్యంతో ముందుకెళ్లాలి

విశాలాంధ్ర, బషీర్ బాగ్: విశ్వకర్మ కులస్తులు రాజకీయ చైతన్యం తెచ్చుకొని బీసీల రాజ్యాధికారం కోసం ముందుకు వెళ్లాలని బిసి ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ పిలుపునిచ్చారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ అధినేత విశ్వనాథుల పుష్పగిరి 450 కిలోమీటర్ల పాదయాత్ర ముగిసిన సందర్భంగా అభినందన సభ జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన టీ.చిరంజీవులు మాట్లాడుతూ ఒకప్పుడు ఎంతో వైభవోపేతంగా ఉన్న విశ్వకర్మలు ఇతర బీసీ కులాలు యాంత్రికరణ గ్లోబలైజేషన్ ఫలితంగా వృత్తుల ఉపాధి కోల్పోయి ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వకర్మలు ఇప్పటికి ఎంతో మంది ఎమ్మెల్యేలు ఉండాలని, చట్టసభల్లో లేనందునే విశ్వకర్మల అభివృద్ధి అభివృద్ధిలో వెనకబడుతున్నారని అన్నారు. ఒక శాతం జనాభా ఉన్న అగ్రకులాల వద్ద అధిక శాతం సంపద పోగయిందన్నారు. విశ్వకర్మ జాగృతి కోసం పుష్పగిరి చేసిన సుదీర్ఘ పాదయాత్రతో జాతి చైతన్యవంతం అవుతుందన్నారు. రాజకీయ చైతన్యం వచ్చే దిశగా ప్రతి ఒక్కరు వివిధ రూపాల్లో పోరాటాలు చేయాలని ఆయన సూచించారు రాష్ట్రంలో బీసీ ఉద్యమానికి విశ్వకర్మలు ముందుండి పోరాడాలని సూచించారు. అనంతరం విశ్వనాథుల పుష్పగిరి మాట్లాడుతూ తెలంగాణ, రాయలసీమలో విశ్వకర్మల పరిస్థితులు అత్యంత దుర్భరంగా ఉన్నాయని త్వరలో రాజకీయ చైతన్యం రాజకీయ నాయకత్వం పెంపొందించడమే లక్ష్యంగా తన పాదయాత్ర సాగింది అని చెప్పారు. చామకూర రాజు మాట్లాడుతూ బీసీలు సంఘటితంగా రాజకీయ అధికార కోసం అనేక రూపాలలో పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విశ్వనాథుల పుష్పగిరిని చిరంజీవిలతో పాటు సభకు హాజరైన వారందరూ కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కె.వి గౌడ్ బత్తుల సిద్దేశ్వరులు పటేల్, డాక్టర్ అవ్వారువేణు కుమార్, అయిలి వెంకన్న గౌడ్, అంబాల నారాయణ గౌడ్, కొండపల్లి రజిత లక్ష్మణ్, ముత్యాల సదాశివ, రమేష్ యాదవ్ లింగేష్ యాదవ్, సుమంత్, లక్మన్, రజిత, పర్వతం వాని, ఇటికల సదాశివ, శ్రీమాన్, విష్ణు వర్ధన్, కొంగర నరహరి పాల్గొన్నారు.

మెట్రో రైలు మార్గం విస్తరణ పనులు వేగవంతం

ప్రభావిత ఆస్తుల సంఖ్య కుదింపు

పిల్లర్ల మార్కింగ్ ప్రారంభం

రోజువారీగా సమీక్షిస్తున్న మెట్రో ఎండీ ఎన్.వి.ఎస్.రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఎంజీబీఎస్ నుండి చంద్రాయన్ గుట్ట మధ్య మెట్రో రైల్ కారిడార్ ఏర్పాటుకు సంబంధించిన రోడ్ విస్తరణ పనులు వేగవంతం అయ్యాయి. ఏడున్నర కిలోమీటర్ల మార్గంలో అలైన్మెంట్ అద్భుతంగా ఉండేలా చర్యలు చేపట్టామని, ఈ మార్గంలో రోడ్ విస్తరణ వల్ల ప్రభావితం అయ్యే ఆస్తుల సంఖ్యను తగ్గించేలా మార్గాన్ని రూపకల్పన చేశామని హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్.వి.ఎస్.రెడ్డి వెల్లడించారు. మెట్రో పనులకు సంబంధించి ఇంజినీరింగ్, రెవిన్యూ అధికారులతో రోజు వారీ సమీక్షలు నిర్వహిస్తున్నామని అయన అన్నారు. ముందనుకున్న అంచనా ప్రకారం 1100 ఆస్తులు ఈ విస్తరణలో కూల్చవలసి ఉంటుందని భావించామని, కానీ ఎలైన్మెంట్‌ను ఇంజనీరింగ్ నవకల్పన ద్వారా సరిదిద్దటం వల్ల ఆ సంఖ్య 900 వరకు తగ్గిందని ఆయన తెలిపారు. వీటిలో ఇప్పటికే 412 ఆస్తులకు సంబంధించిన అవార్డులు జరీ చేశామని, 380 ఆస్తుల కూల్చివేతలు ఇప్పటివరకు పూర్తయ్యాయని ఆయన వెల్లడించారు. వీటి కోసం . 360 కోట్ల నష్టపరిహారం ప్రభావిత ఆస్తుల వారికి చెల్లించామని అన్నారు. ప్రభావిత ఆస్తులను స్వాధీనం చేసుకుంటూ, కూల్చివేతలు చేసి అవశేషాలను తొలగించడంలో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని, వాటిని అధిగమించి పనులు ముమ్మరంగా చేపడుతున్నామని మెట్రో ఎండీ తెలిపారు. ఇక్కడ ఇళ్లు ఒకదానిని ఒకటి ఆనుకుని ఉండటం వల్ల, పైగా ప్రతి కట్టడానికి సంక్లిష్టమైన విద్యుత్ లైన్లు, ఇతర కేబుళ్లు వ్రేలాడుతూ ఉండడంతో వాటిని చాలా అప్రమత్తంగా తొలగిస్తూ ముందుకు వెళ్తున్నామని అన్నారు. సాధారణ జనజీవనానికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అర్ధరాత్రి సమయాల్లో విస్తరణ పనులు ముమ్మరంగా చేస్తున్నామని ఆయన చెప్పారు. మిగిలిన ఆస్తుల స్వాధీనానికి, త్వరితగతిన కూల్చివేతలు పూర్తి చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్టు ఆయన వెల్లడించారు. మరో వైపు మెట్రో నిర్మాణ పనులు ప్రారంభించడానికి వీలుగా చర్యలు చేపట్టామని మెట్రో ఎండీ తెలిపారు. ఈ కారిడార్‌లో వచ్చే పిల్లర్ల ఏర్పాటుకు తగిన స్థలాలను గుర్తించి వాటిని మార్కింగ్ చేసే పని ప్రారంభం అయిందని ఆయన తెలిపారు. వయాడక్ట్ ను నిలిపే పిల్లర్ల మధ్య 25 మీటర్ల (సుమారు 82 అడుగులు) దూరం ఉంటుందని ఆయన చెప్పారు. మెట్రో స్తంభాలు, స్టేషన్లు వచ్చే చోట భూసామర్థ్య పరీక్షల కోసం ఏజెన్సీని నియమించామని, త్వరలో భూసామర్థ్య పరీక్షలు కూడా చేపడతామని ఆయన వెల్లడించారు. చారిత్రక, ఇతర సున్నిత కట్టడాలకు అంతరాయం కలగకుండా, పిల్లర్ మెట్రో స్టేషన్ల స్థానం నిర్ణయించేందుకు డిజిపిఎస్ సర్వే నిర్వహించామని ఆయన తెలిపారు. నిర్మాణ సమయంలో సర్వే సులభంగా జరిగేలా భూమిపై తాత్కాలిక బెంచ్ మార్క్ (టిబిఎం) లొకేషన్లు నిర్ణయించినట్టు ఆయన స్పష్టం చేశారు. పిల్లర్లు, స్టేషన్లు వచ్చే ప్రాంతాల్లో భూగర్భ మురుగునీటి లైన్లు, మంచినీటి లైన్లు, వరదనీటి డ్రెన్లు, పైన వేలాడే విద్యుత్ లైన్లు తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశానుసారం విద్యుత్ లైన్లను అండర్ గ్రౌండ్ లేబుళ్లుగా మారుస్తామని తెలిపారు. ఇందుకోసం వాటర్ బోర్డు, జీహెచ్ఎంసీ, టీజీఎస్పీడీసీఎల్ విభాగాల నుండి వచ్చే కొద్ది రోజుల్లో అంచనాలు సమర్పించవలసిందిగా కోరామని ఆయన చెప్పారు. ఆయా శాఖల అధికారులతో మెట్రో అధికారులు రేయింబవళ్లు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తూ ముఖ్యమైన యుటిలిటీస్‌ని గుర్తించే పని చేపట్టారని ఎన్.వి.ఎస్.రెడ్డి తెలిపారు.

2025 సైబర్ క్రైం కేసుల్లో 228 మంది అరెస్ట్

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో తమ 7 సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ల ద్వారా 2025 జనవరి 1 నుండి జూలై 31 వరకు సైబర్ నేరాలకు పాల్పడిన 228 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, డైరెక్టర్ శిఖా గోయల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో 27 మంది మహిళా నిందితులు కూడా ఉన్నారని వివరించారు.

ఈ అరెస్టులు తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, ఝార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో జరిగినట్లు వెల్లడించారు. ఈ సంవత్సరం టీజీసీఎస్బి నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్ల ఫలితంగా తెలంగాణలో సైబర్ నేరాలు 13 శాతం తగ్గాయన్నారు. ఈ ఆపరేషన్లలో ఫేక్ కాల్ సెంటర్లు, జాబ్ స్కాములు, బాలలపై ఆన్‌లైన్ దుర్వినియోగం, సైబర్ బానిసత్వాన్ని వంటి కేసులు ఛేదించడం జరిగిందని పేర్కొన్నారు. టీజీసీఎస్బి నిర్వహించిన ముఖ్య ఆపరేషన్లలో హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో ఉన్న పత్రికా నగర్‌లో నకిలీ కాల్ సెంటర్‌ను టీజీసీఎస్బి ఛేదించి, గుజరాత్, ఈశాన్య రాష్ట్రాలకి చెందిన 63 మందిని అరెస్ట్ చేసిందన్నారు. వీరు ఎన్నారైలు, అమెరికా పౌరులను టార్గెట్ చేసి సైబర్ మోసాలు చేశారని నిర్ధారించింది. అలాగే ఇంటర్ స్టేట్ సైబర్ ఫ్రాడ్ ఆపరేషన్‌లలో భాగంగా మే 1 నుండి 10 వరకు సురత్‌లో జరిగిన 10-రోజుల ఆపరేషన్‌లో 20 మంది నిందితులను అరెస్ట్ చేశారు. వీరు తెలంగాణలో 60 కేసులు, దేశవ్యాప్తంగా 515 కేసులకు సంబంధించి నేరాలకు పాల్పడ్డారని వివరించారు. అదే సమయంలో ఆన్‌లైన్ బాలల లైంగిక దుర్వినియోగం వ్యతిరేక ఆపరేషన్‌లలో టీజీసీఎస్బి చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ 57 సైబర్ టిప్‌లైన్ కేసులకు సంబంధించి 15 మందిని అరెస్ట్ చేసింది. వీరు తెలంగాణలో చైల్డ్ సెక్సువల్ ఎక్స్‌ప్లోయిటేటివ్ అండ్ అబ్యూస్ మెటీరియల్ నేరాల్లో పాల్పడ్డారు. 228 మంది నిందితులు మొత్తం 1313 దేశవ్యాప్త కేసులు, 189 తెలంగాణ కేసులకు సంబంధించి రూ.92 కోట్లు మోసం చేసినట్లు టీజీసీఎస్బి వెల్లడించింది. నిందితులు తెలంగాణ (93), నాగాలాండ్ (42), గుజరాత్ (20), ఆంధ్రప్రదేశ్ (17), పశ్చిమ బెంగాల్ (6), ఉత్తరప్రదేశ్ (6), మణిపూర్ (5), అసోం (5), మహారాష్ట్ర (5), ఒడిశా (5), కర్ణాటక (3), బీహార్ (3), మేఘాలయ (2), తమిళనాడు (1), హర్యానా (1), ఝార్ఖండ్ (1), మధ్యప్రదేశ్ (1) ప్రాంతాలకు చెందినవారు. అరెస్టైన వారిలో 66 మంది ఫేక్ కాల్ సెంటర్ నేరాలు, 77 మంది ఇన్వెస్ట్‌మెంట్ మరియు జాబ్ ఫ్రాడ్,15 మంది సీఎస్ ఈఏఎం కేసులు,18 మంది సైబర్ బానిసత్వ నేరాలు, 13 మంది ఆన్‌లైన్ ట్రేడింగ్ ఫ్రాడ్స్, సిం బాక్స్ బాక్స్, డిజిటల్ అరెస్టు, ఐడెంటిటీ థెఫ్ట్, ఇంపర్సనేషన్ వంటి నేరాల్లో పాల్గొన్నారు.

సెరీన్ ఆచార్జ్ ఫామ్ హౌస్‌లో డ్రగ్స్ కలకలం

ఐటీ ఉద్యోగి పుట్టిన రోజు వేడుకల్లో రూ.2 లక్షల విలువ చేసే డ్రగ్స్, మద్యం పట్టివేత

రూ.50 లక్షలు విలువ చేసే మూడు కార్లు స్వాధీనం

ఆరుగురు ఐటీ ఉద్యోగులు, ఫామ్ హౌస నిర్వాహకుడిపై కేసు నమోదు

విశాలాంధ్ర - మొయినాబాద్ : మొయినాబాద్ మండల పరిధిలోని మేడిపల్లి గ్రామ శివారులోని సెరీన్ ఆచార్జ్ ఫామ్ హౌస్ లో డ్రగ్స్ కలకలం రేపింది. పుట్టినరోజు వేడుకల పేరుతో ఫామ్ హౌస్‌ను బుక్ చేసుకొని అందులో డ్రగ్స్ ఖరీదైన మద్యంతో ఆరుగురు ఐటి ఉద్యోగులు పట్టుబడ్డారు. అభిజిత్ బెనర్జీ అనే వ్యక్తి పుట్టినరోజు సందర్భంగా సెరీన్ ఆచార్జ్ ఫామ్ హౌస్ బుక్ చేసుకున్నట్లు తెలిపారు. ఖరీదైన మద్యంతోపాటు 0.5 గ్రామ్ 50 గ్రామ్స్ ఎల్. ఎస్. డి బ్లాస్ట్, 20.21 గ్రాముల హరీష్, ఐదు ఖరీదైన మద్యం బాటిళ్లతో డ్రగ్స్ తీసుకుంటూ మద్యం తాగుతూ ఎంజాయ్ చేస్తున్నారని సమాచారం అందింది. ఈ మేరకు ఎస్ జి ఎఫ్ బి టీం సీఐ బిక్షపతి, ఎస్ఐ బాలరాజు సిబ్బందితో కలిసి ఫామ్ హౌస్ పై దాడి చేశారు. ఈ దాడిలో డ్రగ్స్ ను స్వాధీనం చేసుకొని డ్రగ్స్ కిట్స్‌తో పరీక్షలు నిర్వహించగా అందరికి పాజిటివ్ వచ్చిందని తెలిపారు. వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 50 లక్షల విలువైన మూడు కార్లను, రెండు లక్షల డ్రగ్స్, మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అభిజిత్ బెనర్జీ, సింపుల్ ప్రతాప్, గోయల్ జస్వంత్, దినేష్ వ్యక్తులతో పాటు ఫామ్ హౌస్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. వీరిని చేవెళ్ల ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో అప్పగించడం జరిగిందన్నారు. డ్రగ్స్ పార్టీని ఫామ్ హౌస్ లో విఫలం చేసిన ఎస్ జి ఎఫ్ బి బృందంను ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ షానవాస్ కాసిం అభినందించారు.

శ్రీ చిత్తారమ్మ తల్లి దేవాలయంలో శ్రావణమాస బోనాల పండుగ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపన్‌పల్లి గ్రామంలో గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీ శ్రీ శ్రీ చిత్తారమ్మ తల్లి దేవాలయంలో నిర్వహించిన శ్రావణ మాస బోనాల పూజ కార్యక్రమంలో తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, శేరిలింగంపల్లి కాంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్, ఎంబీసీ చైర్మెన్ జెరిపేటి జైపాల్, సీనియర్ నాయకులు అనిల్ కుమార్ యాదవ్, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారిని పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ని కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి శాలువాతో సత్కరించారు. ఆలయ అర్చకులు వారికి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం దాదాపు మూడు వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ బోనాల ఉత్సవాల సందర్భంగా ప్రతి ఒక్కరికి అమ్మ వారి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటూ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియచేశారు. శ్రావణ మాసంలో బోనాల పండుగను తెలంగాణ ప్రజలు ఎంతో భక్తితో నిర్వహిస్తారని తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ఒక ప్రతీక. అమ్మవారి దీవెనల కోసం బోనమెత్తే ప్రతి ఆడబిడ్డ హిందూ సంస్కృతికి నిజమైన వారసురాలు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి చీడ పీడల నుంచి మమ్మల్ని కాపాడు తల్లి అంటూ భక్తులు గ్రామ దేవతను మొక్కుకుంటూ ఘనంగా నిర్వహించే వేడుక బోనాలు అని అన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. శ్రీశ్రీ చిత్తారమ్మ తల్లి దయతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు.

బోనాల పండుగలో పాల్గొన్న భక్తులకు అయిన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో డివిజన్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని సీనియర్ నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ అధ్యక్షులు, బీజేపీ పార్టీ నాయకులు దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి ఆహ్వానించిన ఈసీఐ

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) ఢిల్లీలోని నిర్వచన్ సాధన్ ప్రధాన కార్యాలయంలో ఆగస్టు 5, మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు దేశంలోని రాజకీయ పార్టీలతో తాను నిర్వహించనున్న సమావేశానికి భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ప్రతినిధి బృందాన్ని అధికారికంగా ఆహ్వానించింది. ఈ ప్రతినిధి బృందానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కె. తారకరామారావు నేతృత్వం వహించనున్నారు. ఆయనతో పాటు పార్టీ కీలక నాయకులు, మాజీ పార్లమెంటు సభ్యులు ఈ బృందంలో ఉండనున్నారు. సమావేశంలో ఎంపీలు కె.ఆర్. సురేశ్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీలు. బోయినపల్లి వినోద్ కుమార్, బల్క సుమన్, బీఆరెస్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, ఈ మేరకు భారత రాష్ట్ర సమితి పార్టీకి, ఈసీఐ కార్యదర్శి అశ్విని కుమార్ మొహాల్ ఒక అధికారిక లేఖలో కోరారు. ఈ ఆహ్వానాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ద్వారా బీఆర్ఎస్ అధ్యక్షులకు కూడా పంపారు. మీడియా వర్గాల సమాచారం ప్రకారం, ఈ సమావేశంలో ఎన్నికల సంస్కరణలు, ఇప్పటికే ఈసీఐకి సమర్పించిన వివిధ అభ్యర్థనలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి సంబంధిత అంశాలపై చర్చ జరిగే అవకాశముంది. పలు రాష్ట్రాల్లో జరుగుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది.

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

విశాలాంధ్ర - మొయినాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామ చందర్ రావు పేర్కొన్నారు. గ్రామ సౌభాగ్యం బీజేపీతోనే సాధ్యం అనే పేరుతో ఇంటికి ఇంటికి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించే కార్యక్రమంలో భాగంగా ఆయన మొయినాబాద్ మండలం శ్రీరామ్‌నగర్ గ్రామంలో ఆదివారం పర్యటించారు. ముందుగా హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో తిరుగుతూ మోడీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. అదే విధంగా ఆరు గ్యారంటీల హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చేపడుతున్నా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం కృషి చేయాలన్నారు. జిల్లా పరిషత్, కార్పొరేషన్, చైర్మన్, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ పదవుల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. గత 11 ఏళ్లలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేద ప్రజల అభ్యున్నతికి పాటు పడిందని వీటిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే రత్నం, జిల్లా ఎన్నికల కన్వీనర్ అందె శ్రీరాములు, అంజన్ కుమార్ గౌడ్, కంజర్ల ప్రకాష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సన్ వెల్లి ప్రభాకర్ రెడ్డి, డాక్టర్ పాపారావు, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, ఓబీసీ జిల్లా కన్వీనర్ వెంకటేష్ గౌడ్, మధుసూదన్ రెడ్డి, బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు చంద్ర శేఖర్ రెడ్డి, శ్రీకాంత్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బోనాల వేడుకల్లో కార్పొరేటర్ రాగం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి డివిజన్ లోగల లింగంపల్లి విలేజ్‌లో బోనాల పండుగను పురస్కరించుకుని శ్రీ పోచమ్మ తల్లి, శ్రీ మహంకాళి తల్లి, శ్రీ నల్ల పోచమ్మ తల్లి ఆలయాల్లో విలేజ్ కమిటీ వారి ఆహ్వానానికి శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరేకపూడి గాంధీ, ఎంబీసీ చైర్మెన్ జెరిపేటి జైపాల్తో కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొన్న శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ పాల్గొన్నారు. కార్పొరేటర్ మాట్లాడుతూ అమ్మవారి కృప ఎల్లప్పుడూ శేరిలింగంపల్లి ప్రజలపై ఉండాలని, ప్రతి ఇంట్లో ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం నిలకడగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. బోనాల వేడుకను, ఫలహారం బండి, తొట్టేల ఊరేగింపుల్లో అందరూ కులమతాలకు అతీతంగా జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి, రాష్ట్ర యువజన నాయకులు రాగం అనిరుధ్ యాదవ్, ఎస్ఎల్ వీడీసీ ప్రెసిడెంట్ గడ్డం రవి యాదవ్, కొయ్యాడ లక్ష్మణ్ యాదవ్, కమిటీ జెనరల్ సెక్రటరీ దేవులపల్లి శ్రీనివాస్, పాశం రాజు, గౌరవ అధ్యక్షులు మేకల కృష్ణ, సోమయ్య యాదవ్, ప్రణయ్ ముదిరాజ్, బుయ్య మల్లేష్ గౌడ్, సుభాష్ రాథోడ్, సూర్య రాథోడ్, పిల్లి అనిల్, రవి, శశి కిరణ్, బ్యాండ్ రాజు, బ్యాండ్ రమేష్, నవీన్ గౌడ్, నరేష్, గోపాల్ యాదవ్, నయీమ్ స్థానికవాసులు పాల్గొన్నారు.

శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయ వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే



విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: శ్రీ ఆంజనేయస్వామి కరుణ కటాక్షాలు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పేర్కొన్నారు. ఆదివారం నియోజకవర్గం 128 - చింతల్ డివిజన్ శ్రీసాయి నగర్ అభయాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ కోరిక కోర్కెలు నెరవేరుస్తూ అభయాన్నిచ్చే దైవం ఆంజనేయ స్వామి అని, అంజనీ పుత్రుడి దయతో ప్రజలంతా ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీసాయి నగర్ కాలనీ వాసులు కర్నెకంటి లక్ష్మణ్, కర్నెకంటి మల్లేష్, కళ్యాణ్ రావు పాటిల్, చిరంజీవి, బాలాజీ, సుబ్రమణ్యం, రమేష్ రెడ్డి, నాయకులు బసవ రాజు, కెపి.వెంకటేష్, శేఖర్‌రావు, వరప్రసాద్, దేగ రాము, సాంబయ్య, మురళీ, శ్రీనివాస్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, పంగరాజు, మెహరున్నిసా బేగం పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా : కూన

విశాలాంధ్ర-దుండిగల్: నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో ఎండమూరి ఎం గ్రీనరీ వెల్ఫేర్ అసోసియేషన్, దేవభూమి నగర్,పిపి నగర్, చిత్తర్మ దేవి నగర్, నిజాంపేట్ పలు కాలనీవాసులు గాజులరామారం నందు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ని మర్యాదపూర్వకంగా కలిసి తమ కాలనిలలో గత కొన్ని సంవత్సరలుగా నెలకొన్న డ్రైనేజీ, రోడ్ల సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ ఎండమూరి ఎం గ్రీనరీ వెల్ఫేర్ అసోసియేషన్, దేవభూమి నగర్, పిపి నగర్, చిత్తర్మ దేవి నగర్, నిజాంపేట్లోని పలు కాలనీవాసుల డ్రైనేజీ, రోడ్ల సమస్యను అతిత్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇంచార్జ్ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ప్రత్యేక చొరువతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయ కాలనీవాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంక్షేమ సంఘాల నాయకులు, మహిళ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సగంలోనే మిగిలిపోయిన సెంటర్ లైటింగ్

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ఖానాపూర్, మేజర్ గ్రామపంచాయతీ నుండి గత ప్రభుత్వ పాలనలో పురపాలక సంఘంగా మారిన తదుపరి, డెవలప్మెంట్ కొరకు రోడ్డు వెడల్పులో భాగంగా సెంటర్ లైటింగ్ కొరకు పురపాలక సంఘం నిధుల నుండి 5 కోట్ల పైచిలుకు మంజూరైనవి ఖానాపూర్ సాయిబాబా మందిరం నుండి మస్కాపూర్ ఏఎంకే ఫంక్షన్ హాల్ వరకు 5 కోట్ల పైచిలుకతో పురపాలక సంఘం నిధుల నుండి పట్టణ డెవలప్మెంట్ కొరకు మంజూరయ్యాయి. సాయిబాబా మందిరం ముందర నుండి జూనియర్ కాలేజీ వరకు రోడ్డు వెడల్పు చేసి సెంటర్ లైటింగ్ స్తంభాలను అమర్చి కాలేజీ ముందర నిలిపివేశారు. ఒక ప్రక్క కబ్రిస్తాన్ ఉండడంతో స్మశాన వాటికలు కబ్రిస్తాన్లో ముట్టారాదు అన్న చట్టం ఉండడంతో రోడ్డు వెడల్పులో భాగంగా సాయిబాబా మందిరం నుండి జూనియర్ కాలేజీ వరకు పనులు కొనసాగిన జూనియర్ కాలేజీ నుండి జామా మసీదు మధ్యలో రోడ్డు వెడల్పులు భాగంగా పనులు నిలిచిపోయాయి. 7 కిలోమీటర్లు వేయవలసిన సెంటర్ లైటింగ్ మూడు కిలోమీటర్ల కి ఆగిపోయిందని, మధ్యలోనే ఆగి పోయినప్పటికీ నిధులు ఏమయ్యాయని స్థానిక మేధావి వర్గాలు వాపోతున్నాయి. అధికారులకు పాలకులకు ఇలాంటి పలు సమస్యలు కనబడుట లేదా, అంతేకాకుండా ఎనిమిదో వార్డులో విద్యుత్ సమస్య మంచినీళ్ల సమస్యలు సమస్యలుగానే మిగిలిపోయాయి వాటిని పరిష్కరించడం లేదు. మేజర్ సమస్యలు కూడా అధికారులకు కనబడుట లేదా అని టిఆర్ఎస్ పార్టీ మాజీ వైస్ చైర్మన్ అబ్దుల్ ఖలీల్, మొహమ్మద్ రహీముద్దీన్ పేర్కొన్నారు.

తూతూ మంత్రంగా సర్వే చేస్తున్న అధికారులు

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ఖానాపూర్ పట్టణంలో 2009లో మేజర్ గ్రామపంచాయతీగా ఉండగా అప్పటి ప్రభుత్వం నిరుపేదలను గుర్తించి 76 ఎకరాల భూములను పట్టేదారుల నుండి కొనుగోలు చేసి సమగ్రస సర్వేలో 400కు పైగా స్థానిక నిరుపేదలను గుర్తించారు. ప్రతి ఒక్క కుటుంబానికి ఒక ప్లాటుగా 40 ఇంటూ 50 సైజు ప్లాటుగా అందివ్వటానికి అంచనాలు పూర్తి చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో మున్సిపాలిటీగా మారగా స్థానికేతర కుటుంబాలైన 40 కుటుంబాలకు పైగా అర్హులను గుర్తించి మిగతా 300 పైచిలుకు ఇండ్లను పర్సెంటేజీల కింద, అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. పక్క జిల్లాల నుండే కాకుండా పక్క రాష్ట్రాలలో నుండి వచ్చిన వలస జీవులకు, డబుల్ బెడ్ రూంలో అర్హులు ఏ విధంగా అవుతారు అని స్థానికేతరులు అంటున్నారు. ఖానాపూర్ పట్టణం డబుల్ బెడ్ రూమ్ లల్లో అవినీతి జరిగింది అంటూ ఆరోపణలు చేస్తూ కొందరు రోడెక్కడంతో పలుమార్లు ఎంక్వయిరీలు జరిగాయి. ప్రస్తుతం జరుగుతున్న ఎంక్వయిరీతో సహా పదిసార్లు డబుల్ బెడ్రూమ్ల ఎంక్వయిరీలు తూతూ మంత్రంగా చేస్తున్నారు. అందులో భాగంగా ఉన్నత వర్గాలకు చెందిన వారు స్థిరాచర ఆస్తులు కలిగి ఉన్న వారి పేర్ల తో సహా ఆధారాలు వున్నప్పటికీ, అధికారుల కంటపడిన చర్యలు తీసుకోకపోవడం శోచనీయంగా మారింది.

ఆరోగ్యం పట్ల ప్రతిఒక్కరూ శ్రద్ధ వహించాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - బషీర్ బాగ్: ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సూచించారు. ఈ మేరకు రైట్కేర్ క్లినిక్ బహుళ ప్రత్యేకతల వైద్య కేంద్రాన్ని హైదరాబాద్ ఆఫీస్పేట్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్తో కలిసి ఆయన మాట్లాడుతూ ప్రస్తుత బిజీ జీవితంలో ఆరోగ్యంగా ఉండటం చాలా అవసరం అన్నారు. ఆరోగ్యం కోసం ప్రజలు అందరూ తగు జాగర్తలు తీసుకోవాలన్నారు.

ప్రజల ఆరోగ్యాభివృద్ధి కోసం రైట్ కేర్ క్లినిక్ లాంటి ఆరోగ్య కేంద్రాల అవసరం ఉందన్నారు. అమెరికాలో ఉన్నా, ఇక్కడి వారి ఆరోగ్యం కోసం ఈ క్లినిక్ ప్రారంభించిన మనోహర్ను అభినందించారు. ప్రజలందరికీ ఆరోగ్య సేవలు అందిస్తూ క్లినిక్ అభివృద్ధి చెందాలన్నారు. కాలనీ వారందరికీ అందుబాటులో ఉంటూ ఆరోగ్య సేవలు అందిస్తూ ఈ క్లినిక్ మంచి పేరు తెచ్చుకుంటుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రజలకు మంచి వైద్య సేవలు అందించే ఆశయంతో మొదలయిన రైట్ కేర్ క్లినిక్లో తాను కూడ సేవలందించే భాగ్యం కలిగినందుకు ఆనందంగా ఉందని డాక్టర్ హేమలత పేర్కొన్నారు. తనతో పాటు అనుభవం ఉన్న డాక్టర్ల సేవలతో ఈ క్లినిక్ పనిచేస్తుందన్నారు. రైట్ కేర్ క్లినిక్లో అందుబాటులో ఉండే సదుపాయాలు డా.సంకీర్త్ వివరించారు. కార్పొరేటర్ జగదీష్ గౌడ్ ప్రారంభోత్సవ వేడుకలో పాల్గొని, ఆరోగ్య పరీక్షలను స్వయంగా పరిశీలించి క్లినిక్ యాజమాన్యానికి, డాక్టర్లకు అభినందనలు తెలిపారు. ఈ క్లినిక్లో పీడియాట్రిక్స్, గైనకాలజీ, ఫిజియోథెరపీ సేవలు లభిస్తాయని క్లినిక్ ప్రతినిధులు తెలిపారు. త్వరలో న్యూరాలజీ, యూరాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, ఈఎన్టీ, డయాబెటాలజీ తదితర విభాగాలను ప్రారంభించి సంపూర్ణ వైద్య సేవల కేంద్రంగా మారనుందన్నారు. వివరాల కోసం రైట్ కేర్ క్లినిక్ ఫోన్ నెంబర్ 91- 4035 789 789ను సంప్రదించాలన్నారు.

బసవేశ్వరుడి బోధనలు అనుసరణీయం

విశాలాంధ్ర - పటాన్ చెరువు : బసవేశ్వరుడి బోధనలు అనుసరణీయమని ఆ మహాత్ముడు చూపిన సన్మార్గంలో వీరశైవులు పయనిస్తూ లోక కళ్యాణం కోసం చేస్తున్న కృషి ప్రశంసనీయమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం పటాన్చెరు వీరశైవ లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో విశ్వశాంతి కోసం పటాన్చెరు ఉమామహేశ్వర దేవాలయం నుంచి బొంతపల్లి వీరభద్రస్వామి దేవాలయానికి నిర్వహిస్తున్న పాదయాత్రకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా విశ్వశాంతికి వీరశైవ లింగాయత్లు గత 18 సంవత్సరాలుగా పాదయాత్రను చేపట్టడం అభినందనీయమన్నారు. సమాజంలో కుల, వర్ణ, లింగ వివక్షతను వ్యతిరేకించి సమ సమాజం కోసం పోరాడిన అభ్యుదయ వాది మహాత్మా బసవేశ్వరునీ అడుగుజాడలలో నడుస్తూ ఆయన బోధించిన ప్రవచనాలను పాటిస్తూ వీరశైవ లింగాయత్లు సమ సమాజ స్థాపనకు కృషి చేస్తున్నారని కొనియాడారు. సమాజ హితం కోసం పాటుపడే వీర శైవ లింగాయత్లకు సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ వీరశైవ లింగాయత్ల అభివృద్ధి కోసం పనిచేస్తుందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే లింగాయత్లను ఓసీ నుంచి బీసీలకు మార్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. భవిష్యత్తులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో లింగాయత్ల అభ్యున్నతికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లింగాయత్ సమాజ్ నాయకులు, పటాన్ చెరువు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, ఐఎన్టీయూసీ జిల్లా ప్రెసిడెంట్ నరసింహారెడ్డి, నాయకులు జలగరి ఎట్టయ్య, పట్లోళ్ల ఆదిత్య రెడ్డి, రవి, దేవరాజ్, సాయి, కార్తీక్ యాదవ్, అశోక్, ప్రవీణ్, అనిల్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 19 నుంచి 22 వరకు

సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - జవహర్ నగర్ : భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర నాలుగవ మహాసభలను ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు నాలుగు రోజులపాటు మేడ్చల్ జిల్లా గాజుల రామారంలో ఘనంగా జరగనున్నాయని మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్ పిలుపునిచ్చారు. మహాసభలకు సంబంధించిన గోడపత్రికను సిపిఐ కాప్రా మండల సమితి ఆధ్వర్యంలో జవహర్ నగర్ లోని దళిత సంక్షేమ భవన్లో ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ వందేళ్ళ ప్రస్థానంలో ముందుకు సాగుతున్న సిపిఐని ప్రజలతో మరింత మమేకం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర మహాసభలు కొనసాగుతాయని ఆయన అన్నారు. గడిచిన మూడేళ్లలో బిజెపి అనుసరిస్తున్న మతోన్మాద ఫాసిస్టు విధానాలను వెలుగులోకి తీసుకురావడంలో కమ్యూనిస్టులు కీలక పాత్ర పోషించారన్నారు. తద్వారా గత సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని 240 సీట్లకు కట్టడి చేయడంలో విజయం సాధించామని వెల్లడించారు. అసంఘటిత కార్మికుల వేతనాల పెంపు కోసం సిపిఐ రాజీ లేని పోరాటాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అయితే అధికార పార్టీతో ఉన్న స్నేహ ధర్మాన్ని పాటిస్తూనే ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు ఉద్యమిస్తామని అన్నారు. ఇక ముందు మరింత పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలకు సన్నద్ధం కానున్న నేపథ్యంలో మహాసభల వేదికగా కార్యాచరణను రూపొందించుకొన్నామని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్ శంకర్రావు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల నరసింహులు సంయుక్తంగా మాట్లాడుతూ అదే విధంగా స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుక వచ్చిన బీసీ బిల్లుకు బిజెపి పెద్ద అడ్డంకిగా మారిందని అని విమర్శించారు. ఒకవైపు బీసీ బిల్లుకు అడ్డు పడుతున్న బిజెపి మరోవైపు రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు మోపుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం పంపిన బీసీ బిల్లును గత నాలుగు నెలలుగా తొక్కి పెట్టడం ఆర్డినెన్స్, విషయంలో ఇదేవిధంగా చేయడం సరికాదన్నారు. ఏఐటియుసి మండల అధ్యక్షులు అంబాల ఎల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి వి స్వరూప నాయక్, మహిళా సమైక్య కాప్రా మండల అధ్యక్షురాలు కోదాసు జయమ్మ, సిపిఐ గిరిప్రసాద్ నగర్ సహాయ కార్యదర్శి కొండ సత్యం, సాగర్, సిపిఐ నాయకులు కోదాసు గంగారం, పి నరసింహ, డి నాగేష్, డి మల్లిక పాల్గొన్నారు.

రెండు ఫ్లోర్లకు అనుమతితో ఐదు అంతస్తుల నిర్మాణం

పార్కింగ్లో హార్డ్వేర్ షాపు,
పైకప్పుపై ఇల్లీగల్ డూప్లెక్స్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి సర్కిల్-20 పరిధిలోని గచ్చిబౌలి డివిజన్లో ఉన్న సాయిరాం కాలనీలో (ఫ్లాట్ నంబరు 59) ఓ బిల్డర్ రెసిడెన్షియల్ అనుమతిని తుడిచిపెట్టేసినట్టే వ్యవహరిస్తున్నాడు. స్టిల్ట్ ప్లస్ రెండు అంతస్తులకు మాత్రమే అనుమతి ఉన్నా, అతడు ఐదు అంతస్తులు కడుతూ చివరగా పైకప్పుపై పెంట్హౌస్ నిర్మించి దానిని విల్లాగా మార్చేశాడు. అంతటితో ఆగక, పార్కింగ్కు కేటాయించిన స్థలాన్ని ఏకంగా నిర్మాణ దశలోనే హోల్ సెల్ హార్డ్వేర్ షాపుగా మార్చి దుకాణం ముందు ఆటోలు, లారీల రాకపోకలతో కాలనీ వాసుల జీవితం నరకంగా తయారైంది. దీంతో కాలనీలో సాయంత్రం వేళలో పిల్లలు సరదాగా బయటికి రావాలన్నా భయభ్రాంతులకు గురవుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఇతడి కట్టడానికి ముందు పక్కలా ఎలాంటి సెట్ బ్యాక్లు లేవు, వెనుక భాగం కూడా ఖాళీ స్థలం లేదు, అక్షరాలా రోడ్డుపైనే నిర్మాణం దూకినట్లుంది.

సెట్బ్యాక్ నిబంధనను పూర్తిగా ఉల్లంఘించాడు. ఇలా ప్రజలమధ్యే అంతస్థులు పెంచుతున్నా, అధికార యంత్రాంగం నిశ్శబ్దంగా ఉండిపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సామాన్యుల ఇళ్లపై వేటుపడే అధికారులు ఇలాంటి భారీ అక్రమ నిర్మాణంపై ఎందుకు చర్యలు తీసుకోరని ప్రజలు మండిపడుతున్నారు. కానీ నిర్మాణం మాత్రం ఆకాశమే హద్దుగా సాగుతోందని కాలనీ వాసులు వాపోతున్నారు. ఎప్పటికైనా ఈ వ్యాపారిపై టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోని అక్రమంగా నిర్మించిన భవనాన్ని సీజ్ చేయాలనీ కోరుతున్నారు.

యువతను చెడుకు దూరంగా ఉంచేందుకే సజ్జన్ సమాజ్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : నేటి ఆధునిక సమాజంలో విద్యావంతులు అధికంగా ఉన్నప్పటికీ అదే దశలో నేరాలు, నేర ప్రవృత్తి పెరగటానికి స్వార్థం, బాధ్యతారాహిత్యమేనని సజ్జన్ సమాజ్ అంతర్జాతీయ వ్యవస్థాపక చైర్మన్ ఎంఏ. అభిలాష్ స్పష్టం చేశారు. దైవాన్ని నమ్మేవారు, నిత్యం ధార్మిక క్రతువులు భక్తితో నిర్వహించే వారిలోనే అధిక శాతం నేరాలు జరగటం బాధాకరమన్నారు. ఆదివారం మండల కేంద్రం చంద్రుగొండలోను ప్రతిభ విద్యాలయంలో జరిగిన యువజన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నేడు అధిక శాతం యువత చెడు దోవ పట్టడానికి, దుర్వ్యసనాలకు బానిసలు కావటానికి బాధ్యత పాలకుల పైనే ఏలెత్తి చూపాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. శాస్త్రీయ సాంకేతిక రంగాల్లో మనం ఎంత ఎదిగినప్పటికీ అంతే శాతం మన చుట్టూ మోసాలు దగాలు నేర ప్రవృత్తి పెరుగుతుందని సంఘటనలు వివరించారు. ఈ పరిణామాలకు పాలకులతో పాటు అన్ని మతాల ధార్మిక గురువులు, బోధకులు కూడా బాధ్యత వహించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. నేటి యువతరానికి దశ దిశ నిర్దేశం లేకపోవడం వల్లనే చెడు వ్యసనాలకు బానిసలు అవుతున్నట్లు వివరించారు. అందుకోసమే సజ్జన్ సమాజ్ సంస్థను స్థాపించటం జరిగిందన్నారు. యువతరం తమ జీవిత లక్ష్యాలను ఎంచుకొని ఆ మేరకు శ్రమించాలని విలువైన సమయాన్ని వృధా చేయకుండా ప్రతి గంటను సమీక్షించుకొని ముందుకు సాగినప్పుడే భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందన్నారు. లేకుంటే తప్పకుండా బాధలతో, అంధకారంగానే జీవితం మారుతుందని స్పష్టం చేశారు. మన దేశ, జాతి బంగారు భవిష్యత్తు యువత చేతులల్లోనే ఉందని అభిలాష్ విశ్లేషించారు. అందుకే తమ సంస్థ ఉత్తమ నైతికతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ యువతరాన్ని తర్ఫీదు ఇస్తున్నట్లు చెప్పారు. నేటి విద్యా విధానంలో భౌతిక విద్యతో పాటు నైతికతను పెంపొందించే విధానాలు కూడా ఉండాలన్నారు. నైతికత లేకపోవడం వల్లనే నేడు సమాజంలోనూ, ప్రపంచంలోను అశాంతి సర్వత్ర నెలకొందని స్పష్టం చేశారు. మన దేశ యువతరంలో అద్భుత టాలెంట్ ఉందని దాన్ని పాలకులు గుర్తించి ఆ మేరకు వారికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే సమాజంలో నేరాలు తగ్గే అవకాశాలంటాయిన్నారు. పని లేకపోవడం వల్ల వారి సమయం వృధాగా పోతూ నేర ప్రవృత్తికి కారణమవుతుందన్నారు. ఈ సమావేశంలో ప్రతిభ విద్యాలయం కరస్పాండెంట్, సామజిక వేత్త ఎండి. ఖాజా హుస్సేన్, జమాతే ఇస్లామీ హింద్ పెద్దలు ఎండి. ఇమామ్, ఖమ్మం సజ్జన సమాజ్ కన్వీనర్, ఏపీ యూత్ ఫోర్స్ హెడ్ సైఫ్ ఆర్య, జిల్లా కార్యవర్గ సభ్యులు రవి వర్మ, దొడ్డపనేని శేషగిరి, కిరణ్, రమేష్, ప్రశాంత్, వినయ్, యూత్ కాంగ్రెస్ లీడర్లు ఇమ్రాన్, వసీమ్, వసామ, దేవేందర్, పర్వీన్, షబానా, సామ్రాజ్యం, సీనియర్ జర్నలిస్ట్ ఎంఏ. వాహెద్, యువత, ఉద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్కే ఎంటర్ప్రైజెస్ను ప్రారంభించిన కొలను

విశాలాంధ్ర-దుండిగల్: ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ గండిమైసమ్మ చౌరస్తాలో రాంబాబు నూతనంగా ఏర్పాటు చేసుకున్న 'ఆర్.కె.ఎంటర్ప్రైజెస్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన చేతుల మీదుగా ప్రారంభించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షులు బైరి ప్రశాంత్ గౌడ్, ఎన్ఎంసి జనరల్ సెక్రటరీ కొలన్ జీవన్ రెడ్డి, మైనారిటీ నాయకులు అంజాద్, 130 డివిజన్ అధ్యక్షులు సోమన్నగారి శ్రీధర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, అది రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దొంతిరి హరిశంకర్ రెడ్డి జన్మదిన వేడుకలు

విశాలంధ్ర - మేడిపల్లి: పీర్జాది గూడ మున్సిపల్ కార్పొరేషన్ 25వ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆదివారం ఉదయం వారి నివాసంలో జరిగిన వేడుకలలో మాజీ మంత్రి, మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి, మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా పాల్గొని వారిని శాలువాతో సత్కరించి కుటుంబసభ్యులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసారు. అనంతరం మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి సొంత నిధులతో నిర్మించిన సాయి నగర్ హిల్స్ కాలనీ, విహారిక కాలనీ, ఇంద్రప్రస్థ కాలనీల కమాన్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, మధుసూదన్ రెడ్డి, లేతకుల మాధవి రఘుపతి రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, జావీద్ ఖాన్, ప్రభు, పింగళి జోగిరెడ్డి, బుల్లెట్ శంకర్, కిరణ్ నాయక్ డివిజన్ ప్రజలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు పత్రాలతో

భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: తప్పుడు పత్రాలు సృష్టించి 400 ఏళ్ల నాటి శివాలయం భూమిని కబ్జా చేసిన వారిపై తగిన చర్యలు తీసుకొని ఆ భూమిని రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని తెలంగాణ శివసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్, ప్రముఖ హైకోర్ట్ అడ్వకేట్ సురేష్బాబు అన్నారు. బషీర్బాగ్ ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్మెట్ మండలం, తారామత్ పేట గ్రామానికి చెందిన సర్వే నెంబర్లు 103- 116, 134- 140, 155 - 157, 242- 245ల వరకు 100 ఎకరాల భూమి రజని అలియాస్ విజయలక్ష్మి తల్లి కొరకొక్కుల భూలక్ష్మిలకు పూర్వికుల నుండి సంక్రమించిన స్థిరాస్తిని 400 ఏళ్ల శివాలయంకు వాళ్ల పూర్వికులు ఇచ్చారని చెప్పారు. ఈ భూమిపై పలు కోర్టుల్లో కేసులు పెండింగ్ ఉన్నాయని వారు తెలిపారు. ఇటీవల భూముల రేట్లు పెరగడంతో భూ కబ్జాదారులు కన్నేసి తప్పుడు పత్రాలు సృష్టించి భూమిని కాజేశారని ఆరోపించారు. తక్షణమే ఈ విషయంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకొని దేవాలయానికి చెందిన 100 ఎకరాల భూమిపై సర్వే చేయించి ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బోనాల జాతరలో మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి

విశాలాంధ్ర - మేడిపల్లి: ఘట్కేసర్, మేడిపల్లి మండల పరిధిలోని బోడుప్పల్, పర్వతపూర్ లో ఆదివారం ఉదయం బోనాల జాతర మహోత్సవంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, పీర్జాదిగూడ నగరపాలక సంస్థ మాజీ మేయర్ అమర్ సింగ్ విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ఘనంగా నిర్వహించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. బోనాల పండుగ సందర్భంగా ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ ప్రెసిడెంట్ వేముల మహేష్ గౌడ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు జగదీశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండి శ్రీనివాస్, వంగూరు పరమేష్, తవిటి ప్రశాంత్, ప్రభు, కాలనీ వాసులు, మహిళలు ఆలయ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్త తల్లి మృతిపై కంటెస్టెంట్ ఎమ్మెల్యే సంతాపం

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆదివారం, శ్రీకృష్ణ నగర్లో నివాస ఉండే సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త విజయ్ కుమార్ మోతాస్ తల్లి స్వర్గస్తులయ్యారు. దీంతో విజయ్కుమార్ కుటుంబాన్ని కంటెస్టెంట్ ఎమ్మెల్యే మహ్మద్ అజరుద్దీన్ పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. అలాగే వారి కుటుంబానికి అండదండలు అందిస్తానని తెలిపారు.

సోంపేట భూములు దోచేస్తారా?

- సహించేది లేదు... మరో పోరాటం చేస్తాం
- 11న భూముల సందర్శన
- మోదీ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ
- స్మార్ట్ మీటర్లపై దేశ వ్యాప్త ఆందోళన
- సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-తిరుపతి: సంవత్సరానికి మూడు పంటలు పండుతున్న భూములను అప్పనంగా బడా బాబులకు అప్పగించాలని చూస్తే ఊరుకునేది లేదని, సమరశీల పోరాటాలకు సిద్ధపడతామని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ హెచ్చరించారు. సీపీఐ తిరుపతి జిల్లా ద్వితీయ మహాసభలు సూళ్లూరుపేటలో ఆదివారం ప్రారంభమయ్యాయి. జిల్లా కార్యదర్శి పి.మురళి అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరయిన నారాయణ మాట్లాడుతూ సోంపేట భూములను రాష్ట్ర ప్రభుత్వం బడాబాబులకు అప్పగిస్తే చూస్తూ ఊరుకోమని, ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని, ఈ నెల 11న తానే స్వయంగా ఆ భూములను సందర్శించి పోరాటాలకు రూపకల్పన చేస్తామని తెలిపారు. గతంలో సోంపేట భూములను ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేసేందుకు పూనుకోగా కమ్యూనిస్టు పార్టీ అధ్వర్యంలో ప్రజలతో కలిసి పోరాటం సాగించామని అన్నారు. ఈ ఆందోళనలో ముగ్గురు అశువులు బాసిన విషయాన్ని గుర్తు చేశారు. నేడు తిరిగి ఆ భూములను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించాలని చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని, గతంలో రైతుల జోలికి వెళ్లిన చంద్రబాబుకు ఏ గతి పట్టిందో ఒకసారి గుర్తు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా కరేడు భూములను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించడంపై తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తమవుతున్నప్పటికీ కూటమి ప్రభుత్వం మొండి వైఖరితో ముందుకు వెళ్లడం చాలా బాధాకరమని ఆయన తెలిపారు. మోదీ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. జమ్మూకశ్మీర్‌లో మతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందుతున్నారని విమర్శించారు. స్వతంత్రంగా పని చేయాల్సిన రాజ్యాంగ వ్యవస్థలు మోదీ కనుసన్నల్లో నడుస్తున్నాయని, దీంతో దేశం తీవ్ర ప్రమాదంలో పడబోతోందని అన్నారు. స్వతంత్రంగా వ్యవహరించాల్సిన ఎన్నికల సంఘం మోదీ చెప్పుచేతల్లో పని చేస్తోందని మండిపడ్డారు. దేశంలో ప్రతిపక్ష పార్టీల కంటే అమెరికా అధ్యక్షుడు ట్రంప్... మోదీకి ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా మారారని ఎద్దేవా చేశారు. ట్రంప్ ఆదేశాలతో మోదీ తన విధానాలను అమలుపరుస్తున్నారని చెప్పారు. ట్రంప్ నిర్ణయాలతో భారతదేశ అభివృద్ధి వెనక్కి నెట్టబడుతోందని, ఆర్థిక వ్యవస్థ దివాలా తీస్తోందని అన్నారు. ట్రంప్ నిర్ణయాలపై అమెరికాలోనే తీవ్ర స్థాయిలో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని, ట్రంప్ బాటలో నడుస్తున్న మోదీకి పతనం ఖాయమని తెలిపారు. అదానీ స్మార్ట్ మీటర్ల వల్ల దేశ వ్యాప్తంగా విద్యుత్ బిల్లులు విపరీతంగా పెరిగి ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. దీనిపై రాష్ట్రంతో పాటు దేశ వ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఎక్కడయినా స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే వాటిని పగలగొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఐ ప్రజలకు అండగా నిలబడి మరో విద్యుత్ పోరాటానికి నాంది పలుకుతామని స్పష్టం చేశారు. 100 సంవత్సరాల చరిత్ర కలిగిన సీపీఐ మహాసభలు శాఖ నుంచి జాతీయ స్థాయి వరకు జరుగుతున్నాయని, ఈ మహాసభలలో దేశంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను సుదీర్ఘంగా చర్చించి భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన చేస్తున్నామని నారాయణ చెప్పారు. తొలుత జీఎన్‌టీ రోడ్డు నుంచి బజారు వీధి మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథ్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, శివారెడ్డి, జయలక్ష్మి, సీనియర్ నాయకులు తులసేంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, సుధాకర్ రెడ్డి, పార్థసారధి, చిన్నిరాజ్, గురవయ్య, ప్రభాకర్, ప్రభాకర్, విశ్వనాథ్, బాలకృష్ణ, శశి కుమార్, బండి చలపతి, కత్తి రవి, నాగేంద్ర, ఆనంద్, చిత్తూరు జిల్లా కార్యదర్శి నాగరాజన్ తదితరులు పాల్గొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య బృందం ఆలపించిన ఉద్యమ గేయాలు ఆకట్టుకున్నాయి.

7న ఇండియా భేటీ

ఎన్నికల అక్రమాలు, ఉప రాష్ట్రపతి ఎన్నికపై చర్చ

న్యూఢిల్లీ: ఇండియా ఐక్య సంఘటన నాయకులు ఈనెల 7న ఢిల్లీలో భేటీ కానున్నారు. ఎన్నికల్లో అవకతవకలు, ఉప రాష్ట్రపతి ఎన్నికపై చర్చ ఈ సమావేశం అజెండాగా ఉంది. బీహార్, ఇతర రాష్ట్రాల్లో ఎస్ఐఆర్‌పై చర్చ విషయంలో ఎవరికి వారు పట్టుదలతో ఉండటం వల్ల పార్లమెంటు 'షోడౌన్'కు అధికార-విపక్షాలు సిద్ధమయ్యారు. విమర్శలు, ప్రతి విమర్శలతో చట్టసభలను దద్దరిల్లించబోతున్నారు. ఇదే క్రమంలో ప్రతిపక్ష ఇండియా ఐక్య సంఘటన నాయకులు గురువారం భేటీ అయి తమ పంథాను నిర్ణయించనున్నారు. విపక్ష నేతలకు లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు విందు ఇవ్వబోతున్నారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి ఎన్నికపై మొదటిసారి ఇండియా నాయకులు చర్చించనున్నారు. శాసనసభాపక్ష నాయకులు చర్చను ప్రారంభిస్తారు. పార్టీల అధ్యక్షులు ఈ సంప్రదింపులను కొనసాగిస్తారు. సెప్టెంబరు 9న ఉప రాష్ట్రపతి ఎన్నికలు జరగనున్న విషయం విదితమే. భేటీ సందర్భంగా ఎస్ఐఆర్‌తో పాటు ఎన్నికల్లో అవకతవకలపై కాంగ్రెస్ సేకరించిన ఆధారాల గురించి రాహుల్ వివరిస్తారని తెలుస్తోంది. అలాగే శుక్రవారం (8వ తేదీ) ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ప్రదర్శనను ఇండియా ఎంపీలు నిర్వహించబోతున్నారు.

అలాగే, ఈనెల 5న రాహుల్ అధ్వర్యంలో బెంగళూరులో ఎన్నికల్లో అవకతవకలకు నిరసన జరగనుంది. ఇదిలావుంటే, గతేడాది లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని, 70-100 స్థానాల్లో ఫలితాలు ప్రభావితమ య్యాయని రాహుల్ ఆరోపిస్తున్నారు. పార్ల మెంటు సమావేశాలు 21వ తేదీతో ముగియ నున్న దృష్ట్యా తాము అనుకున్న అంశాలపై మరింత వ్యూహాత్మకంగా ముందుకెళ్లాలని, కేంద్రంపై తీవ్ర ఒత్తిడి తేవాలని 'ఇండియా' నాయకులు భావిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్‌పై చర్చ తర్వాత ఎస్ఐఆర్‌పై చర్చిద్దామన్న మాటను ప్రభుత్వం తప్పిందని, ఇప్పటివరకు ఈ అంశాన్ని చర్చించేందుకు అనుమతి ఇవ్వలేదని... ఎస్ఐఆర్‌పై చర్చ జరగని పక్షంలో సమావేశాలు సజావుగా సాగే పరిస్థితి ఉండబోదని ప్రతిపక్ష సభ్యులు అసహనం వ్యక్తం చేస్తుండటం విదితమే.

పోరాట యోధుడు వీఎస్

సంస్మరణ సభలో వక్తల ఉద్ఘాటన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మహోన్నతమైన పోరాట నాయకుడు వీఎస్ అచ్యుతానందన్ అని వక్తలు కొనియాడారు. విజయవాడలోని ఎంబీ విజ్ఞానకేంద్రంలో వీఎస్ అచ్యుతానందన్ సంస్మరణ సభ ఆదివారం జరిగింది. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, మాజీ ఎంపీ పి.మధు ప్రసంగించారు. రామకృష్ణ మాట్లాడుతూ నిండు నూరేళ్లు ఆయన కమ్యూనిస్టుగా జీవించడం గర్వకారణమన్నారు. ఇలాంటి నాయకులు చాలా అరుదుగా ఉంటారన్నారు. నూరు శాతం అక్షరాస్యత గల కేరళలో పెద్ద చదువులు చదువుకోని అచ్యుతానందన్ సమాజాన్ని ప్రభావితం చేసే నాయకుడయ్యారన్నారు. అచ్యుతానందన్ అవినీతి రహిత పాలన అందించారని, అవినీతిలేని కేరళకు ఆయన పునాది వేశారని కొనియాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో లౌకికవాదం, ప్రజాస్వామ్యం కోసం మరింతగా కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అందరికీ గర్వకారణంగా నిలిచిన అచ్యుతానందన్‌కు జోహార్లు అర్పించారు. ఏడుసార్లు శాసనసభ్యుడిగా, రెండుసార్లు ప్రతిపక్ష నేతగా, ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించి రాజకీయాల్లో తన దైన ముద్రవేసుకున్నారని వక్తలు కొనియాడారు. కష్టజీవులు, కార్మికులు, పేదవర్గాల సంక్షేమం కోసం అనేక సంస్కరణలు తీసుకువచ్చారని అన్నారు. తొలుత ప్రజానాట్యమండలి కళాకారులు విప్లవగేయాలు ఆలపించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నేతలు నివాళులర్పించారు.

అదృశ్యమైన నలుగురు ఎన్‌ఆర్‌ఐలు మృతి

న్యూయార్క్: అమెరికాలో న్యూయార్క్‌కు చెందిన నలుగురు భారత సంతతి వృద్ధులు అదృశ్యమైన ఘటన విషాదంగా మారింది. వెస్ట్ వర్జీనియాలోని ఓ ఆధ్యాత్మిక ప్రదేశానికి వెళ్తుండగా వారు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోయినట్లు మార్షల్ కౌంటీ పోలీసులు వెల్లడించారు. బాధితులు ఒకే కుటుంబానికి చెందిన ఆశా దివాన్(85), కిశోర్ దివాన్ (89), శైలేష్ దివాన్ (86), గీతా దివాన్ (84)గా పోలీసులు గుర్తించారు. న్యూయార్క్‌లోని బఫలో నుంచి వెస్ట్ వర్జీనియాలోని మార్షల్ కౌంటీలో ఉన్న ప్యాలెస్ ఆఫ్ గోల్డ్‌కు బయలుదేరారు. బిగ్ వీలింగ్ క్రీక్ రోడ్డులో వారి వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురయింది. రోడ్డు పక్కన ఉన్న కట్టవైపు దూసుకెళ్లడంతో ఎవరూ గమనించలేదని తెలుస్తోంది. జులై 29న అదృశ్యం కాగా వీరి వాహనం ప్రమాదానికి గురైనట్లు ఆగస్టు 2 రాత్రి పోలీసులు గుర్తించారు. ఆ నలుగురు చనిపోయినట్లు ధ్రువీకరించిన అధికారులు... కారును స్వాధీనం చేసుకున్నారు. అంతకుముందు వీరి అదృశ్యానికి సంబంధించి గాలింపు చేపట్టిన పోలీసులు... వారి ఆచూకీ తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలంటూ ఓ ప్రకటన విడుదల చేశారు. దర్యాప్తులో భాగంగా చివరిసారిగా జులై 29న వీరు పెన్సిల్వేనియాలోని ఓ రెస్టారెంట్‌కు వెళ్లినట్లు సీసీటీవీ దృశ్యాల ద్వారా గుర్తించారు. క్రెడిట్ కార్డు కూడా చివరిసారి అక్కడే వాడినట్లు తెలిసింది.

సమస్యల వలయంలో సంక్షేమ హాస్టళ్లు

రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లు సమస్యలతో కునారిల్లుతున్నాయి. మౌలిక వసతులు లేకపోవడంతో కొన్ని లక్షల మంది విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) అధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జులై 21 నుంచి 31 వరకు ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల సందర్శన కార్యక్రమం జరిగింది. సంక్షేమ హాస్టళ్లు అన్నీ ఏఐఎస్ఎఫ్ నాయకులకు సమస్యలతో స్వాగతం పలికాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, రెసిడెన్షియల్, మోడల్, కేజీబీవీ, గురుకుల సంక్షేమ హాస్టళ్లలో చదువుకునే విద్యార్థులందరూ నిరుపేద కుటుంబాలవారే. దశాబ్దాల తరబడి ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు దూరమైపోయి బాగా చదువుకొని జీవితంలో ఏదో సాధించాలని, సమాజంలో గౌరవాన్ని పొందాలని కుటుంబ ఆర్థిక పరిస్థితులను మార్చాలన్న కలలు కంటున్న వారే. అయితే చదువుకుందామని పట్టణాలకు వచ్చి సంక్షేమ హాస్టళ్లలో చేరుతున్న విద్యార్థులకు మంచి సౌకర్యాలు ఏర్పాటు చేసి ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం పూర్తిగా మోసం చేస్తోంది. 200 మందికి పైగా ఉన్న విద్యార్థులకు కేవలం నాలుగు మరుగుదొడ్లు ఉండటం, సరిపడా స్నానపు గదులు లేక మగ పిల్లలు హాస్టల్ పరిసరాల్లో ఆరుబయటే స్నానం చేస్తున్నారు. ఉదయమే మరుగు దొడ్ల బయట క్యూ కట్టే పరిస్థితి నెలకొంది. కొన్ని హాస్టళ్లలో సమయానికి కుక్‌లు రాకపోతే విద్యార్థులే వంట చేసుకునే దుస్థితి. అనేక హాస్టళ్లలో విద్యార్థులకు ఉడికీ ఉడకని భోజనం, నీళ్ల సాంబారు పెట్టడం వలన విద్యార్థులు అనేక మంది అన్నా క్యాంటీన్‌కి వెళ్లి భోజనం చేస్తున్నారు. ఇంతవరకు ట్రంక్ పెట్టెలు, దుప్పట్లు, దోమతెరలు కూడా ప్రభుత్వం పూర్తి స్థాయిలో అందించలేదు. లైట్లు, ఫ్యాన్లు, కిటికీలు లేక విద్యార్థులు దోమల స్వైరవిహారం మధ్యే నిద్రిస్తున్నారు. ఇక సంక్షేమ హాసళ్లకు 50 శాతం శాశ్వత భవనాలు లేకపోవడంతో విద్యార్థులు చాలీచాలని గదులలో ఇరుక్కుంటూ నిద్రిస్తున్నారు. అద్దెలు కట్టడం వలన ఆ శాఖకు ఆర్థిక భారం తప్ప మరేమీ లేదు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం శాశ్వత భవనాలను నిర్మించి విద్యార్థులకు న్యాయం చేయాలి. కేజీబీవీ, రెసిడెన్షియల్, మోడల్ స్కూల్స్ హాస్టళ్లలో దాదాపు 6 లక్షల 30 వేల మంది విద్యార్థులకు పైగా చదువుకుంటున్నారు. పాలకులు ఇచ్చిన హామీ మేరకు బిడ్డలకు పౌష్టికరమైన ఆహారం, నాణ్యమైన విద్య అందిస్తారన్న నమ్మకంతో వీటిల్లో చేర్పిస్తుంటే విద్యార్థులకు అవేవీ అవేవీ అందడం లేదు. సమయానికి డైట్ చార్జీలు అందించకపోవడంతో మెనూలో నాణ్యత పూర్తిగా లోపించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన అన్న క్యాంటీన్‌లో పేదలకు మూడు పూటలు భోజనానికి రూ.90 ఖర్చవుతుంది. అందులో పేదలు కేవలం 15 రూపాయలు చెల్లిస్తే చాలు 75 రూపాయలు పూర్తిగా ప్రభుత్వం భరిస్తోంది. అన్నా క్యాంటిన్‌లో గుడ్లు, పాలు, చికెన్, స్నాక్స్ వంటివి అందిస్తున్నారు. కానీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు మాత్రం పైన పేర్కొన్నవన్నీ ఉన్నాయి. కానీ వారికి మూడు పూటలకే మెస్ చార్జీ కేవలం రూ.53 మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోంది. అన్న క్యాంటీన్ పేరుతో ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారా లేదా సగటు విద్యార్థులకు కనీసం మనిషి తినలేని నాసిరకమైన భోజనం పెడుతున్నారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వార్డెన్‌లు అందరూ సరుకులను అప్పుగా తీసుకువస్తున్నారు. కుళ్లిపోయిన టమాటాలు, ఉల్లిపాయలు, కూరగాయలతో వంట చేయడం వలన విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయ్యి అనేక మంది ఆసుపత్రి పాలవుతున్నారు. ఒక పక్క రాష్ట్ర వ్యాప్తంగా వార్డెన్‌లు అందరూ మాకు ముడి సరుకులు కొనాలంటే రూ.73 అవుతుంది... మరి మీరు రూ.53 ఇస్తే ఎలా అని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉన్నారు. కూటమి ప్రభుత్వం హయాంలో సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు నరకం చూస్తున్నారు. కొన్నిచోట్ల హాస్టళ్లలో శాశ్వత వార్డెన్‌లను ఇంతవరకు ప్రభుత్వం నియమించలేదు. ఒక హాస్టల్‌లో పని చేస్తూ మరొక హాస్టల్‌కు ఇంఛార్జ్ వార్డెన్‌గా ఉండటం వలన విద్యార్థుల యోగక్షేమాలు చూసేవారు ఎవరూ లేరు. అలాగే కళాశాల సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల మెస్ చార్జీల నుంచే కుక్‌లకు జీతం ఇచ్చే పరిస్థితి ఉంది. ఇప్పటికే ప్రభుత్వం ఇచ్చే మెస్ చార్జీలు సరిపోవటం లేదని విద్యార్థులు, విద్యార్థి సంఘాలు వాపోతున్న తరుణంలో మెస్ చార్జీల నుంచి కుక్‌లకు జీతాలు ఇస్తుంటే ఇంకా విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఏ విధంగా అందుతుంది? తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం సమీక్షించి సంక్షేమ హాస్టళ్లను అభివృద్ధి వైపుగా తీసుకువెళ్లాలి. నెల రోజుల్లో సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధి వైపుగా అడుగులు వేయకపోతే ఈ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) అధ్వర్యంలో ఉద్యమాలు చేపడతాం.

– బందెల నాసర్ జీ
ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఈసీ తీరు ప్రశ్నార్థకం: గొగోయ్

గువహతి: ఎన్నికల సంఘం తీరు ప్రశ్నార్థకంగా ఉందని, అందుకోసమే పార్లమెంటులో చర్చ కోసం ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ అన్నారు. సామాన్యులకు తమ ఓటింగ్ హక్కుల స్థితి, పోలింగ్ కేంద్రాల వివరాలు తెలియాలన్నారు. అన్ని వివరాలపై స్పష్టత కోసమే చర్చను కోరుతుంటే కేంద్రం అనుమతివ్వడం లేదని, దీనిపై చర్చించడం కుదరదని అంటోందని గొగోయ్ తెలిపారు. గువహతి, డిస్పూర్‌లోని మనబేంద్రా శర్మ కంపెక్స్‌లో ఆదివారం అసోం ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం సందర్భంగా గొగోయ్ విలేకరులతో మాట్లాడారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను నియమించినప్పటికీ ఈసీఐ గురించి చర్చకు కేంద్ర ప్రభుత్వం ఒప్పుకోకపోవడం అనేక ప్రశ్నలకు తావిస్తోందన్నారు. ప్రభుత్వం ఏదో దాయాలని చూస్తోందని, అదేమిటన్న ప్రశ్న అందరి మదిలో ఉందని అన్నారు. గత లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో మోసాలు జరిగాయా అని గొగోయ్ ప్రశ్నించారు. 'ఎన్నికల సంఘానికి ఏదేని శాఖతో సంబంధం లేదని ప్రభుత్వం వాదిస్తోంది కానీ ఈ లాజిక్ అర్థం కావడం లేదు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను ప్రధాని, ప్రభుత్వం నియమించగలిగినప్పుడు, ఎన్నికల సంఘం తీరుపై చట్టసభల్లో చర్చకు సమస్య ఏమిటి' అని వ్యాఖ్యానించారు. ఓటింగ్ వేళ జాబితాల్లో తమ పేర్లు ఉన్నాయో లేదో అని చూసుకునేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలు వచ్చే సందర్భాలు ఉన్నాయని గుర్తుచేశారు. ఆపరేషన్ సిందూర్‌పై ప్రశ్నకు గొగోయ్ స్పందిస్తూ 'పహల్గాం మృతులకు కేంద్ర హోంమంత్రి కనీస గౌరవం ఇవ్వలేదు. ఆయన నేతృత్వ సంస్థల నిఘా వైఫల్యం వల్లే వారు చనిపోయారు. అయినప్పటికి ప్రజలకు క్షమాపణ కూడా చెప్పలేదు. ఇది ఆయన నైజం' అని అన్నారు.

రాష్ట్రపతితో మోదీ, షా భేటీ

న్యూఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వేర్వేరుగా భేటీ అయ్యారు. రాష్ట్రపతి భవన్‌కు వెళ్లి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ విషయాన్ని రాష్ట్రపతి కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. ఆదివారం మధ్యాహ్నం ప్రధాని, సాయంత్రం అమిత్‌షా భేటీ అయినట్లు పేర్కొన్నాయి. వీరి వరుస భేటీల వెనక కారణాలు తెలియలేదు. కొన్ని గంటల వ్యవధిలోనే రాష్ట్రపతితో మోదీ, అమిత్‌షా సమావేశం కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. పార్లమెంటు వర్షాకాల సమావేశాల వేళ ఈ పరిణామం చర్చకు దారితీసింది. పార్లమెంటు సమావేశాలు ఈనెల 12వ తేదీ వరకు జరగనున్నాయి. ఇటీవలే ఆపరేషన్ సిందూర్‌పై ఉభయ సభల్లో ప్రత్యేక చర్చ జరిగిన విషయం తెలిసిందే.

తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కీలక నిర్ణయం

హైదరాబాద్: తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. తాము ఆశించినట్టు వేతనాన్ని 30 శాతం పెంచిన నిర్మాతల సినిమాల షూటింగులకే సోమవారం నుంచి హాజరుకావాలని కార్మిక సంఘాల నాయకులకు సూచించింది. కార్మికుల వేతనాలపై ఫిల్మ్ ఫెడరేషన్- ఫిల్మ్ ఛాంబర్ మధ్య చర్చలు జరుగుతున్న క్రమంలో ఫెడరేషన్ ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించింది. వేతనాల పెంపు విషయంలో కో- ఆర్డినేషన్ కమిటీ చైర్మన్‌లుగా వీరశంకర్, సయ్యద్ హుమయూన్‌ను నియమించారు. 30 శాతం వేతనం పెంచి ఇస్తామన్న నిర్మాతల ఒప్పంద పత్రాన్ని ఫెడరేషన్ ద్వారా యూనియన్లకు తెలియజేసిన తర్వాతే షూటింగులకు వెళ్లాలన్నారు. అప్పటి వరకూ ఫిల్మ్ ఫెడరేషన్ సభ్యులెవరూ సినిమాలు, వెబ్‌సిరీస్‌ల షూటింగులకు హాజరుకాకూడదని నిర్ణయించారు. తెలుగు సినిమాల చిత్రీకరణ ఎక్కడ జరిగినా, ఇతర భాషా చిత్రాలకు పని చేయాలనుకున్నా ఈ నిబంధనలు వర్తిస్తాయని తెలిపారు. గతంలో జరిగిన ఒప్పందం ప్రకారం ఫిల్మ్ ఫెడరేషన్ డిమాండ్ చేయగా ఫిల్మ్ ఛాంబర్ 5 శాతం మేర వేతనం పెంపునకు సిద్ధమైంది.

అనిల్ అంబానీ కేసులో బిశ్వల్ అరెస్టు

న్యూఢిల్లీ: రిలయన్స్ గ్రూపు చైర్మన్ అనిల్ అంబానీపై రూ.3వేల బ్యాంకు రుణం మోసానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో మొదటి అరెస్టు జరిగింది. బిశ్వల్ ట్రేడ్ లింక్ ప్రై.లి. మేనేజింగ్ డైరెక్టర్ పార్థసారథి బిశ్వల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈనెల 5న విచారణకు హాజరు కావాలన్న నోటీసులతో పాటు అనిల్ అంబానీకి లుకౌట్ సర్క్యులర్ జారీ అయిన మరుసటి రోజు బిశ్వల్ అరెస్టు ప్రాధాన్యతను సంతరించుకుంది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద బిశ్వల్‌ను అరెస్టు చేసినట్లు ఈడీ అధికారి వెల్లడించారు. బ్యాంకు హామీ కోసం నకిలీ పత్రాలకుగాను అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ పవర్ లిమిటెడ్ నుంచి రూ.5.4 కోట్లను బిశ్వల్ ట్రేడ్ లింక్ ప్రై.లి. (బీటీపీఎల్) పొందినట్లు తమ విచారణలో తేలిందన్నారు. అంబానీ కార్పొరేట్ నెట్‌వర్క్‌తో బీటీపీఎల్ మోసపూరిత కార్యకలాపాలను ముడిపెట్టేందుకు కీలక అంశంగా ఈ ఆర్థిక లావాదేవి ఉందన్నారు. ఒడిశాకు చెందిన ఈ కంపెనీ కనీసం ఏడు గోప్య బ్యాంకు ఖాతాలను కలిగివుందని, అధికారిక రికార్డులు లేకుండా, పత్రాలపై సంతకాల కోసం డమ్మీ డైరెక్టర్లను వాడిందని తెలిపారు. వ్యాపార సంఘాలకు బ్యాంకులకు నకిలీ హామీ పత్రాలు ఇచ్చే ముఠాను బీటీపీఎల్ నడిపుతున్నదని, ఎనిమిది శాతం కమీషన్‌తో నకిలీ బిల్లులు ఇస్తుందని, గోప్యంగా అనేక బ్యాంకు ఖాతాలు నిర్వహిస్తోందని ఈడీ అధికారి వెల్లడించారు. కోట్లలో అనుమానాస్పద లావాదేవీలు జరిగాయన్నారు. ఇది డొల్ల కంపెనీ, దీని రిజిస్ట్రేషన్ కాగితాలకే పరిమితమని చెప్పారు. ఈ కంపెనీ కార్యాలయంగా పేర్కొన్న ప్రాంతం వాస్తవానికి నివాస స్థలమని ఈడీ అధికారి వెల్లడించారు. ఈ కంపెనీకి సంబంధించి భువనేశ్వర్‌లోని మూడు చోట్లతో పాటు అనుబంధ సంస్థకు చెందిన కోల్‌కతాలో ఆస్తిని ఈడీ శుక్రవారం సోదా చేసిన విషయం విదితమే.

35 రకాల మందుల ధరలు తగ్గాయి

న్యూఢిల్లీ: దీర్ఘకాలిక వ్యాధులకు వినియోగించే 35 రకాల మందుల ధరలను కేంద్రం తగ్గించింది. ఒంటినొప్పులు, గుండె సంబంధిత, మధుమేహం, మానసిక వ్యాధుల చికిత్సకు ఉపయోగించే ఔషధాలపై తగ్గింపు వర్తించనున్నది. ప్రముఖ ఫార్మాస్యూటికల్ కంపెనీలు విక్రయిస్తున్న మందుల రిటైల్ ధరలను జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ (ఎన్‌పీపీఏ) తగ్గించింది. ఈ మేరకు రసాయనాలు-ఎరువుల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. యేసిలోఫెనాక్, పారాసెటమాల్, ట్రిప్సిన్ కైమోట్రిప్సిన్ ఫిక్స్‌డ్-డోస్ కాంబినేషన్, అమోక్సిసిలిన్-పొటాషియం క్లావ్యులానేట్, అటోర్వాస్టాటిన్, ఎంపాగ్లిఫ్లోజిన్, సిటాగ్లిప్టిన్, మెట్‌ఫార్మిన్ వంటి మందులు ఈ జాబితాలో ఉన్నాయి. డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ విక్రయించే యేసిలోఫెనాక్-పారాసెటమాల్-ట్రిప్సిన్ కైమోట్రిప్సిన్ మాత్ర ధరను రూ.13గా నిర్ణయించింది. క్యాడిలా ఫార్మాస్యూటికల్స్ విక్రయించే అదే ఫార్ములేషన్ ధరను 15.01గా పేర్కొంది. గుండె సంబంధిత వ్యాధులున్న వారు విస్తృతంగా వాడే మెడిసిన్ అయిన అటోర్వాస్టాటిన్ 40 ఎంజీ క్లోపీడొగ్రెల్ 75ఎంజీ ట్యాబెట్ల ధరలను రూ.25.61గా నిర్ణయించింది. పిల్లలకు వాడే సెఫిక్సిమ్, పారాసెటమాల్ ఓరల్ సస్పెన్షన్స్, విటామిన్ డీ లోపమున్న వారికిచ్చే కోలికాల్సిఫెరాల్ డ్రాప్స్, డైక్లోఫెనాక్ ఇంజెక్షన్ ధరను రూ.31.77కి తగ్గించింది. మందుల దుకాణాల్లో తాజా ధరల జాబితాను స్పష్టంగా ప్రదర్శించాలని రిటైలర్లు, డీలర్లను ఆదేశించింది. ధర తగ్గించిన మందులను అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించింది. నిబంధనలు ఉల్లంఘిస్తే ఔషధ ధరల నియంత్రణ ఆర్డినెన్స్ - 2013, ఎసెన్షియల్ కమెడిటీస్ యాక్ట్-1955 ప్రకారం జరిమానాలు తప్పబోవని తేల్చిచెప్పింది. ఔషధ తయారీ కంపెనీలు కొత్త ధరల జాబితాను ఇంటిగ్రేటెడ్ ఫార్మాస్యూటికల్ డేటాబేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో అప్‌డేట్ చేయాలని, ఎన్‌పీపీఏ, రాష్ట్రాల డ్రగ్ కంట్రోలర్స్‌కు సమర్పించాలని శాఖ ఉత్తర్వులు పేర్కొన్నాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.